మార్చి
2025

227

సంపుటి : 20 సంచిక : 10

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

సరళీకరణ యుగంలో వ్యవసాయ సంక్షోభం
చైనాలో ఆర్థికాభివృద్ధి- ఇటీవలి పరిణామాలు
మహిళల పట్ల వెనుకబాటు భిప్రాయాలను పారద్రోలాలి
కేంద్రప్రభుత్వప్రయివేటీకరణ విధానాలను ఎదురొడ్డిన విశాఖ స్టీల్ కార్మికోద్యమం
ప్రాచీన, మధ్య యుగాల వ్యవసాయ సాంకేతికత పరిణామం-2
భారత ఉపఖండంలో సాంకేతిక పద్ధతుల వ్యాప్తి
స్వామిభక్తి మార్గం పట్టిన స్వతంత్ర మీడియా
విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న కేంద్రం
దేశ ప్రతిష్ఠను దిగజార్చిన మోడి అమెరికా పర్యటన
మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా ఇతిహాసాల వక్రీకరణ

# మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా
# ఇతిహాసాల వక్రీకరణ

పిబి చారి

ఇటీవల విజయవాడ సమీపంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన బహిరంగ సభలో హిందూత్వ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే అనేక ప్రసంగాలు, వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు నడిచాయి. అందులో సినిమా రచయిత చేగొండి అనంత శ్రీరామ్ సినిమాల్లో కర్ణుడి పాత్రను ఉన్నతంగా చూపించడాన్ని కూడా ఆక్షేపించారు. సినిమా పరిశ్రమ అలాంటి వాటిని నిషేధించాలని లేకుంటే 'హైందవులుగా మనం బహిష్కరించాలి' అని అన్నారు. "ఈ కృష్ణా జిల్లా గడ్డమీద నుండి మాట్లాడుతున్నాను. ఈ జిల్లాకు సంబంధించిన గతంలోని దర్శకులు ఇప్పటి నిర్మాతలు కొంతమంది సినిమాలు తీసి మహాభారతంలో కర్ణుడు లాంటి పిరికి వాడిని గొప్పవాడిగా చూపిస్తున్నారు" అని పరోక్షంగా ఎన్టీఆర్ నిర్మించిన దానవీరశూరకర్ణ సినిమా గురించి పేర్కొన్నారు. బిఆర్ పంతులుగారు తమిళంలో "కర్ణ" అనే సినిమా తీశారు. అందులో కర్ణుడిగా శివాజీ గణేషన్, కృష్ణుడిగా ఎన్టీ రామారావు నటించారు. అందులో "గాలికి కులమేది, నీటికి కులం ఏది"అనే అద్భుతమైన పాట ఉంటుంది. కుల వివక్ష గురించి మాట్లాడాలంటే కర్ణుడి కథలోకి వెళ్ళటం ఒక ఆనవాయితీగా మారింది. కర్ణుడి ఆధారంగా సోషలైజ్ చేసి తీసిన అనేక సినిమాలు ఉన్నాయి. "కటకటాల రుద్రయ్య" సినిమాయే "దళపతి" మణిరత్నం తీసిన సినిమా. ఇవన్నీ భారతంలోని కర్ణుడి పాత్రను దృష్టిలో పెట్టుకుని తీసిన సినిమాలే.

**కర్ణుడు లేని భారతమా!**

తింటే గారెలు తినాలి వింటే మహాభారతం వినాలి అన్న నానుడి మనం ఎప్పటినుంచో వింటున్నాం. వ్యాసుడు రాశాడు అని భావించే మహాభారతం ప్రాచీనమైనది. అది క్రీస్తుపూర్వం పదో శతాబ్దం నుండి క్రీస్తుశకం నాలుగవ శతాబ్దం వరకు ఉన్న పరిస్థితికి అద్దం పడుతుంది. మొదట ఇందులో 8,800 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. అప్పుడు దాన్ని "జయం" అని పిలిచారు. ఆ తరువాత "జయేతి హాసం" అన్నారు. తర్వాతి కాలంలో శ్లోకాల సంఖ్య 24,000కు పెరిగింది. అప్పుడు దాన్ని "భారతం" అన్నారు. చివరకు ఈ గ్రంథంలోని శ్లోకాల సంఖ్య లక్షకు పెరిగింది. అప్పుడు ఆ గ్రంథాన్ని "మహాభారతం" లేదా ''శత సహస్ర సంహిత'' అన్నారు. మహాభారతం దాని ముందున్న పీఠికను చదివితే అందులో "భారతం" అనే మరొక పాఠం ఉన్నదని మనకు తెలుస్తుంది. జనమేజయుడు యజ్ఞం చేస్తుండగా యజ్ఞకర్మకాండలో భాగంగా వైశంపాయనుడు చెప్పిన కథయే భారతం. భారతం నిజమా, కాదా, జరిగిందా లేదా అన్నది పక్కన పెడితే, ఇతర అనేక దేశాలకు ఇతిహాసాలు ఉన్నట్లే భారతదేశానికి కూడా మహా భారతం అన్నది ఒక ఇతిహాసం. మహాభారతంలో ఉన్న అన్ని పాత్రలు ఆయా పాత్రల బలం బలహీనతలు రెండిటినీ ప్రతిఫలిస్తూ ఉంటాయి.

ఇన్నాళ్లూ రామాయణాన్ని, రాముడిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తూ వచ్చిన వారు ఇప్పుడు మహాభారతాన్ని కూడా ఆ రాజకీయాల్లోకి లాగుతున్నారు. హైందవ శంఖారావం సభలో అనంత శ్రీరామ్ మాట్లాడుతూ కర్ణుడు ఒక పిరికివాడనీ, గంధర్వ సైన్యాన్ని చూసి మిత్రుడిని కూడా వదిలిపెట్టి పారిపోయిన భీరుడని అపహాస్యం చేస్తూ,ఎన్టీఆర్ దానవీరశూరకర్ణ నుండి మొదలుకొని ఈ మధ్య తీసిన కల్కి సినిమాలో కూడా కర్ణుడి పాత్ర గొప్పగా చూపించారని అది హైందవానికి వ్యతిరేకమని అన్నారు. కానీ ఈ శంఖారావం పూరించిన వారికి మన ఇతిహాసాల గురించి కూడా పూర్తిగా తెలియదనుకోవాలా, లేక ఇతిహాసాలను కూడా తమ హిందూత్వ మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా మార్చే ప్రయత్నం అనుకోవాలా?

అసలు కర్ణుడు అర్జునుడికి మించిన వీరుడు అని వ్యాసభారతంలోనే ఉన్నది. పాండవులందరూ ఎలా పుట్టారో కర్ణుడూ



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

అలాగే పుట్టాడు. కుంతికి వివాహం కాకముందే దుర్వాసుని మంత్రంతో సూర్యుడి వలన కర్ణుడు జన్మించాడని చెప్పబడింది. పెళ్లి కాకముందే పుట్టాడు కాబట్టి, ఆ విషయం దాచిపెట్టి అతన్ని వదిలించుకుంటుంది కుంతి. కర్ణుడితోపాటు మిగిలిన పాండవులు ఐదుగురు కూడా పాండురాజుకు పుట్టిన వారు కాదు. కానీ పాండవులు ఐదుగురికి లభించిన స్థానం కర్ణుడికి లభించకపోవడం కూడా అన్యాయమే. కర్ణుడు సూతకులంలో పెరుగడమే దీనికి కారణం.

గుర్రాలకు జీనులు వేయడం, గుర్రం సంరక్షణ వీళ్ళ వృత్తి. ఆ కులంలో పెరిగాడు కాబట్టి కర్ణుడిని తక్కువ కులం వాడిగా చూడటం జరిగింది. అందువలననే కర్ణుడిని మనం ఒక "విక్టిమ్"గా చూస్తాం. కర్ణుడు అడిగిన వారికి లేదనకుండా దానం చేసి దానకర్ణుడైనాడు. యుద్ధానికి ముందే తన ప్రాణానికి రక్షణ అయిన సహజ కవచకుండలాలను అర్జునుడి తండ్రి అయిన దేవేంద్రుడికి దానం చేశాడు. యుద్ధభూమిలో ధర్మరాజు ఆయన సోదరులు ముగ్గురు కర్ణుడి చేతిలో ఓడిపోయినా కుంతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి వాళ్లను వధించ కుండా ప్రాణదానం చేశాడు. యుద్ధభూమిలో రథం కుంగిపోయి అర్జునుడి బాణాలు శరీరంలోకి చొచ్చుకు వచ్చినా ఆ సమయంలో కృష్ణుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి బంగారం దానం చేయమని అడిగితే తన నోటిలో ఉన్న బంగారపు పన్నును విరగ్గొట్టి కృష్ణుడికి దానం చేశాడు. అలాంటి దానవీర కర్ణుడిని పిరికివాడు అంటూ గెలిచేశాడు అనంత శ్రీరామ్. కర్ణుడు పరశురాముని వద్ద

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా ఇతిహాసాల వక్రీకరణ
పిబి చారి..........2

2. సరళీకరణ యుగంలో వ్యవసాయ సంక్షోభం
పి సాయినాథ్........4

3. చైనాలో ఆర్థికాభివృద్ధి- ఇటీవలి పరిణామాలు
ఎంవిఎస్ శర్మ ........7

4. మహిళల పట్ల వెనుకబాటు భిప్రాయాలను పారద్రోలాలి
విఐ లెనిన్....... 13

5. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను ఎదురొడ్డిన విశాఖ స్టీల్ కార్మికోద్యమం
సిహెచ్ నర్సింగరావు...... 14

6. ప్రాచీన, మధ్య యుగాల వ్యవసాయ సాంకేతికత పరిణామం-2
ఎంవిఎస్ శర్మ........17

7. భారత ఉపఖండంలో సాంకేతిక పద్ధతుల వ్యాప్తి
డా॥ గేయానంద్........19

8. స్వామిభక్తి మార్గం పట్టిన స్వతంత్ర మీడియా
కల్పా శర్మ........ 26

9. విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న కేంద్రం
ప్రొ॥ కృష్ణ కుమార్........29

10. దేశప్రతిష్ఠను దిగజార్చిన మోడి అమెరికా పర్యటన
ఎ కోటిరెడ్డి..... ....32



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రాష్ట్రాధికారాలు రక్షించుకోవాలి!

విశ్వవిద్యాలయాల్లో వైస్-ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి యుజిసి ద్వారా బిజెపి నాయకత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం జారీ చేసిన కొత్త నిబంధనావళికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిబ్రవరి చివరిలో లేఖ రాసింది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకే కాదు, రాష్ట్రాల హక్కులకు సంబంధించిన అతి ముఖ్యమైన ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేస్తారో లేదో తెలియదుగానీ పౌర సమాజం మాత్రం దీనిపై విస్తృతంగా చర్చించి యుజిసి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజాఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఉంది.

2025 కొత్త సంవత్సరం ప్రారంభంలో యుజిసి ద్వారా కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఈ కొత్త నిబంధనావళి 1, రాజ్యాంగం రాష్ట్రాలకు ప్రసాదించిన హక్కులను హరించడం ద్వారా ఫెడరల్ వ్యవస్థపై దాడి చేస్తుంది. 2, ఉన్నత విద్యపై తీవ్రంగా దాడిచేసి దాన్ని నిర్వీర్యం చేస్తుంది.

యుజిసి లెక్క ప్రకారం దేశంలో 56 కేంద్ర యూనివర్శిటీలు, 481 రాష్ట్ర యూనివర్శిటీలు ఉన్నాయి. రాష్ట్ర యూనివర్శిటీలకు వైస్-ఛాన్సలర్లను నియమించే అధికారం ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. కానీ కేంద్రం మార్చిన నిబంధనలను బట్టి ఇకనుండి వైస్-ఛాన్సలర్ల నియామక అధికారం ఆయా రాష్ట్ర గవర్నర్లకు దఖలు పడుతుంది. అంటే ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో కూడా కేంద్రం తనకు ఇష్టమైన వైస్-ఛాన్సలర్లను గవర్నర్ల ద్వారా నియమించగలుగుతుందన్న మాట. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కేరళ గవర్నర్‌గా ఉన్నప్పుడు రాష్ట్రంలో వైస్-ఛాన్సలర్ల నియామకం విషయంలో ఎల్‌డిఎఫ్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారో చూశాం. ఇంక ఇప్పుడు ఏకంగా గవర్నర్లకే అధికారం కట్టబెడితే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వ విద్యాలయాలపై పట్టు కోల్పోతాయి. ఇది ఒక రకంగా కేంద్ర ప్రభుత్వం దొడ్డిదోవన రాష్ట్ర విశ్వవిద్యాలయాల అజమాయిషీని తన చేతుల్లోకి తీసుకోవడమే అవుతుంది. ఇప్పటికే అన్ని వ్యవస్థల్లోకీ తన హిందూత్వ భావజాలాన్ని చొప్పించేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇకపై విశ్వ విద్యాలయాల్లో కూడా ఆర్ఎస్ఎస్ అనుయాయులను నియమించడం ద్వారా ఆ ఉన్నత విద్యాసంస్థలను కాషాయమయం చేయబూనుకుంటుంది.

ఇక రెండవది, విశ్వ విద్యాలయాలకు అకాడమిక్ అర్హతలు లేని వారిని కూడా నియమించే అవకాశం కల్పిస్తూ యుజిసి నిబంధనలు సడలించింది. ఇప్పటవరకు అకాడమిక్‌గా ఉన్నత ప్రమాణాలు, అర్హతలున్న వారినే వైస్-ఛాన్సలర్లుగా నియమిస్తూ వచ్చారు. ఇకపై పారిశ్రామిక వేత్తలనూ, ఇతరులను కూడా నియమించవచ్చుననీ, దాని వల్ల విశ్వ విద్యాలయాలు పరిశ్రమలతో అనుసంధాన మవుతాయని సెలవిచ్చారు. కానీ ఇది విశ్వ విద్యాలయాలు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లి పూర్తిగా వ్యాపారీకరణ చెందడానికి దారితీస్తుంది. ఈ నిబంధనను విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.


రాష్ట్రాల హక్కులను కాలరాసే ఈ నిబంధనావళిని కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. నిజానికి ఇది పార్టీలతోనూ, కూటములతోనూ ముడిపడిన విషయం కాదు, కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీకి సంబంధించిన విషయం. కేంద్రం అక్రమ మార్గంలో రాష్ట్రాల అధికారాలు లాగేస్తుంటే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు రీత్యా దాన్ని వ్యతిరేకించాలి. కానీ తమది డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. మోడీ రెండో ఇంజను చక్రాలు ఊడదీసేస్తుంటే ఏం చేస్తున్నట్లు. ఇది తెలుగు దేశం పార్టీ, లేక జనసేన పార్టీ వ్యవహారం కాదు. రాష్ట్ర ప్రజల హక్కులు, అధికారాలకు సంబందించిన వ్యవహారం. అందుకని రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను మోడీ ముందు తాకట్టు పెట్టకుండా ఉండాలంటే తక్షణం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలి. కానీ చంద్రబాబు వైఖరి మోడీ ప్రభుత్వ చర్యలను ఎదిరించడం అటుంచి వాటిని మరింత బలంగా రాష్ట్రంలో అమలు చేసేవిధంగా ఉంది. విశ్వవిద్యాలయాలను ప్రయివేటు పరం చేయడం, విదేశీ విశ్వ విద్యాలయాలకు ఎర్రతీవాచీ పరచడం తన విజన్ 47లో భాగం అని చెబుతున్న చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను ఎలా కాపాడగలుగుతారు?

పైగా యుజిసి నిబంధనలు పాటించకపోతే కేంద్రం నుండి పలు ప్రాజెక్టులకు వచ్చే నిధులను ఆపేస్తామని కేంద్ర ప్రభుత్వం ఒక బెదిరింపు టాగ్‌ను కూడా దీనికి తగిలించింది. ఇది మరో నిరంకుశమైన చర్య, రాష్ట్రా హక్కులు హరించడమే కాకుండా వాటిని బలవంతంగా లాంగదీసుకునే ప్రయత్నం.

మొత్తం మీద యుజిసి ద్వారా కేంద్ర రాష్ట్రల మీద బనాయిస్తున్న ఈ నిబంధనలను అమలు చేస్తే ఇటు రాష్ట్రాల హక్కులు హరించబడ్డమే కాదు, విశ్వ విద్యాలయాల అకడమిక్ నాణ్యత కూడా దెబ్బతింటుంది. ఉన్నత విద్యను కాషాయీకరణం గావించడానికి ఇది మరో మార్గం తెరుస్తుంది. అందువల్ల విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలే కాకుండా ప్రజాతంత్ర, లౌకిక శక్తులంతా ఈ నిబంధలను వ్యతిరేకించాలి. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# సరళీకరణ యుగంలో వ్యవసాయ సంక్షోభం



రచయిత ప్రముఖ పాత్రికేయుడు. గతంలో హిందు పత్రికలో గ్రామీణ రంగం సంపాదకులుగా పనిచేశారు

పి సాయినాథ్

**1980** దశకం ఆరంభంలో రైతుల ఇళ్లకు వెళ్ళినపుడు ఒకగ్లాసు తాజా పాలు తాగమని ఇచ్చేవారు. మహారాష్ట్ర పశ్చిమ ప్రాంతంలో అయితే రైతులతో మాట్లాడి తిరిగి వెళ్ళటానికి సిద్ధమైనపుడు మరోగ్లాసు పాలు ఇచ్చేవారు. ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంతంలో కొన్ని కుటుంబాల వారు పాలు వెండిగ్లాసులో ఇచ్చేవారు. అది అతిధిని గొప్పగా సత్కరించటంతో పాటు ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగున్నదని వెల్లడించటానికి చిహ్నంగా ఉండేది.

తమిళనాడులో పాలు రాగి గ్లాసులలో ఇచ్చేవారు. కొన్ని సమయాలలో రుచికరమైన ఫిల్టర్ కాఫీ ఇచ్చేవారు. 1990వ దశాబ్దంలో అనేక రాష్ట్రాల్లో వెండిగ్లాసు స్థానంలోకి స్టీలుగ్లాసు వచ్చింది. 1991లో కూడా వారు మీకు స్వచ్ఛమైన పాలనే ఇస్తుండేవారు. అయితే రాగి గ్లాసు స్థానంలోకి పింగాణీ కప్పు వచ్చింది. కప్పులకు తరచుగా పగుళ్ళు కనిపించేవి, అంచుల వద్ద పెచ్చులు లేచిపోయి కనిపించేవి. 1990వ దశాబ్దం మధ్యనాటికి గ్లాసుల నుండి కప్పులలో తాగే పరిస్థితి నాకు ఎదురైంది.

2000 సంవత్సరం వచ్చేసరికి పాల స్థానంలో టీ వచ్చింది. 2003-04లో మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో బ్లాక్ టీ ఇవ్వడం మొదలు పెట్టారు. అతిధుల పట్ల ఆప్యాయతకు, గౌరవానికి చిహ్నంగా టీలో ఎక్కువ పంచదార కలిపేవారు. టీలో కలిపే పంచదార కూడా తగ్గటం ప్రారంభమైంది. ఆ దశాబ్దం మధ్య నాటికి గ్లాసులు అదృశ్యమై పోయాయి. రైళ్ళలో, బస్టాండ్‌లలో మాదిరిగా ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ కప్పులలో అతిధులకు టీ ఇవ్వటం ప్రారంభ మైంది.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గణ పతి బాల యాదవ్‌ను మహారాష్ట్రలోని సాంగ్లీ లోని ఆయన స్వగృహంలో 2018లో నేను కలిశాను. కొన్ని గంటల పాటు ఆయనను ఇంటర్వ్యూ చేసిన తర్వాత మాత్రమే నాకు అల్యూమినియం గ్లాసులో స్వచ్ఛమైన పాలు ఇచ్చారు.

### క్షీణిస్తున్న వ్యవసాయ ఆర్థికవ్యవస్థ

గ్లాసు స్థానంలో పింగాణి, ప్లాస్టిక్ కప్పులు రావడం అనేది క్షీణిస్తున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు సంకేతంగా నిలుస్తుంది. "మార్కెట్ ఆధారిత ధరలు" అన్న ప్రచారాన్ని ప్రారంభించిన సమయంలోనే పాల ధరలను తగ్గించిన (ఇతర వ్యవసాయోత్పత్తుల ధరలను కూడా) ప్రైవేటు కంపెనీలను కూడా అనుమతించారు. మరోవైపున వినియోగదారు లకు ధరలను పెంచి సరఫరా చేశారు. ఈ ఆర్థిక విధానాల వినాశకరమైన పర్యవసానా లను కూడా ఇది వెల్లడిస్తున్నది.

ఇవి ఉద్దేశ్యపూర్వకంగా రూపొందించిన విధానాలు. వ్యవసాయ కుటుంబాలలోని లక్షలాది మంది బలహీనులైన పిల్లలు పాలు లేకుండా గడపటానికి ఈ విధానాలు కారణమైనాయి. ఇతర అత్యవసరమైన ఖర్చుల కోసం ప్రతి పాల చుక్కను అమ్మాల్సిరావటం వలన వ్యవసాయ కుటుంబాలలోని పిల్లలు పాలు లేకుండా గడపాల్సి వచ్చింది. ఇది కేవలం పాలకు మాత్రమే కాదు. పత్తి విషయం చూడండి. 1970 దశాబ్దం మధ్యలో విదర్భ ప్రాంతంలోని రైతులు ఒకటి, రెండు క్వింటాళ్ళ పత్తిని అమ్మి, 10-12 గ్రాముల బంగారం కొనేవారు. తమ కుమార్తెలకు వివాహం చేసేటపుడు అది వారికి అక్కరకు వచ్చేది. ఈరోజు 10 క్వింటాళ్ళ పత్తిని అమ్మినప్పటికీ 10 గ్రాముల బంగారం కొనలేకపోతున్నారు.

మహారాష్ట్రలో క్వింటాలు పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) 7,122 రూపాయలుగా ప్రకటించినప్పటికీ, కొద్దిమంది మాత్రమే 6,500 రూపాయల కన్నా ఎక్కువ ధరకు అమ్ముకున్నారు. ఒకవేళ కనీస మద్దతు ధర 7,122 రూపాయలకు 10 క్వింటాళ్ళు అమ్ముకున్నప్పటికీ, వచ్చే మొత్తం 10 గ్రాముల బంగారం ధర కన్నా తక్కువగానే ఉన్నది. స్పష్టంగా చెప్పుకున్నట్లైతే వారు ఒక క్వింటాలు పత్తిని అమ్మటం ద్వారా వచ్చిన మొత్తంతో ఒక గ్రాము బంగారం కూడా కొనలేరు.

### వినాశకరమైన విధానాలు

ఈ ఆర్థిక విధానాల వలన రైతుల పరిస్థితులు దిగజారటంతో పాటు కొన్ని మార్పులు కూడా వస్తున్నాయి. ఈ విధానాలు, వాటి అమలుకు తీసుకుంటున్న చర్యలు మనదేశంతో పాటు ఇతర దేశాలలో కూడా వివిధ తరగతుల ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి. 1991 నుండి వాటి పూర్తి ప్రభావం కనిపిస్తున్నది. ప్రపంచవ్యాపితంగా ఈ దిగువ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

పేదప్రజలకు అవసరమైన రంగాలు, కార్యక్రమాల నుండి ప్రభుత్వాలు వైదొలగుతున్నాయి. కార్పొరేట్‌లు, ధనికులకు భారీగా సబ్సిడీలు (ప్రోత్సాహకాలు అని పేరు మార్చారు) ఇస్తూ, పేదలకు ఇచ్చే సబ్సిడీలలో పెద్ద ఎత్తున కోతలు పెడుతున్నారు.

వ్యవసాయరంగంలో ప్రభుత్వ ఖర్చును తగ్గించారు. వ్యవసాయానికి ఇస్తున్న రుణాలను వ్యవసాయదారులకు కాకుండా వ్యవసాయోత్పత్తులతో వాణిజ్యం చేస్తున్నవారికి ఇవ్వటాన్ని వేగిరం చేశారు. వనరులను పేదల నుండి ధనికులకు భారీగా తరలిస్తున్నారు. రైతులు రుణగ్రస్తులు కావటం బాగా పెరిగింది. కార్పొరేట్ల శక్తి అనేక రెట్లు పెరిగింది. ప్రభుత్వం వద్ద ఉన్న వివిధ రకాల వనరులను ప్రైవేటీకరిస్తున్నారు. ఛత్తీస్‌గడ్‌లో ఒక నదిని 19 కిలోమీటర్ల పొడవున ప్రైవేటు వారికి ఇచ్చారు.

మేధాశక్తి, ఆత్మలతో పాటు ప్రతిదానినీ ప్రైవేటీకరిస్తున్నారు. పంచాయితీ రాజ్ సంస్థలు కార్పొరేట్ల శక్తిని ఎదిరిస్తున్న చోట్ల స్థానిక పరిపాలనను దిగజారుస్తూ, ఆ సంస్థలను శక్తిహీనం చేస్తున్నారు. "గ్రామీణ ప్రాంతంలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ గ్రామీణాభివృద్ధి జరుగుతున్నట్లు మాత్రం కనిపించటం లేదు'' అని ఆర్‌బిఐ మాజి గవర్నర్ వైవి రెడ్డి చెప్పినది అక్షరసత్యం.

**పెరుగుతున్న అసమానతలు**

దేశంలో నిరంతరం అసమానతలు పెరగటాన్ని చూస్తున్నాం. భారతదేశంలోని 217 మంది శత కోటీశ్వరుల మొత్తం సంపద 1,04,100 కోట్ల డాలర్లుగా ఉందని 2024, డిసెంబరు 10వ తేదీన విడుదల చేసిన ఫోర్బ్స్ నివేదిక పేర్కొంది. దేశ వ్యవసాయ బడ్జెట్ 1,791 కోట్ల డాలర్ల కన్నా ఇది 58 రెట్లు ఎక్కువ. మొత్తం బడ్జెట్ వ్యయం 56,200 కోట్ల డాలర్ల కన్నా 1.8 రెట్లు ఎక్కువ. 217 మంది వ్యక్తులు (దేశ జనాభాలో 0.000015 శాతం) మన జిడిపిలో సుమారు మూడవ వంతు సంపద కలిగి ఉన్నారన్న అంశంపై తీవ్రంగా ఆలోచించాలి.

1990వ దశాబ్దం నుండి రైతులకు జీవనాధారమైన వాటిని దిగజార్చటాన్ని చూస్తున్నాం. ప్రభుత్వ నియంత్రణలోని మార్కెట్లను క్రమ పద్ధతిలో దెబ్బ తీస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారు. దానితో వ్యవసాయ రంగం, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆహార ఉత్పత్తి, లభ్యతను ఇది భయంకరంగా ప్రభావితం చేస్తున్నది.

ఒకనాడు వ్యవసాయరంగ సమస్యలను పరిష్కరించటానికి కేంద్రాలుగా ఉన్న వ్యవసాయ విశ్వ విద్యాలయాలు కార్పొరేట్ వ్యవసాయ వాణిజ్య విధానాల ప్రయోగ కేంద్రాలుగా మారాయి. సంస్థాగతంగా లభిస్తున్న రుణాలను పథకం ప్రకారం రైతులకు అందకుండా చేయటం వలన గత్యంతరం లేని పరిస్థితులలో కోట్లాది మంది రైతులు పాత, కొత్త షాహుకార్ల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారు. వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముతున్నప్పటికీ, రైతులకు కనీస మద్దతు ధరలు రావటం లేదు. విదర్భ ప్రాంతంలో పత్తి పంట పండించటానికి అవుతున్న ఖర్చులను పరిశీలిస్తే, 2003-13 మధ్య ఎకరంలో పత్తి పండించటానికి అయ్యే ఖర్చులు 250-300 శాతం పెరిగాయి. కొన్ని సందర్భాలలో మరింత ఎక్కువగా కూడా పెరిగింది. మరి రైతుల ఆదాయాల మాటే మిటి? పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులలో, ముఖ్యంగా విత్తనాల ధరల పెరుగుదలలో ఒక చిన్న భాగం అంత మాత్రమే వారి ఆదాయాలు పెరిగాయి.

**"1990వ దశాబ్దం నుండి రైతులకు జీవనాధారమైన వాటిని దిగజార్చటాన్ని చూస్తున్నాం. ప్రభుత్వ నియంత్రణలోని మార్కెట్లను క్రమ పద్ధతిలో దెబ్బ తీస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారు. దానితో వ్యవసాయ రంగం, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆహార ఉత్పత్తి, లభ్యతను ఇది భయంకరంగా ప్రభావితం చేస్తున్నది."**



వ్యవసాయ సంక్షోభంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతుల సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో అధికంగా ఉంది

ఇక రైతుల ఆదాయాల విషయం చూస్తే, రైతు కుటుంబాల ఆదాయంపై తాజాగా లభ్యమౌతున్న 77వ రౌండ్ నేషనల్ శాంపుల్ సర్వేలో రైతు కుటుంబం నెలసరి సగటు ఆదాయం 10,218 రూపాయలుగా పేర్కొన్నారు. సంఘటిత రంగంలో ఒక ఉద్యోగం చేస్తే ఇంతకు రెట్టింపు ఆదాయం రాదా? రైతుల ఆదాయం గురించి ఇచ్చిన అంకెలు వ్యక్తిగత ఆదాయం కాదు, కుటుంబ ఆదాయం. రైతుల ఆదాయాన్ని ఐదు సంవత్సరాలలో రెట్టింపు చేస్తానని 2017లో నరేంద్ర మోడి రైతులకు వాగ్దానం చేశాడు. 2012-13 నుండి 2018-19 మధ్య కాలంలో వ్యవసాయం ద్వారా వస్తున్న ఆదాయం పది శాతం తగ్గింది. కూలి, జీతాలు, పశువులను పెంచటం ద్వారా రైతు కుటుంబాలు ఇపుడు ఎక్కువ ఆదాయం పొందుతున్నాయి.

అభ్యుదయవాదులైన ఆర్థికవేత్తలు చెబుతున్నట్లుగా ధరలు ప్రపంచీకరణ అవుతుండగా, ఆదాయాలు భారతీయకరణ అవుతుండటాన్ని చూస్తున్నాం. ప్రభుత్వ విధానాలు విధ్వంసానికి దారి తీయటంతో 2024 నాటికి 4,00,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇది అధికారిక అంచనా మాత్రమే. వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది.

**ప్రవాహంలా వ్యవసాయాన్ని వదిలి వెళుతున్న రైతులు**

రైతులను, వ్యవసాయ కార్మికులను ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేసే విధానాలను అనుసరించటం వలన 2001-2011 జనాభా లెక్కల మధ్యకాలంలో భారతదేశంలో ఎన్నడూ చూడనంత ఎక్కువగా వలసలు పోవటం జరిగింది. వ్యవసాయం, వ్యవసాయ ఆర్థికవ్యవస్థ దెబ్బ తినటం వలన కోట్లాది మంది వారి గ్రామాలను వదిలి, చిన్న పట్టణాలు, నగరాలకు చేరారు. దీనిని చెడ్డ విషయంగా భావించటం లేదు. హిందు దినపత్రిక, ఫ్రంట్‌లైన్‌లలో మినహా మిగతా పత్రికలలో దీనిని గురించి పెద్దగా ప్రస్తావించ లేదు. "కోట్లాది మందిని వ్యవసాయరంగం నుండి తరలించామని'' నయా-ఉదారవాద ఆర్థికవేత్తలు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. మంచిది. కాని బయటకు వెళ్ళిన లక్షలాది మందితో చర్చించారా? వారు మాట్లాడటానికి అవకాశం ఇచ్చారా? వారికి ఇతర అవకాశాలు ఏవైనా కల్పించారా?

రైతులను వ్యవసాయం నుండి తరలించటం అత్యవసరమని మీరు భావించినప్పటికీ,

> **"ఆర్థికాభివృద్ధిని గురించి అధ్యయనం చేస్తున్న ఆర్థికవేత్త కె నాగరాజ్ గ్రామీణ ప్రాంతాల నుండి రైతాంగాన్ని తరలించటాన్ని గురించి ఈ విధంగా చెప్పాడు. "(ఎ) వ్యవసా య ఉత్పాదనలో పెరుగుదల ఉండాలి. (బి) పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండింటి లోనూ మంచి నాణ్యత, గౌరవంగా బతకటానికి తగిన ఉద్యో గాలు కల్పించాలి. (సి) ప్రజలందరికీ మంచి విద్య, ఆరోగ్యం అందిస్తే నే నైపుణ్యం కలిగిన, ఆరోగ్యకరమైన శ్రామికవర్గం అభివృద్ధి అవు తుంది. కాని వాస్తవంలో దీనికి పూర్తి వ్యతిరేకంగా జరుగుతున్నది."**

నిర్ణయాలు చేయటంలో వారిని భాగస్వాము లను చేయకుండా ఆ పని చేయకూడదు.. వ్యవసా యాన్ని, వ్యవసాయదా రుల జీవితా లను నాశనం చేయటం ద్వారా రైతాంగాన్ని తరలించే పని చేయకూడదు.

ఆర్థికాభివృద్ధిని గురించి అధ్యయనం చేస్తున్న ఆర్థికవేత్త కె నాగరాజ్ గ్రామీణ ప్రాంతాల నుండి రైతాంగాన్ని తరలించటాన్ని గురించి ఈ విధంగా చెప్పాడు. "(ఎ) వ్యవసా య ఉత్పాదనలో పెరుగుదల ఉండాలి. (బి) పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండింటిలోనూ మంచి నాణ్యత, గౌరవంగా బతకటానికి తగిన ఉద్యోగాలు కల్పించాలి. (సి) ప్రజలందరికీ మంచి విద్య, ఆరోగ్యం అందిస్తేనే నైపుణ్యం కలిగిన, ఆరోగ్యకరమైన శ్రామికవర్గం అభివృద్ధి అవుతుంది. కాని వాస్తవంలో దీనికి పూర్తి వ్యతిరేకంగా జరుగుతున్నది. ఈ విధంగా ఆర్థికంగా దెబ్బతిని, తప్పనిసరి పరిస్థితులలో గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు వెళు తున్నవారిని వ్యవసాయాభివృద్ధికి చిహ్నంగా చూపించటం సరికాదు".

1991 జనాభా లెక్కలతో కలిపి స్వాతం త్ర్యానంతరం ప్రతి జనాభా లెక్కల నివేదిక లోనూ దేశంలో రైతాంగం సంఖ్య పెరుగుతు న్నట్లు చెప్పింది. ఆ తర్వాత నిర్ఘాంతపరిచే విధంగా తగ్గిపోతున్నది. 2001లో సేకరించి న జనాభా లెక్కలు వ్యవసాయం పైనే ప్రధా నంగా ఆధారపడిన రైతులు 72 లక్షల మంది తగ్గారని వెల్లడించాయి. 2011 జనాభా లెక్కలలో వారి సంఖ్య మరొక 77 లక్షలు తగ్గింది.

మనం నూతన ఆర్థిక విధానాలను అమలు చేయటం ప్రారంభించిన మొదటి 20 సంవత్సరాలలో రైతుల సంఖ్య 1.5 కోట్లు తగ్గింది. అంటే ప్రతి 24 గంటలకూ వ్య వసాయంపైనే పూర్తిగా ఆధారపడిన 2000 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలేస్తున్నారు. ఇది గాని ఇతర ఏ రంగంలో నైనా జరిగితే, ముఖ్యంగా పట్టణాలలోని వృత్తులు, వ్యాపారా లలో జరిగి ఉంటే దాని ముగింపును గురించిన వార్తే నీకు తెలిసేది కాదు. కాని రైతుల వలసలు ప్రజల దృష్టిలోకి వస్తున్నాయి కాబట్టి కార్పొరేట్లకు అనుకూలమైన ఆర్థికవేత్తలు ఇది మంచి విషయమేనని చెబుతున్నారు.

**ప్రతిరోజూ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు**

జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సి ఆర్‌బి) సమాచారం ప్రకారం 2022లో 11,290 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రోజుకు 30 ఆత్మహత్యలు లేదా గంటకు ఒకరి కన్నా ఎక్కువ మంది ఆత్మహత్య లు చేసుకుంటున్నారని ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2021లో ఆత్మహత్యలు చేసు కున్న రైతులు 10,881 కన్నా 2022లో ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ సంఖ్య 2019లో 10,281 కాగా, 2020లో 10,677గా ఉన్నది.

కోవిడ్-19 మహమ్మారి వ్యాపించిన సమయంలో ఊహించని విధంగా "తిరుగు వలసలు" జరిగాయి. పట్టణాలలో హీనమైన పనులు చేస్తున్న కోట్లాది మంది నైపుణ్యం కలిగిన రైతులు తమ గ్రామాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. 25 రోజుల తర్వాత, శ్రామికులను చేరవేయటానికి తాము నడుపు తున్న రైళ్ళు 91 లక్షల మందిని వారి ఇళ్ళకు చేర్చాయని 2020, మే నెలలో రైల్వే అధికారులు ప్రకటించారు.

దీనితో హృదయాలు కరిగిపోయినట్లు "వారు ఎందుకు వెనక్కు వెళ్ళారు? అది చాలా ఇబ్బందులతో కూడినది. పట్టణాలలో బతకటా నికి వారికి మంచి అవకాశాలు న్నాయి" అంటూ చర్చలు జరిగాయి. " వారెందుకు వెనక్కు వెళ్ళారు" అన్నది తగిన ప్రశ్న కాదు. మొదటగా "వారెందుకు తమ గ్రామాలను వదిలి వచ్చారు" అన్నది సరైన ప్రశ్న అవుతుంది.

**తీవ్రమౌతున్న దుర్భర పరిస్థితులు**

నగరాలకు వలసలు పోక గత్యంతరం లేని పరిస్థితులు ఏర్పడకపోతే ఈ గుంపులుగా తిరిగి రావటం ఉండేది కాదు. భారీగా జరుగు తున్న ఈ వలసలు మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టంపై తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తున్నది. కాని ఆర్థికంగా, ఇతర విధాలుగా ఈ చట్టాన్ని నీరుగారుస్తున్నారు.


పరిస్థితులు ఘోరంగా దిగజారుతుం డటంతో రైతులు తీవ్రమైన పోరాటాలకు సన్నద్ధం అవుతున్నారు. వీటిలో మొదటిది గత దశాబ్దంలో చోటు చేసుకుంది. 2018 మార్చిలో ఆది వాసులు, రైతులు, పేదలు 40,000 మందికి పైగా నాసిక్ నుండి ముంబైకి చారిత్రాత్మకమైన పాదయాత్ర నిర్వహించారు. ప్రపంచం నిర్ఘాంతపోయే విధంగా 2020-21లో ఢిల్లీ శివార్లలో రైతుల ఆందోళన జరిగింది. ప్రపంచంలో గత 30 సంవత్సరాలలో అత్యంత శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధంగా జరిగిన అతి పెద్ద నిరసన కార్యక్రమం ఇదని ప్రధాన స్రవంతి మీడియా మీకు ఎప్పుడైనా చెప్పిందా? ప్రపంచంలో పెద్ద ప్రచారం జరిగిన వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమంలో ఊహ జనితమైన భావాలతో ఉన్న కొన్ని వేలమంది యువత మాత్రమే పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని జుకొట్టి పార్క్ నుండి తొమ్మిది వారాలలోనే ప్రభుత్వం వారిని ఖాళి చేయించింది. ఢిల్లీలో రైతాంగ ఉద్యమం 54 వారాల పాటు జరిగిం ది. ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన తర్వాత మాత్రమే ఉద్యమం ముగిసింది.

ఈ చట్టాలను వారి ప్రయోజనం కోసమే చేశామని "కొద్దిమంది రైతులను ఒప్పించటం లో తాను విఫలమైనానని", అందువలన చట్టాలను రద్దు చేయవలసి వచ్చిందని మోడి చెప్పారు. రైతులను ఒప్పించటానికి టియర్ గ్యాస్, వాటర్ కేనన్‌లు, ముళ్ళతో కూడిన వైర్లను, పెద్ద కంటెయినర్లను, బారికేడ్స్‌ను ఉపయోగించటం, రైతులపై లాఠీచార్జి చేయ టం, వారిని తీసుకొస్తున్న ట్రాక్టర్లను అడ్డగించటం కోసం జాతీయ రహదార్లను తవ్వటం తదితరాలను తమ ప్రభుత్వం చేసినట్లు ఆయన చెప్పలేదు.

1991 నుండి గడిచిన మూడు దశాబ్దా లలో వ్యవసాయ సమాజంలో నెలకొన్న సంక్షోభంతో వ్యవసాయ సంక్షోభం కలిసిపో యింది. వీటితో పాటు ఉద్యోగ సంక్షోభం, వలసల సంక్షోభం, నీరు, ఆరోగ్యం, విద్య తది తర సంక్షోభాలు ఉన్నాయి. రైతుల, వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు ఇంకా కొనసాగుతూనే

(మిగతా 12వ పేజీలో)

# చైనాలో ఆర్థికాభివృద్ధి- ఇటీవలి పరిణామాలు



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

“1990 లో సోవియట్ రష్యా పని అయిపోయింది. ఇక తర్వాత వంతు చైనాదే”.... ఇది మన బూర్జువా పండితులు, మీడియా ఆ నాడు చెప్పిన జోస్యం.

ఆ తర్వాత మన దేశంలో నయా-దార వాద విధానాలను ప్రవేశ పెట్టిన అనంతరం వాళ్ళ స్వరం మారింది. “చైనా తన పంథాను మార్చుకుని పెట్టుబడిదారీ వర్గాన్ని ప్రోత్సహిస్తూ పెట్టుబడిదారీ దేశంగా మారిపోతోంది. కానీ భారతదేశంలోని కమ్యూనిస్టులు మాత్రం చైనా నుండి నేర్చుకోడానికి నిరాకరిస్తున్నారు” ....అని వారు కొత్త పల్లవి ఎత్తుకున్నారు.

ఇప్పుడు మళ్ళీ వారి పాట మారింది. “చైనా నాశనం అయిపోతోంది. ప్రైవేటు పెట్టుబడిదారులను ఎదగనివ్వడం లేదు. అందుకే ఇప్పుడు చైనా ఆర్థిక వృద్ధి రేటు తగ్గిపోయింది. దానికి తోడు అమెరికా ప్రకటించిన ఆంక్షలు కూడా ఉన్నాయి. ఇక చైనా పతనం తప్పదు”.... ఇది వారి తాజా పాట.

ముందు శాపనార్థాలు, తర్వాత ప్రశంసలు, మళ్ళీ ఇప్పుడు శాపనార్థాలు. ఇదే బూర్జువా మేధావుల కప్పగెంతుల వ్యవహారంగా ఉంది. ఇంతకూ చైనా ఆర్థిక రంగంలో ప్రస్తుతం జరుగుతున్నదేమిటి?

ఇటీవల విడుదల చేసిన సిపిఐ(ఎం) 24వ మహాసభ ముసాయిదా తీర్మానం 1.49,1.50 పేరాలలో ఈ విధంగా చైనా ఆర్థిక ప్రగతి గురించి తెలిపారు:

“ 1.49: చైనా అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు కావలసిన కీలక సాంకేతిక పరిజ్ఞానాన్నీ, ప్రధాన సాధన సామాగ్రినీ, ముడిసరుకులనూ అందకుండా చెయ్యడానికి రకరకాల అడ్డంకులను సృష్టించడానికి అమెరికా అన్ని రకాల ప్రయత్నాలనూ చేస్తోంది. ‘చిప్ ఫోర్-పార్టీ అలయన్స్’ పేరిట దక్షిణ కొరియా, జపాన్, తైవాన్ లతో కలిసి కూటమిని ఏర్పాటు చేసుకుని అంతర్జాతీయ సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు నుండి చైనాను మినహాయించడానికి ప్రయత్నించింది. బైడెన్ అధికార యంత్రాంగం వాణిజ్య సంబంధాలను ఆయుధంగా చేసుకుని చైనా మీద మితిమీరిన స్థాయిలో సుంకాలను విధించి వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించింది. ...”

“1.50: ఈ దాడులన్నీ కొనసాగుతు న్నప్పటికీ, వాటిని తట్టుకుంటూనే చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ముందుకు నడిపిస్తున్న అతిపెద్ద శక్తిగా ఎదిగింది. 2024 తొలి మూడు త్రైమాసికాలలో చైనా స్థూల జాతీయోత్పత్తి 4.8 శాతంగా నమోదు అయింది. సాలీనా 5 శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యానికి చేరువలో ఉన్నది. 2023 లో చైనా స్థూల జాతీయోత్పత్తి 126 ట్రిలియన్ల యువాన్లకు చేరుకుని 5.2 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతర్జాతీయ విదేశీ మారక రంగంలో ఇరవై ఏళ్ళ క్రితం చైనా వాటా 1 శాతం కన్నా తక్కువగా ఉండేది. ప్రస్తుతం అది 7 శాతం దాటింది. ఒక విశ్వసనీయమైన ఆర్థిక శక్తిగా చైనా ముందుకొచ్చిన వైనాన్ని గుర్తించాల్సిన అగత్యాన్ని కల్పించింది. తన ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని మరింత బలోపేతం చేసుకుని ప్రభుత్వ పెట్టుబడులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను మరింత భారీగా విస్తరింపజే యాలనీ, ఈ పరిశ్రమల ప్రధాన కార్యకలాపాలను, పోటీ పడగలిగే సామర్థ్యాన్ని మరింత పెంపొందించాలనీ చైనా నిర్ణయించింది. ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజం కావించడానికి 90,000 కోట్ల డాలర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది.”

చైనాలో అభివృద్ధి జరుగుతున్న తీరు, దాని అనుభవాలు పెట్టుబడిదారీ దేశాలలో, ముఖ్యంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కలుగుతున్న అనుభవాలకు భిన్నంగా ఉన్నాయి. 2008 సంక్షోభం అమెరికాను, యూరప్‌ను కుదిపివేసింది. కాని ఆ దేశాలతో పెద్ద ఎత్తున వాణిజ్యం కొనసాగిస్తూవచ్చిన చైనాను ఆ సంక్షోభం పెద్దగా ప్రభావితం చేయలేక పోయింది. సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో సహా అన్ని దేశాలలోనూ ఆదాయాల నడుమ, సంపదల నడుమ వ్యత్యాసాలు పెరుగుతు న్నాయి. ఉత్పత్తి అవుతున్న సంపదలో కార్మికుల వాటా తగ్గుతోంది. కాని దానికి భిన్నంగా చైనాలో కార్మికుల నిజ ఆదాయాలు పెరిగాయి, పేదరికం తగ్గింది. ఆయు:ప్రమాణం పెరిగింది.

ఐతే 2019-2022 మధ్య కాలంలో చైనాలో ఆర్థిక వృద్ధి రేటు తగ్గింది. దీనికి గల కారణాలను లోతుగా పరిశీలించకుండానే ప్రపంచ బూర్జువా మీడియా, బూర్జువా ఆర్థివేత్తలు ఇక చైనా పని అయిపోయిందంటూ ప్రచారం అందుకున్నారు. ఇంతకూ ఆ కాలంలో చైనాలో వృద్ధిరేటు తగ్గడానికి కారణం ఏమిటి? నిజానికి చైనాలో పెట్టుబడుల పెరుగుదల కొనసాగుతూనేవుంది. 2000 నుండీ స్థిరమైన వృద్ధి రేటును నమోదు చేస్తూనేవుంది. ఐతే ఇటీవల తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ప్రధానంగా ఆ పెట్టుబడులను మళ్ళించారు. శాస్త్ర పరిశోధనలకు పెట్టే పెట్టుబడులు వెనువెంటనే సంపదను వృద్ధి చేయవు. దానికి కొంత వ్యవధి అవసరం. ఒకసారి సాంకేతికంగా పైస్థాయిని సాధించాక

> **" అమెరికా చైనాకు ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎగుమతి కానివ్వకుండా ఆంక్షలు పెడుతోంది. అందువల్లనే చైనా తన స్వంత పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ఎక్కువ పెట్టుబడులు పెడుతోంది. అమెరికా ఆంక్షలు ప్రస్తుతానికి కొంత ఆటంకంగా పని చేయవచ్చేమో గాని చైనా ఒకసారి తన స్వంత టెక్నాలజీని పెంచుకోగలిగితే ఇక అది అమెరికా మీద కానీ, ఇయు మీద కానీ ఆధారపడాల్సిన పనే లేదు. "**

సంబంధిత కొత్త రంగాలలో ఉత్పత్తి పెరిగి జిడిపి వృద్ధి రేటు మళ్ళీ వేగం పెంచుకుంటుంది.

**బూర్జువా పండితులు ఏమంటున్నారు?**

బూర్జువా ఆర్థిక వేత్తలు చైనా వృద్ధి రేటు పడిపోడానికి ఆరు కారణాలు ఉన్నట్టు గుర్తించారు. అవి:

1. చైనా వృద్ధి క్రమం కొనసాగడానికి కావలసినదానికన్నా ఎక్కువ పెట్టుబడులు పెడుతూవచ్చారు. అది ఆర్థిక వృద్ధిరేటు పడిపోడానికి దారి తీసింది.

2. చైనాలో జిడిపితో పోల్చితే రుణాల నిష్పత్తి అతిగా పెరిగిపోయింది. దాని ఫలితంగా ఆర్థిక వృద్ధి వేగాన్ని కొనసాగించడం సాధ్యపడదు.

3. చైనాలో ఆర్థిక వృద్ధి రేటు వేగంగా కొనసాగడానికి ప్రధాన చోదక శక్తిగా రియల్ ఎస్టేట్ రంగం పని చేసింది. ఇప్పుడు ఆ రంగంలో సంక్షోభం తలెత్తింది. అందుకే చైనా వృద్ధిరేటు దెబ్బ తిన్నది.

4. చైనాలో సంతానోత్పత్తి తగ్గిపోయింది. దానివలన పని చేసే కార్మికులకు కొరత ఏర్పడింది. అందుకే ఆర్థిక వృద్ధి మందగించింది.

5. చైనా ప్రభుత్వం ప్రభుత్వ రంగానికే పెద్ద పీట వేసింది. దానివలన ప్రైవేటురంగం పాత్ర తగ్గింది. దాని వలన ఆర్థిక వృద్ధిరేటు మందగించింది.

6. చైనాకు స్వంతంగా సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడం చాతకాదు. ఇప్పుడు అమెరికా చైనాకు సాంకేతిక పరిజ్ఞానం అందకుండా ఆంక్షలు కూడా విధించింది. దాని వలన చైనా వెనుకబడుతోంది. పరిశోధనలపై పెట్టుబడులు పెంచినంత మాత్రాన సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడం సాధ్యం కాదు.

**ఇప్పుడు ఈ వాదనలను పరిశీలిద్దాం:**

1. అతిగా పెట్టుబడులు పెట్టడం: "చైనా గనుక పెట్టుబడులను ఇదే రీతిగా పెంచుకుంటూపోతే దానివలన ఉత్పత్తి అయే సరుకులు కూడా పెరుగుతాయి. కాని ప్రపంచమార్కెట్‌లో ఆసరుకులు అమ్ముడు పోవాలంటే తక్కిన దేశాలు తాము చేసే ఉత్పత్తులను తగ్గించుకోవాలి. కాని ఇయు దేశాలు, అమెరికా, ఇండియా వంటి దేశాలు తమ తమ పెట్టుబడులను, ఉత్పత్తులను పెంచడానికి పూనుకుంటున్నాయి. అందుచేత చైనా ఉత్పత్తులు అమ్ముడుపోవడం జరగదు. ప్రపంచ పెట్టుబడులలో తన వాటా పెరిగిన మేరకు ప్రపంచ మార్కెట్‌లో తన వాటాను చైనా దక్కించుకోలేదు. అప్పుడు చైనా ఆర్థిక వృద్ధి రేటు పడిపోక తప్పదు....ఇదీ వారి మొదటి వాదన.

ఈ వాదన తార్కికంగా నిలిచేది కాదు. చైనా కేవలం సరుకులను మాత్రమే గాక, ముడిసరుకులను, నైపుణ్యం కల కార్మికులను, మౌలిక నిర్మాణ వసతులను (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కూడా ఎగుమతి చేస్తోంది. ప్రస్తుతం తక్కిన దేశాల కన్నా చైనా వాటిని చౌకగా అందించగలుగుతోంది. ఇప్పుడు సంపన్న దేశాలు వాటిని చైనా నుండి కొనుగోలు చేయడం మానుకుని తామే స్వయంగా ఉత్పత్తి చేయాలంటే దానికి చాలా వ్యవధి పడుతుంది. లేక వేరే దేశాలనుండి కొనుగోలు చేయాలంటే అందుకు ఎక్కువ ఖరీదు చెల్లించాల్సి వుంటుంది. అప్పుడు అవి ఉత్పత్తి చేసే సరుకులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ ఖరీదుకు అమ్మాలి. లేదా దేశీయ మార్కెట్ లోనన్నా ఎక్కువ రేటుకు అమ్మాలి. ఈ రెండూ నష్టదాయకమైనవే. అందుచేత సంపన్నదేశాలు చైనానుండి దిగుమతులను నిలిపివేయడం ఆ దేశాలకే నష్టం. అయినప్పటికీ పంతం కొద్దీ చైనానుండి దిగుమతులను నిలిపివేసి తామే వాటిని ఉత్పత్తి చేయడానికి పూనుకుంటే అప్పుడు కూడా చైనానుండి అందుకు కావలసిన యంత్ర పికరకాలను, నిపుణులైన కార్మికులను, ముడిసరుకులను కొనుగోలు చేయాలి. అప్పుడు చైనా ఎగుమతులు ఆ మేరకు పెరుగుతాయి. అంతేగాక ఆ యంత్ర పరికరాలను తయారుచేసే పైస్థాయి పరిశ్రమలను మరిన్నింటిని చైనా ప్రారంభించగలుగుతుంది. ఒకవేళ చైనా కూడా వాణిజ్య యుద్ధానికి దిగి సంపన్న దేశాలకు ఎగుమతులను నిలిపివేస్తే అప్పుడు సంపన్నదేశాలు చైనాకు పోటీగా ఆ సరుకులను వెనువెంటనే ఉత్పత్తి చేయడం సాధ్యమే కాదు.

ఇప్పుడు అమెరికా చైనాకు ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎగుమతి కానివ్వకుండా ఆంక్షలు పెడుతోంది. అందువల్లనే చైనా తన స్వంత పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ఎక్కువ పెట్టుబడులు పెడుతోంది. అమెరికా ఆంక్షలు ప్రస్తుతానికి కొంత ఆటంకంగా పని చేయవచ్చేమో గాని చైనా ఒకసారి తన స్వంత టెక్నాలజీని పెంచుకోగలిగితే ఇక అది అమెరికా మీద కానీ, ఇయు మీద కానీ ఆధారపడాల్సిన పనే లేదు. అంతేకాక, టెక్నాలజీని అభివృద్ధి చేసుకోడవం కోసం పెట్టిన పెట్టుబడులు అప్పుడు చైనాకు మంచి ఫలితాలను అందించగలుగుతాయి. ఇంతవరకూ అమెరికా, ఇయు దేశాలు చైనాకు కొనసాగిస్తున్న టెక్నాలజీ ఎగుమతులు నిలిచిపోతే ఆ సంపన్న దేశాలకు ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం ఆమేరకు తగ్గిపోతుంది.

కేవలం అమెరికా, ఇయు దేశాలతో మాత్రమే గాక అనేక ఇతర మూడవ ప్రపంచ దేశాలతో చైనా వ్యాపారం కొనసాగిస్తోంది. వాటిలో చాలా దేశాలు చైనానుండి సరుకులు కొనుగోలు చేస్తూ తమవద్ద ఉండే ముడిసరుకులను చైనాకు ఎగుమతి చేస్తున్నాయి. చైనానుండి వచ్చే సరుకులు పెరిగిపోతే ఆదేశాలలోని దేశీయ పరిశ్రమలు దెబ్బ తింటాయనే ఆందోళన కూడా ఉంది. (మన దేశంలో కూడా ఇటువంటి ఆందోళన ఉంది) ఐతే చైనా క్రమంగా దిగువ స్థాయి టెక్నాలజీని ఉపయోగించడం తగ్గించుకుంటూ ఉన్నతస్థాయి టెక్నాలజీ వినియోగం దిశగా సాగిపోతోంది. అందుచేత చైనా విడిచిపెడుతున్న దిగువస్థాయి టెక్నాలజీని ఉపయోగించి ఆయా దేశాలు కొత్త పరిశ్రమలను ప్రారంభించవచ్చు. ఉభయులకూ ప్రయోజనకరంగా ఒప్పందాలు చేసుకోవచ్చు. మూడవ ప్రపంచ దేశాలు చైనాతో తలపడితే కలిగే లాభం ఏమీ ఉండదు. దానికి బదులు పరస్పరం సహకరించుకుంటేనే ఇరు పక్షాలకూ ప్రయోజనం కలుగుతుంది.

చైనా తన పెట్టుబడులను పెంచుకుని టెక్నాలజీ పరంగా పై స్థాయిని చేరుకుంటే అమెరికా ఆధిపత్యానికి గండి పడుతుంది. అందుకే చైనా పెట్టుబడుల విధానాన్ని ఈ బూర్జువా ఆర్థిక వేత్తలు విమర్శిస్తున్నారు.

"చైనాలో పెట్టుబడుల రాకపోకలమీద ప్రభుత్వం పటిష్టమైన నియంత్రణను కలిగివుంది. ఇక ప్రాధాన్యతా రంగాలుగా లేని పరిశ్రమల్లో ఆశించిన మేరకు లాభాలు పొందలేక ప్రైవేటు సంస్థలు రుణాలను చెల్లించలేని స్థితి రావచ్చు. అటువంటి రంగాలలో రుణాలు చాలా తక్కువ శాతం మాత్రమే. చైనా ఆర్థిక వ్యవస్థ మీద అవి చూపగలిగే ప్రభావమూ స్వల్పమే."

**2, చైనాలో పెరుగుతున్న రుణ భారం:** చైనాలో పెరుగుతున్న ఉత్పత్తితో పోల్చితే ఆయా పరిశ్రమలు తీసుకుంటున్న రుణాలు పెరిగిపోతున్నాయని, ఇలా రుణభారం అతిగా పెరిగిపోతే అది చైనా వృద్ధిని ఆటంకపరుస్తుంది అని అంటున్నారు.

ఈ వాదనతో తలపడేముందు ఒక ఆర్థిక సూత్రాన్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి. ఏ దేశంలోనైనా, ఆర్థిక వృద్ధి ఆ దేశంలో ఉత్పత్తి అయిన సంపద విలువతో సమానంగా ఉంటుంది. అదే విధంగా ఆ దేశంలో ఉత్పత్తి అయిన సంపద విలువ ఆ దేశంలో చెల్లించిన మొత్తం వేతనాలు, లాభాలు, వడ్డీలు, అద్దెలు, పన్నుల మొత్తానికి సమానంగా ఉంటుంది.




చైనా పారిశ్రామిక నగరం షాంఘైలోని ప్యూడాంగ్ ప్రాంత స్కై లైన్. ఆసియాలోనే అతి ఎత్తయిన టివి టవర్ ఓరియెంటల్ పెరల్ ను చూడవచ్చు.

చైనాలో రుణాలు వివిధ తరహాలవి ఉన్నాయి. ఒక్కొక్కదానినీ చూద్దాం. చైనాలో ఒక ప్రభుత్వ రంగ బ్యాంకు అక్కడ స్థానిక సంస్థకు (మునిసిపాలిటీ వగైరాలు) లేదా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఒక నిర్మాణ సంస్థకు మౌలిక నిర్మాణ వసతుల ఏర్పాటు కోసం (ఉదా: ఒక హైవేను నిర్మించడం కోసం) అప్పు ఇచ్చిందనుకుందాం. అప్పు ఇచ్చినదీ, పుచ్చుకున్నదీ ప్రభుత్వ సంస్థలే. కనుక మొత్తంగా చూసినపుడు చైనా ప్రభుత్వపు అప్పు ఎంత పెరిగిందో, ఆస్తులూ అంతే మేరకు పెరుగుతాయి. ఆ అప్పు మీద వడ్డీ చెల్లించినప్పుడు కూడా ఎంత మొత్తంలో ఆదాయం పెరుగుతుందో, అంతే మొత్తంలో ఖర్చు కూడా పెరుగుతుంది. ఒకవేళ అప్పు పుచ్చుకున్న సంస్థ బకాయి పడిపోయిందను కుందాం. అప్పుడు చైనా ప్రభుత్వం అప్పిచ్చిన బ్యాంక్‌కి ఆ అప్పును తీర్చాలి. ఐతే ఆ హైవే ద్వారా లభించే ఆదాయం అప్పుడు చైనా ప్రభుత్వ ఖాతాలోకి పోతుంది. అందుచేత ఇటువంటి అప్పులు పెరిగినందువలన చైనా ఆర్థిక వృద్ధికి ఎటువంటి ఆటంకమూ రాదు.

రెండో తరహా రుణాలు ఉన్నాయి. చైనా ప్రభుత్వ బాండ్లను విదేశీ సంస్థలు లేదా వ్యక్తులు కొనుగోలు చేస్తారు. ఇవి కూడా ప్రభుత్వం చేసే అప్పు వంటివే. మామూలుగా ప్రభుత్వాలు తమకు కావలసిన విదేశీ మారకద్రవ్యం కోసం ఇటువంటి బాండ్లను జారీ చేస్తాయి. అలా సమకూరిన ధనాన్ని వేరే ఏ దేశంలోనైనా పెట్టుబడి పెట్టి అధిక వడ్డీని పొందడానికి ప్రయత్నిస్తాయి. లేదా తమ దేశంలోనే ఎగుమతులకు ఉపయోగపడే పరిశ్రమలలో పెట్టుబడి పెడతాయి. ఏ పద్ధతిలోనైనా ప్రభుత్వానికి రాబడి వస్తుంది. బాండ్లరూపంలో ఉండే రుణాలను తిరిగి చెల్లించడానికి కొంత కాల పరిమితి ఉంటుంది. అందుచేత హఠాత్తుగా తలెత్తే సమస్యఏదీ ఉండదు. పైగా చైనా వద్ద విదేశీ మారకద్రవ్య నిల్వలు గణనీయంగా పోగుబడివున్నాయి.

మూడవ తరహా రుణాలు: చైనా ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రైవేటు సంస్థలకు రుణాలను ఇవ్వడం. అటువంటి రుణాలను పూర్తిగా చెల్లించివేస్తే ఆర్థిక వ్యవస్థకు ఏ ఇబ్బందీ ఉండదు. సాధారణంగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించే ప్రాధాన్యతా రంగాలలోనే ఇటువంటి రుణాలను ఇవ్వడం జరుగుతోంది. ఆ సంస్థ ఉత్పత్తులకు తగిన డిమాండ్ ఉంటుంది. ప్రాధాన్యతా రంగం గనుక ప్రభుత్వ సబ్సిడీలూ ఉంటాయి. అందువల్ల రుణాన్ని తీర్చివేయడానికి ఏ ఇబ్బందీ ఉండదు. ఒకవేళ వచ్చినా, అటువంటి సంస్థను ప్రభుత్వం జాతీయం చేసి దానిని మళ్ళీ ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయగలదు. ఒకవేళ ఆ సంస్థ యజమానిగా ఉండే పెట్టుబడిదారుడు తప్పుడు లెక్కలతో ఖర్చులను ఎక్కువగాను, ఆదాయాలను తక్కువగాను చూపిస్తే (మన దేశంలో ఆదానీ మాదిరిగా) ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని రుణాన్ని వడ్డీతో సహా రాబట్టగలదు. చైనాలో పెట్టుబడుల రాకపోకలమీద ప్రభుత్వం పటిష్టమైన నియంత్రణను కలిగివుంది. ఇక ప్రాధాన్యతా రంగాలుగా లేని పరిశ్రమల్లో ఆశించిన మేరకు లాభాలు పొందలేక ప్రైవేటు సంస్థలు రుణాలను చెల్లించలేని స్థితి రావచ్చు. అటువంటి రంగాలలో రుణాలు చాలా తక్కువ శాతం మాత్రమే. చైనా ఆర్థిక వ్యవస్థ మీద అవి చూపగలిగే ప్రభావమూ స్వల్పమే.

నాలుగో తరహా రుణాలు: ప్రైవేటు రుణ గ్రహీతలు దేశీయ, విదేశీ ప్రైవేటు సంస్థలనుండి రుణాలు తీసుకోవడం. ప్రభుత్వరంగ బ్యాంకులు వసూలు చేసే వడ్డీ కన్నా తక్కువ వడ్డీకి ఇటువంటి అప్పులు దొరికినప్పుడే తీసుకుంటారు. ఒకవేళ అప్పుడు కూడా బకాయి పడితే, ఆ సంస్థల ఆస్తులను జప్తు చేయడం ద్వారా కానీ, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం ద్వారా కానీ రుణాలను రికవరీ చేయవచ్చు.

**" చైనాలో కొన్ని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు తీసుకున్న రుణాలను చెల్లించలేక బకాయి పడ్డాయి. వాటి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని వాటి ఆస్తులను జప్తు చేయడమో లేక వాటిని స్వాధీనం చేసుకోవడమో జరుగుతుంది. ఐతే రియల్ ఎస్టేట్ రంగం మొత్తంగా మందగిస్తే స్థూల డిమాండ్ తగ్గి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. ఇప్పుడు నడుస్తున్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులేవీ ఆగలేదు, అన్నీ కొనసాగు తూనేవున్నాయి. సంక్షోభంలో పడిన ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వ సంస్థలు స్వాధీనం చేసుకుని నడిపిస్తున్నాయి. "**

ఇక మొత్తంగా చూస్తే తక్కిన సంపన్న దేశాల కన్నా (అమెరికా, జపాన్ వంటి) చైనా ప్రభుత్వ రుణంచాలా తక్కువగా ఉంది. మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ రుణం దేశ జిడిపిలో 131 శాతం ఉంది. ఇది ఎక్కువగానే ఉన్నట్టు చెప్పాలి. ఐతే, ఇందులో అత్యధిక శాతం చైనా కరెన్సీలో ఉన్న రుణమే. అందువలన పెద్దగా సమస్యలు తలెత్తబోవు. విదేశీ వ్యాపారంలో మిగులులో ఉండడం, విదేశీ మారక నిల్వలు గణనీయంగా ఉండడం కారణంగా చైనా ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడే అవకాశాలు దరిదాపుల్లో లేవు.

### రియల్ ఎస్టేట్ రంగంలో సంక్షోభం

ఇటీవల చైనాలో రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో పడింది. చైనా ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు నడిపించడంలో రియల్ ఎస్టేట్ రంగందే కీలక పాత్ర. ఇతర ఏ రంగాలలో వెనకబడినా, రియల్ ఎస్టేట్ రంగంలో నమోదైన అభివృద్ధి ఆ లోటును భర్తీ చేసింది. అభివృద్ధి పనులు చేపట్టడానికి స్థానిక సంస్థలకు రియల్ ఎస్టేట్ మార్కెట్టే శరణ్యం. ప్రభుత్వ భూములను రియల్టర్లకు అమ్మి వచ్చిన సొమ్ముతో అభివృద్ధిపనులు చేపడుతున్నారు. గృహరుణాల షరతులను ప్రభుత్వం సరళతరం చేసినందువలన రుణాలు తీసుకున్నవారి సంఖ్య పెరిగింది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో కలిగిన ఆటంకం వలన అనేక ఇతర రంగాలలో ఇబ్బందులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. దశాబ్దం క్రితం వ్యక్తిగత రుణాల శాతం జిడిపిలో 30 శాతం ఉండేది. ఇప్పుడది 60 శాతానికి చేరింది. రియల్ ఎస్టేట్ మార్కెట్ పడిపోయి ఇళ్ళ ధరలు పడిపోతే చాలా తీవ్ర పర్యవసానాలు ఎదురౌతాయి.... ఇది బూర్జువా ఆర్థికవేత్తల వాదన. ఇదంతా చెప్తూనే వారే ఒక విషయాన్ని ఒప్పుకోక తప్పలేదు, "అయినప్పటికీ, బ్యాంకుల్లో కుటుంబాలు దాచుకున్న డిపాజిట్లకన్నా, ఇప్పటికీ ఆ కుటుంబాలకు ఉన్న రుణాల మొత్తం తక్కువగానే ఉంది."

ఇంతకూ చైనా రియల్ ఎస్టేట్ మార్కెట్ వాస్తవ పరిస్థితి ఏమిటి? కొన్ని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థలు తీసుకున్న రుణాల వాయిదాలను చెల్లించలేక బకాయి పడ్డాయి. అటువంటి సంస్థల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని వాటి ఆస్తులను జప్తు చేయడమో లేక వాటిని స్వాధీనం చేసుకోవడమో జరుగుతుంది. ఐతే రియల్ ఎస్టేట్ రంగం మొత్తంగా మందగిస్తే స్థూల డిమాండ్ తగ్గి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. ఇప్పుడు నడుస్తున్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులేవీ ఆగలేదు, అన్నీ కొనసాగు తూనేవున్నాయి. సంక్షోభంలో పడిన ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వ రియల్ ఎస్టేట్ సంస్థలు స్వాధీనం చేసుకుని నడిపిస్తున్నాయి. ఐతే కొన్ని ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు డిమాండ్ తగ్గింది. దానివలన ఏ మేరకు రియల్ ఎస్టేట్ రంగం నుండి పెట్టుబడి తగ్గుతుందో అంతకన్నా ఎక్కువగానే వస్తూత్పత్తి రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా హైటెక్ ఉత్పత్తి రంగంలో ఈ పెరుగుదల ఎక్కువగా ఉంది.

చైనా ప్రభుత్వం గృహనిర్మాణాలను వినియోగం కోసం ప్రోత్సహిస్తుందే తప్ప స్పెక్యులేషన్ కోసం కాదు. అందువల్ల ఇప్పటికే స్వంత ఇళ్ళు ఉన్నవారు మరో ఇంటికోసం రుణం కావాలంటే అది లభించే అవకాశాలు తగ్గిపోతున్నాయి. దేశంలో వెనుకబడ్డ ప్రాంతాలను గుర్తించి అక్కడ పబ్లిక్ హౌసింగ్ ప్రాజెక్టులను చేపడితే రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం లేకుండా నిలబెట్టవచ్చు. చైనా ఆర్థిక వృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం పోషించే పాత్ర పరిమితమైనదే. అందువలన ఈ రంగంలో వేగం తగ్గినా, మొత్తం ఆర్థిక వ్యవస్థ దెబ్బ తినిపోయే పరిస్థితి లేదు.

### చైనాలో కార్మికుల కొరత

చైనాలో 'ఒక కుటుంబం-ఒకే సంతానం' విధానాన్ని ఆచరిస్తూవచ్చారు. దానికి తోడు ఇంటిపని, ఆరోగ్య సంరక్షణ, బిడ్డల సంరక్షణ, విద్య తదితర రంగాలలో ప్రభుత్వ ప్రమేయం తగ్గింది. అందువలన బిడ్డల సంరక్షణకు పెట్టవలసిన ఖర్చు పెరుగుతోంది. ఐతే ఇది కార్మికుల కొరత పెద్ద ఎత్తును ఏర్పడడానికి దారి తీస్తుందన్న అంచనాలు వాస్తవరూపం ధరించే అవకాశాలు లేవు. మొదటి కారణం : చైనాలో పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీ వినియోగం వలన కార్మికుల కొరతను నివారించవచ్చు. రెండవది : చైనా ప్రభుత్వం ఎక్కువ మంది బిడ్డలను కనమని ప్రోత్సహిస్తున్నది. మూడవది : విదేశాల్లోని చైనీయులను వెనక్కి రప్పించి కార్మికుల కొరత లేకుండా చూసుకోవచ్చు. నాలుగవది : బిడ్డల సంరక్షణ, వైద్యం, విద్య వంటి రంగాలలో తిరిగి ప్రభుత్వం ఎక్కువ బాధ్యత వహిస్తే బిడ్డల సంరక్షణ కోసం ఇళ్ళ వద్దే ఉండిపోకుండా ఎక్కువమందిని పనులలోకి ప్రోత్సహించవచ్చు. ఐదవది : పదవీ విరమణ వయస్సును పెంచడం, కొన్ని తేలిక పనుల్లో వృద్ధులను కూడా నియోగించడం కూడా ఒక పరిష్కారం. అందువలన కార్మికుల కొరత వలన చైనా ఆర్థిక పురోగతి దెబ్బ తింటుందన్న అంచనా తప్పు.

### ప్రైవేటు రంగాన్ని దెబ్బ తీస్తున్నారు

పలువురు ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం 1978 నుండీ చైనా పురోగతి సాధిస్తూవచ్చిందంటే దానికి ప్రధాన కారణం ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడమే. కాని ఇప్పుడు చైనా అనుసరిస్తున్న విధానాలు ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేవిగా లేవు. అందుచేత ఎక్కువమంది పెట్టుబడిదారు లు పారిశ్రామిక పెట్టుబడినుండి ఫైనాన్స్ పెట్టుబడివైపు మారిపోతున్నారు. పైగా ప్రైవేటు పెట్టుబడిదారులవద్ద ఉండే చొరవ, సృజనాత్మకత, ప్రభుత్వ రంగంలో ఉండవు. అందుచేత చైనా ఆర్థిక వృద్ధి కొనసాగాలంటే ప్రైవేటు రంగానికి పెద్ద పీట వేయాల్సిందే.... ఇదీ బూర్జువా పండితుల వాదన

ఈ వాదన పూర్తిగా తప్పు. చైనా అనుభవాల రీత్యా చూసినా తప్పే. చైనా ప్రభుత్వం పనిగట్టుకుని ప్రైవేటు పెట్టుబడి దారులను నిరుత్సాహపరుస్తున్నది ఏమీ లేదు. ముందుగానే ప్రకటించిన పారిశ్రామిక విధానం ప్రకారం దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రాధాన్యతా రంగాలలో కేంద్రీకరణ ఉంటుంది. ఆయా ప్రాధాన్యతారంగాలలో ప్రవేశించదలచిన ప్రైవేటు పెట్టుబడిదారులకు ప్రోత్సాహమూ

ఉంటుంది. ఆ రంగాల ఉత్పత్తులకు డిమాండూ ఉంటుంది.

ఉదాహరణకు సెమీ కండక్టర్ల తయారీ రంగం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను ఉపయోగించుకుని ఈ రంగంలోకి ప్రవేశించే సంస్థలు లాభాలను ఆర్జిస్తాయి. అందుచేత చైనా ప్రభుత్వ విధానం ప్రైవేటు పెట్టుబడిదారులకు ఆటంకంగా ఏమీ లేదు. ఐతే సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో మాదిరిగా కాకుండా ఇక్కడ మొత్తం ఆర్థిక వ్యవస్థమీద ప్రభుత్వానికి గట్టి నియంత్రణ ఉంటుంది. అటువంటి నియంత్రణను వ్యతిరేకించే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి చైనా విధానాలు నచ్చకపోవచ్చు.


ఇక చొరవ, సృజనాత్మకత విషయాలకు వస్తే, ప్రైవేటు పెట్టుబడిదారులు అన్ని వేళలా చొరవను, సృజనాత్మకతను ప్రదర్శిస్తారు అని అనుకుంటే తప్పు. తమకు గ్యారంటీగా లాభాలు వస్తాయి అనుకున్నప్పుడే వాటిని ప్రదర్శిస్తారు. నిజానికి పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాన్ని మూల మలుపు తిప్పిన పరిశోధనలన్నీ దాదాపుగా ప్రభుత్వ ప్రోత్సాహంతో, ప్రభుత్వ ఆధ్వర్యంలో, ప్రజా ధనంతో ఆవిష్కరించ బడినవే. వాటిని చౌకగా ప్రైవేటు పెట్టుబడి దారులు తమ చేజిక్కించుకున్నారు. ఇందుకు అమెరికాయే ప్రధాన ఉదాహరణ.

ఇంకొక విషయం ఏమంటే, ప్రభుత్వ పారిశ్రామిక విధానం ఏ దిశగా సాగుతోందో స్పష్టంగా ఉన్నప్పుడు కొత్త పరిశోధనలన్నీ దానికి అనుగుణంగానే సాగుతాయి. ఆ పరిశోధనలను చేసేది ప్రభుత్వ రంగ సంస్థా లేక ప్రైవేటు సంస్థా అన్నది ప్రధానం కానే కాదు. వాస్తవానికి చైనాలో ప్రభుత్వ, ప్రైవేటు దేశీయ విదేశీ సంస్థలన్నీ ఈ పారిశ్రామిక విధానానికి అనుగుణంగానే పరిశోధనలను చేపడుతు న్నాయి. ఈ పారిశ్రామిక విధానం ప్రధాన లక్ష్యం ఆధునిక టెక్నాలజీని విదేశీ సంస్థలనుండి దేశీయ సంస్థలకు శరవేగంగా బదలా యించడం. దీనితోబాటు స్వంతంగా టెక్నాలజీని పెంపొందించుకోవడం. ఈ విధానం కారణంగానే ఒక్కో మెట్టూ ఎక్కుతూ చైనా సాంకేతికపరంగా ప్రపంచంలో ఉన్నత స్థాయికి చేరుకుంటోంది. అందుకే ఈ ప్రగతిని అడ్డుకోడానికి అమెరికా నానా పాట్లూ పడుతోంది. అమెరికా తరఫున వకాల్తా తీసుకున్న మేథావులు చైనా విధానాన్ని ఏదో విధంగా దుయ్యబడుతున్నారు.

**ముగింపు**

సాంకేతికంగా ఆధిపత్యాన్ని సాధించే లక్ష్యాన్ని చేరుకోడానికి చైనా పరిశోధనల

"వాస్తవానికి చైనాలో ప్రభుత్వ, ప్రైవేటు దేశీయ విదేశీ సంస్థలన్నీ ఈ పారిశ్రామిక విధానానికి అనుగుణంగానే పరిశోధనలను చేపడుతు న్నాయి. ఈ పారిశ్రామిక విధానం ప్రధాన లక్ష్యం ఆధునిక టెక్నాలజీని విదేశీ సంస్థలనుండి దేశీయ సంస్థలకు శరవేగంగా బదలా యించడం. దీనితోబాటు స్వంతంగా టెక్నాలజీని పెంపొందించుకోవడం. ఈ విధానం కారణంగానే ఒక్కో మెట్టూ ఎక్కుతూ చైనా సాంకేతికపరంగా ప్రపంచంలో ఉన్నత స్థాయికి చేరుకుంటోంది."



ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తున్న అత్యాదునిక సాంకేతిక నగరం షెంజెన్

రంగంలో పెట్టుబడులను బాగా పెంచింది. ఈ పెట్టుబడులు వెనువెంటనే ఉత్పత్తి పెరగడానికి దారి తీయవు. అందుచేత పెరిగిన పెట్టుబడులకు తగ్గట్టు జిడిపిలో వృద్ధి కనిపించదు. కాని చైనా ఆశిస్తున్న హైటెక్నాలజీ సాంకేతికతను సాధించగలిగితే అప్పుడు ఉత్పత్తి వేగం బాగా పుంజుకుంటుంది.

ఈ లోపు చైనా నుండి పెట్టుబడులు రాత్రి కి రాత్రి పలాయనం చిత్తగించడానికి అవకాశం లేకుండా చైనా తగు నియంత్రణా చర్యలను చేపడుతుందని ఆశించవచ్చు. అందర్జాతీయ రాజకీయాఆర్థిక పరిణామాల ప్రభావం కూడా మన పరిశీలనలో ఉండాలి. ఇప్పుడు ట్రంప్ విధించే ఆంక్షల పర్యవసానాలు చైనాపై కలిగించే ప్రభావం కన్నా, అమెరికా మీదనే ఎక్కువ ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తాయని పరిశీలకులు భావిస్తున్నారు.

రష్యా, చైనా వంటి దేశాలను సైనిక చర్యల ద్వారా లొంగదీయడం అమెరికాకు అసాధ్యం. ఇప్పుడు ఉత్పత్తి రంగంలో సూపర్ పవర్‌గా చైనా ఎదిగింది. ముడిసరుకుల సరఫరాలో సూపర్ పవర్‌గా రష్యా ఉంది. ఈ రెండు దేశాలమీదా ఆంక్షలు విధిస్తే దాని పర్యవసానాలను అమెరికా తట్టుకోగలదా అన్నది సందేహమే. ఉక్రెయిన్ యుద్ధం సందర్భంగా అమెరికా రష్యా పై విధించిన ఆంక్షలు ఎట్టి ప్రభావమూ చూపలేకపోయాయి. రష్యాకు తోడుగా చైనా నిలవడమే దీనికి కారణం. రష్యాకు అవసరమైన ఉత్పత్తులను అందించడమే కాకుండా రష్యానుండి ముడిసరుకులను చైనా దిగుమతి చేసుకుంది. రష్యా, చైనాల నడుమ నెలకొన్న బంధం బ్రిక్స్ వేదికతో, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ) తో మరింత బలపడింది. అనేకమంది మిత్రులను సంపాదించుకున్న ఈ తరుణంలో చైనాను సైనిక పరంగానే గాక వాణిజ్యపరంగా కూడా లొంగదియ్యడం అమెరికాకు అసాధ్యం.

(మూలం : రీసెంట్ గ్రోత్ ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ చైనా, రచన :సి. శరత్ చంద్, డిల్లీ విశ్వవిద్యాలయం అధ్యాపకులు)

❄

# వ్యవసాయ సంక్షోభం

(6వ పేజీ తరువాయి)

ఉన్నాయి. జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) రైతుల ఆత్మహత్యలను నమోదు చేయటానికి అనుసరిస్తున్న పద్ధతుల్లోప్రభుత్వం మోసాలకు పాల్పడుతున్నది. ఫలితంగా 2014 తర్వాత నమోదు చేసిన రైతుల ఆత్మహత్యల వివరాలు అంతకు ముందు వాటితో పొంతన లేకుండా ఉన్నాయి.

**వాస్తవం:** ఈ ఆత్మహత్యలే వ్యవసాయ సంక్షోభం కాదు. వ్యవసాయ రంగంలో నెలకొన్న విషాదకరమైన పరిస్థితికి అవి వ్యక్తీకరణ. అవి సంక్షోభానికి ప్రారంభం కాదు. దాని ఫలితం. సంక్షోభానికి కారణం కాదు. దాని పర్యవసానం.

**వ్యవసాయ సంక్షోభం-కారణాలు**

భారతదేశ వ్యవసాయాన్ని కార్పొరేట్ రంగం హైజాక్ చేసింది. అది హైజాక్ చేసిన విధానాన్ని నాగరాజ్ వివరించాడు. గ్రామీణ ప్రాంతాన్ని కొల్లగొట్టే విధంగా వాణిజ్యీకరణ జరిగింది. మన చరిత్రలో-బహుశా మానవ చరిత్రలోనే- అతి పెద్దసంఖ్యలో రైతుల తరలింపుకు దారితీసింది.

అతి పెద్దసంఖ్యలో ఉన్న స్వంత భూములు కలిగిన చిన్న రైతులు బతకటం కోసం ప్రపంచ స్థాయిలో పోరాటాలు చేస్తున్నపుడు, మనం నాగరికతా సంక్షోభాన్ని చూస్తున్నామని భావించాల్సి ఉంటుంది. మనం మానవత్వాన్ని కోల్పోవటం, మన ప్రేమకు హద్దులు కుదించుకుపోవటం, మనలో మానవత్వ భావనలు అడుగంటి పోవటానికి ఈ పరిస్థితులు దారి తీస్తున్నాయి. కోల్పోయిన ఉత్పత్తితోనో లేదా భయానకంగా ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల సంఖ్యతోనో ఈ సంక్షోభ ప్రభావాన్ని కొలవలేం.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**


## FORM IV

**(Rule 8)**

**UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWENARSHIP AND OTHER PARTICULARS ABOUT MONTHLY MAGAZINE MARXISTU**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Vijayawada, Hyderabad |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | B.V. Ragavalu |
| Nationality | : | Indian |
| Address | : | D.NO.1 1 60/2 M.B.Bhavan, RTC X Roads Hyderabad 20, Telangana State. |
| 4. Publisher's Name | : | B.V. Ragavalu |
| Nationality | : | Indian |
| Address | : | D.NO.1 1 60/2 M.B.Bhavan, RTC X Roads Hyderabad 20, Telangana State. |
| 5. Editor's Name : S.Venkatrao | | |
| Nationality | : | Indian |
| Address | : | D.No.12 402/1/1 Amarareddy Colony, Near Arvinda High School Tadepalli, Guntur District – 522501, Andhra Pradesh. |
| 6. Names and addresses of individuals : | | B.V. Ragavalu |
| 7. Who own the newspaper and Partners or shareholders holding more than One percent of the total capital | : | D.NO.1 1 60/2 M.B.Bhavan,RTC X Roads Hyderabad 20, Telangana State. |

I, B.V. Ragavalu hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28.02.2025

Sd/
(B.V.RAGHAVALU)
Publisher


## పాఠకుల స్పందన

# నయా-ఉదారవాద సంక్షోభంపై మరిన్ని వ్యాసాలు రావాలి

ఎడిటర్ గారికి నమస్కారము.

2025 జనవరి సంచికలో ప్రచురితమైన వ్యాసాలు, ముఖ్యంగా ఇద్దరు మహిళా జర్నలిస్టులు, సభానక్వీ, మిథాలీ ముఖర్జీ వ్రాసిన వ్యాసాలతో పాటుగా, జావేద్ అఖ్తర్ గారి వ్యాసం మరియు సైన్స్‌పై ఎస్.వెంకట్రావుగారి వ్యాసం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.


ఈ సందర్భంగా నాకు అబ్రహం లింకన్ గారి "ధన బలం - ప్రజాస్వామ్యం" పై చేసిన వ్యాఖ్యానం గుర్తుకు వచ్చింది. "ధనబలం యజమానిగా తన అధిపత్యం కోల్పోతుంది. మరియు ధనం మానవుల సేవకుడిగా మారుతుంది. అప్పుడు ప్రజాస్వామ్యం, ధనబలంపై అత్యున్నతంగా ఎదుగుతుంది" అని వ్యాఖ్యానించారు. కానీ 20వ శతాబ్దంలో కూడా ఆయన కలలు కల్లలుగానే మిగిలాయి. 19వ శతాబ్దిలో మార్క్స్, ఎంగెల్స్ మహాశయులు ప్రవచించిన, కమ్యూనిస్టు సిద్ధాంతం, లెనిన్ సామ్రాజ్యవాద సూత్రీకరణల ప్రకారం, ప్రపంచవ్యా పితమైన పెట్టుబడిదారీ విధానం నేటి నయా-సామ్రాజ్య వాదపు అంతర్గత వైరుధ్యాలతో, క్రమక్రమంగా బలహీన పడి, ఓడిపోయి, సోషలిజానికీ, అనంతరం క్రమంగా కమ్యూనిష్టు వ్యవస్థకు పరిణామం చెందుతుంది.

21వ శతాబ్దపు పరిణామాలు, ముఖ్యంగా ప్రపంచీకరణతో మిళితమైన నయా-ఉదారవాద వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను వామపక్ష శ్రేణులు కేంద్రీకరించి అర్థం చేసుకునే విధంగా, మన పత్రికలో వ్యాసాలు ఇంకా రావాలి.

అభినందనలతో,

**మహ్మమ్మద్ అక్బర్,** (విశ్రాంతి సివిల్ ఇంజనీర్)
గుంటూరు

# మహిళల పట్ల వెనుకబాటు అభిప్రాయాలను పారద్రోలాలి!



**– వి.ఐ. లెనిన్**

**1920లో మాస్కోలో క్లారా జెట్కిన్‌తో సమావేశమైనప్పుడు మహిళల విముక్తిపై లెనిన్ చేసిన వ్యాఖ్యలివి. దీన్ని "లెనిన్‌తో నా జ్ఞాపకాలు (మహిళల సమస్యపై ఇంటర్వ్యూ)" అనే పేరుతో 1966లో పునర్ముద్రించారు. "మహిళా విమోచ: వి.ఐ. లెనిన్ రచనల నుండి" (న్యూయార్క్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్ 1966) గ్రంథంలో దీన్ని పొందుపరిచారు.**

"మహిళల్లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించాలి. అప్పుడే వారు సాంస్కృతిక వెనుకబాటుతనం నుండీ, తన ఇల్లు, కుటుంబం...ఇదే ప్రపంచం అనుకునే సంకుచిత మనస్తత్వం నుండీ బయట పడతారు....లైంగిక సంబంధాలు, వివాహం మొదలైన అంశాల్లో ఒక విప్లవం రాబోతోంది.... మహిళలు లేకుండా ప్రజా బాహుళ్య ఉద్యమం అసాధ్యం... కోట్లాదిమంది మహిళలు మనవైపు లేకుండా మనం కార్మికవర్గ నియంత్రృత్వాన్ని అమలుజరపజాలం. వారులేకుండా మనం కమ్యూనిస్టు పార్టీని నిర్మించలేం. పురుషాధిపత్యంలో అణచివేయ బడుతున్న, బానిసత్వానికీ, దోపిడీకీ గురిచేయబుతున్న మహిళా జనబాహుళ్యాన్ని చేరుకోడానికి మనం మార్గాలు అన్వేషించాలి.... కార్మికవర్గ నియతృత్వం అంటే తమకు పురుషులతో సమానంగా – చట్టపరంగానూ, ఆచరణాత్మకంగానూ, కుటుంబంలోనూ, రాజ్యంలోనూ, సమాజంలోనూ – హక్కులు కల్పించడమేననీ, బూర్జువా అధికారాన్ని నాశనం చేయడమేననీ వారు తెలుసుకోవాలి. మహిళపట్ల పురుషుల్లోనూ, మహిళల్లోనూ ఉన్న వెనుకబాటు అభిప్రాయాలను పారద్రోలి, పాతబడిన, కమ్యూనిస్టేతర మానసిక స్థితిని పూర్తిగా నిర్మూలించడానికి కార్మికవర్గ నియంతృత్వ ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీతోనూ, ట్రేడ్‌యూనియన్లతోనూ కలిసి అన్ని విధాలా కృషి చేస్తుంది. చట్టం ముందు స్త్రీ, పురుషులు పూర్తిగా సమాన హోదాకలిగి ఉంటారన్న దాంట్లో మరోమాటకు తావులేదు. అన్ని రంగాల్లోనూ ఈ సమానత్వం పాటించడానికి నిజాయితీతో కృషి జరుగుతోంది. మహిళలు ఆర్థిక రంగంలోనూ, పరిపాలనా రంగంలోనూ, న్యాయవ్యవస్థలోనూ, ప్రభుత్వంలోనూ పనిచేయడానికి పెద్ద ఎత్తున వారిని నియమించడం జరుగుతోంది. అన్ని వృత్తి విద్యాసంస్థలనూ వారికోసం తెరిచుంచాం. దాని వల్ల వారు తమ వృత్తి నైపుణ్యాన్నీ, సామాజిక శిక్షణనూ మెరుగు పరుచుకోగలుగుతారు. వారికోసం మేము కమ్యూనిటీ వంటశాలలూ, భోజన శాలలూ, లాండ్రీలూ, రిపేరు షాపులూ, క్రెచ్‌లూ, కిండర్‌గార్టెన్లూ, చిల్డ్రన్ హోమ్‌లూ, అన్ని రకాల విద్యాసంస్థలనూ నిర్వహిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే మేము ఇంటిపనినీ, పిల్లలకు పాఠాలు చెప్పే పనినీ వ్యక్తిగతం నుండి సామాజిక కార్యక్రమంగా మార్చివేస్తున్నాం. అందువల్ల మహిళలు ఇంటి చాకిరీ నుండి విముక్తి చెందుతారు. భర్తలపై ఆధారపడే అవసరం నుండి బయటపడతారు. దానివల్ల మహిళలు తమ సామర్థ్యాలనూ, ఇష్టా ఇష్టాలనూ సమాజంలో పూర్తిగా ఉపయోగించుకునే అవకాశాలు ఏర్పడతాయి. ఇంటిలో కన్నా మెరుగైన అభివృద్ధి అవకాశాలను కమ్యూనిటీ సెంటర్లలో పిల్లలకు కల్పిస్తున్నాం. ప్రపంచంలోనే అత్యంత పురోగామి మహిళా శ్రామిక చట్టాన్ని చేశాం. దాన్ని సంఘటిత రంగంలోని అధికార ప్రతినిధులు అమలు జరుపుతారు. మెటర్నిటీ హోమ్‌లూ, తల్లీ–పిల్లల హోమ్‌లూ, తల్లుల ఆరోగ్య సంరక్షణ కేంద్రాలూ, శిశువులు, పిల్లల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై కోర్సులూ వంటివాటిని ఏర్పాటు చేస్తున్నాం. సమస్యలనూ, నిరుద్యోగాన్నీ ఎదుర్కొంటున్న మహిళలకు సహాయపడడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం.....కార్మికవర్గ నియంతృత్వంలో కమ్యూనిజం ద్వారా మహిళా విముక్తి అనేది గ్రామీణ ప్రాంతాల్లో కూడా జరుగుతుంది. ఈ విషయంలో మన పరిశ్రమలనూ, వ్యవసాయాన్నీ విద్యుద్దీకరించడం ద్వారా చాలా చేయగలం. ఇది చాలా పెద్ద పథకం! ఈ కార్యక్రమం అమలులో చాలా పెద్ద, భయంకరమైన కష్టాలున్నాయి. ఈ కష్టాలు అధిగమించడానికి ఏకైక మార్గం ప్రజల్లో నిగూఢంగా దాగిఉన్న శక్తులను బయటకు తీసి ఉపయోగించుకోవడమే. ఈ కార్యంలో కోట్లాదిమంది మహిళలు పాల్గొనాలి.... వాళ్లిప్పుడు స్తబ్దంగా ఉన్నారు. వాళ్లను కదిలించాలి. రోజువారీ జీవనం గడపడం లోనూ, తమ జీవితాలకు పరమార్థాలను వెదుక్కోవడంలోనూ తీవ్రమైన ఆందోళనలు వారిని సమస్యలకు గురిచేస్తున్నాయి. గతంలో కొద్దిమందిమాత్రమే ఈ విషయాన్ని గ్రహించగలిగారు గానీ చాలా మంది దీన్ని ఊహించనే లేదు. వారి ప్రశ్నలకు బూర్జువా సమాజం సంతృప్తికరమైన సమాధానాలు చెప్పలేదు. కమ్యూనిజం మాత్రమే ఈ పనిచేయగలదు. అందుకే మనం పెట్టుబడిదారీ దేశాల్లోని మహిళా జనబాహుళ్యాన్ని చైతన్యవంతం చేయాలి."

**ఉద్యమ అనుభవాలు**

# కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను ఎదురొడ్డిన విశాఖ స్టీల్ కార్మికోద్యమం



రచయిత సిఐటియు
ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి

**సిహెచ్ నర్సింగరావు**

**1991** నుండి సరళీకరణ విధానాల పేరుతో పాలకవర్గం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుచేస్తున్నది. గత 34 ఏళ్లలో ఈ విధానాలను అమలుచేయడానికి పాలకవర్గం ఎంత ప్రయత్నిస్తున్నదో, దాన్ని ప్రతిఘటించేందుకు కార్మికవర్గం కూడా ఏ మాత్రం వెనుకాడ్డంలేదు. దానికి ఉదాహరణే గత నాలుగేళ్ల నుంచి సాగుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం. 2014 ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రయివేటీకరణకు పాలసీ పెరాలసిస్ అని బిజెపి పేరుపెట్టింది. 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి బిజెపి నాయకత్వం మరింత దూకుడుతో ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేయడానికి పూనుకున్నది. ప్రభుత్వ రంగం వద్దు, ప్రయివేటు రంగం ముద్దు అన్న ప్రచారం సాగిస్తున్నది. ప్రధాని మంత్రి మోడీ స్వయంగా ప్రభుత్వరంగ పరిశ్రమలన్నీ చావడానికే పుడతాయని ఫిక్కి సమావేశంలో ఉద్ఘాటించారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుకు అమ్మేస్తాం, లేదా మూసేస్తామని పార్లమెంట్‌లో పదేపదే నొక్కి వక్కాణించారు. అయినా 2014 - 2019 మధ్య పూర్తిగా అమ్మాలని ప్రకటించిన 32 ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఏ ఒక్కదాన్నీ నూరు శాతం అమ్మలేకపోయారు. ఇందులో శీలం, దుర్గాపూర్, ఎల్లాయ్ స్టీల్‌ప్లాంట్, విశ్వేశ్వరయ్య స్టీల్‌ప్లాంట్‌లున్నాయి. మూసివేయబడిన విశ్వేశ్వరయ్య స్టీల్‌ప్లాంట్‌ను కుమారస్వామి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.16వేల కోట్లు కేటాయించి పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2019 నుంచి 2024 వరకు నూరు శాతం వాటాలు అమ్మాలని నిర్ణయించిన పరిశ్రమలను కూడా అమ్మలేకపోయింది. కానీ 2025-26 బడ్జెట్‌లో కూడా పది లక్షల కోట్ల విలువైన ప్రభుత్వరంగ పరిశ్రమల వాటాలు అమ్మాలని తిరిగి నిర్ణయించింది. కానీ ఆచరణలో అసాధ్యం. దీనికి ముఖ్య కారణం కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లో కార్మికుల ప్రతిఘటనే. భారత పెట్రోలియం పరిశ్రమను అమ్మాలని 2023 వరకు ప్రయత్నించి విఫలమైంది. మూడుసార్లు బిడ్డింగ్ వరకు వెళ్లి ఆపేసింది. ఛత్తీస్‌ఘడ్‌లోని నగర్‌నాగ్ కూడా టాటా బిడ్డింగ్‌లో పాడిన తరువాత ప్రయివేటీకరణను రద్దు చేసింది. సింగరేణి కాలరీస్‌ను ప్రయివేటు చేయాలనే నిర్ణయాన్ని ప్రధాని మోడీ హైదరాబాద్ ఎన్నికల సభలో ప్రయివేటీకరణను ఆపేసినట్లు ప్రకటించారు.

దేశ వ్యాపితంగా అనేక పరిశ్రమల్లో కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రయివేటీకరణ సాధ్యంకావడంలేదు. అందువల్ల కొత్తకొత్త పద్ధతులు అవలంభిస్తున్నది. కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు నూరు శాతం వాటాలు అమ్మడం సాధ్యంకాదని రుజువైన తరువాత భారీ పరిశ్రమలను ముక్కలుచేసి లీజుకు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ విధానం అమలుకోసం నేషనల్ మోనటైజేషన్ పైప్‌లైన్ పేరుతో జాతీయ రహదారులు, పోర్టు బెర్త్‌లు, రైల్వే స్టేషన్‌లు, రైల్వే లైన్లు, విద్యుత్, విమానాశ్రయాలు, బొగ్గు, గనుల లీజు ఒప్పందాలు చేయడానికి తహతహలాడుతున్నది.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభం, సరళీకరణ విధానాలు ఒకేసారి ప్రారంభమయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పన్నాగాలు పన్నింది. కానీ ప్రారంభం నుంచి సిఐటియు నాయకత్వంలో బలోపేతమైన ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిఘటించడంతో నేటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలను ఒక్క శాతం అమ్మడానికి సాధ్యంకాలేదు. దేశంలో మిగిలిన అన్ని స్టీల్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు పూర్తిగా నిధులు కేంద్రం కేటాయించింది. విశాఖ స్టీల్‌కు కేవలం ఐదువేల కోట్లు మాత్రమే కేటాయించింది. రూ.12వేల కోట్లు అప్పులు తెచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మించుకోవాల్సివచ్చింది. సొంత లాభాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఐదువేల కోట్ల నుంచి మూడు లక్షల కోట్ల ఆస్తులను సంపాదించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 లక్షల టన్నుల నుంచి 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి విస్తరించింది. దేశంలో అన్ని స్టీల్‌ప్లాంట్‌ల కంటే బలోపేతమైనది విశాఖ స్టీల్‌ప్లాంట్. సముద్ర తీరంలో దేశంలోవున్న ఏకైక స్టీల్‌ప్లాంట్ ఇది. విశాఖపట్నం పక్కనే 20 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌తో ఉన్న పరిశ్రమ. నవరత్న కేటగిరీలో చేర్చబడింది. కానీ నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ స్టీల్‌ప్లాంట్‌పై అభాండాలు వేస్తున్నది. మంచి కుక్కను చంపాలంటే దానిపై పిచ్చి కుక్క అని ముద్రవేయాలన్నట్లుగా విశాఖ స్టీల్‌ను అప్పులు,నష్టాల పేరుతో ప్రయివేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తున్నది.

2021 జనవరి 27న కేంద్ర ప్రభుత్వ 'క్యాబినెట్ సబ్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్'

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం వాటాలు అమ్మాలని నిర్ణయించింది. ఆ నాటి నుంచి కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి కుట్రలు, కుయుక్తులు రోజురోజుకు పెంచింది. 2022 జనవరి 27 నుండి రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేసింది. ఉత్పత్తిని తగ్గించి, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో 2024 సెప్టెంబరు వరకు ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ను మాత్రమే నడిపింది. మరోవైపున ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్, బొగ్గు కొరతను సృష్టించింది. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఆధ్వర్యంలో వున్న ఎన్‌ఎమ్‌డిసి నుంచి ముడి ఇనుప ఖనిజం సరఫరాను భారీగా తగ్గించింది. మూడు నెలల ముందే విదేశాలకు డబ్బులు చెల్లించి ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 2 లక్షల టన్నుల కోకింగ్ కోల్‌ను విశాఖ ఆదానీ గంగవరం పోర్టు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ లోపలకు రాకుండా ఆటంకాలు కల్పించింది. కార్మికులు 5 వేల మంది గత ఐదు సంవత్సరాల నుంచి రిటైర్మెంట్ అయినా వారి బదులు కొత్త కార్మికులు ఒక్కరినీ భర్తీ చేయలేదు. 2025 మార్చి నాటికి సుమారు 1500 మంది నైపుణ్యం కల్గిన కార్మికులు, అధికారులను విఆర్‌ఎస్ పేరుతో రూ.506 కోట్లు చెల్లించి బయటకు గెంటుతున్నారు. 25 సంవత్సరాల అనుభం కల్గిన కాంట్రాక్టు కార్మికులకు నోటీసు కూడా ఇవ్వకుండా తొలగించాలని కేంద్రప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

"2021 జనవరిలో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని నిర్ణయించినప్పటి నుంచి నేటి వరకు కార్మిక ఉద్యమాలు కొనసాగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లోనే పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, అధికారులతో సహా ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడం జరుగుతున్నది. యాజమాన్యం చేసిన ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొట్టడం జరిగింది."




విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడమే ఏకైక సమస్య. దేశంలో అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలకు ముడి ఖనిజం కేంద్ర ప్రభుత్వ సొంత గనుల నుంచి సమకూర్చాలని మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) చట్టం 1957 సెక్షన్ 17లో స్పష్టంగా వుంది. దీని ప్రకారమే దేశంలో ప్రభుత్వరంగ స్టీల్ పరిశ్రమలైన బిలాయ్, బొకారా, రూర్కెలా, దుర్గాపూర్ పరిశ్రమలతో పాటు ప్రయివేటు పరిశ్రమలకు కూడా సొంత గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. సొంతగనులున్న పరిశ్రమలకు ఒక టన్ను ముడి ఖనిజం తవ్వి తీసుకోవడానికి కేవలం రూ.600 ఖర్చవుతోంది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ బయట మార్కెట్‌లో సగటున ఒక టన్నుకు రూ.6,300 పెట్టి కొనుగోలు చేసింది. దీనివల్ల ప్రతి సంవత్సరం విశాఖ స్టీల్‌ప్లాంట్ మిగిలిన అన్ని స్టీల్‌ప్లాంట్‌ల కంటే అదనంగా మూడువేల కోట్లు ఖర్చు పెట్టాల్సివచ్చింది.

2021 జనవరిలో కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని నిర్ణయించినప్పటి నుంచి నేటి వరకు కార్మిక ఉద్యమాలు కొనసాగుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లోనే పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, అధికారులతో సహా ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడం జరుగుతున్నది. యాజమాన్యం చేసిన ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొట్టడం జరిగింది. కోవిడ్ కాలంలోని కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పోస్కో అనే దక్షిణ కొరియా కంపెనీకి అప్పగించాలని ఎంఒయు చేసింది. దక్షిణ కొరియా ప్రతినిధులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిన సందర్భంగా వారికి నిరసన తెలియజేసి ట్రేడ్ యూనియన్లన్నీ కలిసి దక్షిణ కొరియా ప్రతినిధి వర్గం పారిపోయేలా చేశాయి. ఆ ఒప్పందం రద్దయింది. విశాఖ ప్లాంట్ విలువను కట్టే మూడు కమిటీలు కూడా ఆ పనిచేయలేకపోయాయి. 2008లో పది శాతం స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మాలని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టడం జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మూడు సార్లు సమ్మెలు జరిగాయి. రెండుసార్లు రాష్ట్ర వ్యాపిత రాస్తారోకోలు జరిగాయి. రాష్ట్ర ప్రజలు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటానికి అపూర్వ మద్దతు ఇచ్చారు. పదివేల మందితో అగనంపూడి నుంచి బిహెచ్‌పివి వరకు జయప్రదంగా మానవహారం జరిగింది. రాష్ట్రంలోని బిజెపి మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు విశాఖ స్టీల్‌ప్లాంట్ గేట్ వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతు ప్రకటించారు. దేశ వ్యాపిత ట్రేడ్ యూనియన్ నాయకులు స్టీల్‌ప్లాంట్ గ్రౌండ్‌లో జరిగిన భారీ సభలో పాల్గొని పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ బీచ్‌లో పదివేల మందితో జరిగిన భారీ కార్మిక, కర్షక శంఖారావం సభలో అశోక్ ధావలే, రాజేష్ తికాయత్‌తో సహా సంయుక్త కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొని విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతు ఇచ్చారు.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించేనాటికి ఒక భారీ పరిశ్రమ కూడా లేదు. కనీసం పెన్సిలిన్ మందులుగానీ, రసాయనక ఎరువులు గానీ భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలుగానీ, భారీ ఉక్కు ఫ్యాక్టరీలుగానీ లేవు. సోషలిస్టు దేశాల సహాయంతో 1970 నాటికి అన్ని రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించుకోవడం జరిగింది. అంతరిక్ష శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ద్వారా ఇస్రో ఇస్రో ఈనాడు ఒకేసారి 103 ర్యాకెట్‌లను గగనతలంలోకి పంపించగలిగింది. ఆనాటి నెహ్రూ ప్రభుత్వం అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల

> **"అప్పులు తీర్చడమంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొనుక్కొనే కార్పొరేట్లకు సులభతర వ్యాపారం చేయడనికి తోడ్పడమే. ఈ ప్యాకేజీని విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు వినియోగించ గలిగినప్పుడు మాత్రమే సద్వినియోగమవుతుంది. విశాఖ స్టీల్ సమస్యలు శాశ్వత పరిష్కారం కావాలంటే సొంత గనులు కేటాయించడం ఏకైక పరిష్కారం."**

చుట్టూ ప్రదక్షిణలు చేసినా, ఏ ఒక్క పరిశ్రమకు సాంకేతిక సహాయం అవి అందించలేదు. సోషలిస్టు రష్యా సహాయంతో మందుల పరిశ్రమ ఏర్పడింది. బిలాయ్, బొకారొ స్టీల్‌ప్లాంట్‌లు, విశాఖ స్టీల్ మొదటి బ్లాస్ట్ ఫర్నేస్‌ను స్వయంగా వచ్చి బిగించారు. కానీ ఈ పరిశ్రమలన్నింటికీ కేవలం మన దేశం నుంచి ఎగుమతి చేసిన కాఫీ, పొగాకు లాంటి వస్తువులు సరఫరాతో రష్యా సరిపెట్టుకుంది. సోషలిస్టు దేశాల సాయంతో అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగాన్ని నేడు కార్పొరేట్ శక్తులు కబళించడానికి పూనుకుంటున్నాయి. భారీ ప్రభుత్వరంగ పరిశ్రమల వల్ల విస్తారమైన ఉపాధి పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరిశ్రమల ఆదాయం బలాన్ని చేకూర్చింది. ప్రతి పారిశ్రామిక కేంద్రం ఒక అభివృద్ధి కేంద్రంగా మారింది. ప్రతి భారీ పరిశ్రమ చుట్టూ టౌన్‌షిప్‌లు 24 గంటలు విద్యుత్, నీటి సరఫరా, విద్యా సంస్థలు, వైద్యశాలలు అభివృద్ధి అయ్యాయి. దీనివల్ల పరిశ్రమల చుట్టూ ప్రజలకు కనీస అవసరాలు కల్పించబడ్డాయి. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ అమలుచేయడంతో లక్షలాది మంది అత్యంత వెనుకబడిన ప్రాంతాల నుంచి ఉపాధి పొందారు. ఇటువంటి భారీ పరిశ్రమలను నేడు కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం కుట్రచేస్తున్నది. ప్రయివేటు అంటే సొంత లాభాలు ఆర్జించడమే. ప్రభుత్వరంగంపై ప్రజలందరికీ ఒక హక్కు వుంటుంది. ఇందులో లోపాలను పార్లమెంట్, శాసనసభల్లో లేవనెత్తవచ్చు. ప్రయివేటు కంపెనీలు ఎవరికీ జవాబుదారీ కాదు. అయినా కేంద్ర ప్రభుత్వం మొండిగా ప్రయివేటీకరణ విధానాలలో భాగంగా భారీ పరిశ్రమలు, భూములు, సముద్రతీరం, గనులతో సహా అత్యంత విలువైన సహజ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. ఇదే దేశ ద్రోహం. మాట్లాడితే దేశ భక్తి గురించి ఉపన్యాసాలు ఇచ్చే బిజెపి, దేశ సంపదను విదేశీయులకు కట్టబెట్టడం ఏ విధమైన దేశభక్తి? మారుతీ కార్ల కంపెనీ జాపాన్ సుజుకీ కంపెనీకి నూరు శాతం అమ్మివేయ బడింది. నేడు ఆ కంపెనీ ద్వారా జపాన్ సుజుకీ అత్యంత లాభాలు గడిస్తున్నది.

2024 ఎన్నికల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని ఎన్‌డిఎ భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలు వాగ్ధానం చేశాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య నుంచి బయటపడ్డానికి ఇటీవల రూ. 11,440 కోట్లు ప్యాకేజీ కేంద్రం ప్రకటించింది. ఈ మొత్తం సొమ్మును కేవలం అప్పులు తీర్చడానికి ఉపయోగిస్తారు. ఐదు నెలల నుంచి బకాయి ఉన్న జీతాలు చెల్లించడానికి గానీ, ప్లాంట్ నడపడానికి కావాల్సిన ముడి ఖనిజానికిగానీ, యంత్ర పరికరాలు కొనడానికిగానీ ఉపయోగించడంలేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్వయంగా ప్రకటించారు. అప్పులు తీర్చడమంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొనుక్కొనే కార్పొరేట్లకు సులభతర వ్యాపారం చేయడనికి తోడ్పడమే. ఈ ప్యాకేజీని విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు వినియోగించ గలిగినప్పుడు మాత్రమే సద్వినియోగమవుతుంది. విశాఖ స్టీల్ సమస్యలు శాశ్వత పరిష్కారం కావాలంటే సొంత గనులు కేటాయించడం ఏకైక పరిష్కారం. ❋

---

# భారత ఉపఖండంలో సాంకేతిక పద్ధతుల వ్యాప్తి

(25వ పేజీ తరువాయి)

వర్గం చేతుల్లో ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయో చెప్పలేము. కోవిడ్ వాక్సిన్ ఏవిధంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లో అభివృద్ధి చెందిన దేశాల చేతుల్లో ఆయుధాలుగా మారాయో సమాజం చూసింది.

అయితే సమస్య సైన్స్ అండ్ టెక్నాలజీలో లేదు. అది ఇటువంటి ఫలితాలను ఎంపిక చేసుకున్న సామాజిక క్రమాలలో వ్యవస్థలలో ఉన్నది. శాస్త్ర సాంకేతికతలు వాటికవే ప్రజలకు వ్యతిరేకం కాదు. ప్రజలకూ, పర్యావరణానికీ హానిచేసేట్టుగా ఉన్న కార్పొరేట్ ప్రయోజనాలు దీనికి కారణం. ఈ కార్పొరేట్ ప్రయోజనాలను పెట్టుబడిదారీ విధానం వర్గ సమాజం నిర్ణయిస్తున్నాయి. ఇవి సాధారణ ప్రజలకు, శ్రమజీవులకు శాస్త్ర సాంకేతిక రంగాల పాలసీలలో నిర్ణయక పాత్రను నిరాకరిస్తున్నాయి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో, సాధారణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నప్పుడే చరిత్రలో వైజ్ఞానిక అభివృద్ధి సాధ్యమైంది. శ్రమజీవులు, మేధావులు, శాస్త్రవేత్తల మధ్య మైత్రి విలసిల్లినప్పుడే చరిత్రలో సమాజమూ, దానితోపాటు విజ్ఞానమూ పురోగ మించింది.

ఆధునిక విజ్ఞాన శాస్త్ర ఆవిర్భావం పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం ఒకదానితో ఒకటి ప్రభావితమై పరిణామం చెందాయి. అయితే ఒక్క కార్య కారణ సంబంధం తోనే దీనిని వివరించలేము. పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటు పుట్టిన ఆధునిక విజ్ఞాన శాస్త్రం, ఆ పెట్టుబడిదారీ వ్యవస్థనే అవసరం లేని దానిగా చేస్తుందని జెడి బెర్నాల్ అన్నారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి ఉన్న విప్లకర స్వభావం ఇదే. ❋

# ప్రాచీన, మధ్య యుగాల వ్యవసాయ సాంకేతికత పరిణామం-2

**ఎం.వి.ఎస్.శర్మ**


**చెరువులు, కాల్వలు**

మొహెంజదారోలో సింధు నాగరికత కాలపు చెరువు మహా స్నానవాటిక గా చరిత్రకారులు వర్ణించేది బైటపడింది. 12 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పు, 2.4 మీటర్ల లోతు కలిగిన ఈ చెరువు నగర ప్రజల అవసరాలను మాత్రమే తీర్చగలిగేది. ఐతే గుజరాత్ లోని లోతల్ వద్ద 212 మీటర్ల పొడవు, 35 మీటర్ల వెడల్పు కల చెరువును కనుగొన్నారు. బహుశా ఇది వ్యవసాయ అవసరాలకోసమే నిర్మించివుండాలి. దీనిని నౌకాశ్రయంగా కూడా ఉపయోగించారని కొందరు భావించారు. సౌరాష్ట్ర ప్రాంతంలో జునాగఢ్ వద్ద సుదర్శనం అనే చెరువు ఉండేది. ఇది చంద్రగుప్త మౌర్యుని కాలంలో తవ్వించారని, అశోకుని కాలంలో అభివృద్ధి చేశారని తెలుస్తోంది. ఈ చెరువు నుండి దిగువ పొలాలకు కాలువల ద్వారా నీరు పారించిన దాఖలాలు కూడా ఉన్నాయి.

మధ్య యుగాలలో దక్షిణాదిన పెద్ద సైజులో చెరువులు నిర్మించినవి వెలుగులోకి వచ్చాయి. 11వ శతాబ్దంలో కావేరి నది మీద 300 మీటర్ల వెడల్పు, 5.5 మీటర్ల ఎత్తు కల డ్యామ్‌ను నిర్మించారు. దానినుండి కాలువల ద్వారా నీరు పొలాలకు అందించారు. కర్నాటక లోని కుముద్వతి నదిపై 15వ శతాబ్దంలో దాదాపు అదే స్థాయి డ్యామ్‌ను నిర్మించారు. అదే మదగ్ సరస్సు. విజయ నగర సామ్రాజ్యం (1346-1565) లో మట్టితో డ్యామ్‌లను నిర్మించి, వాటినుండి, కాలువలకు నీటిని మళ్ళించేందుకు రాళ్ళతో దృఢంగా నీటి వత్తిడిని తట్టుకునే విధంగా గేట్లను నిర్మించారు.

డ్యామ్‌లలో పేరుకున్న పూడికలను తొలగించడం, డ్యామ్ ఎత్తును నిలబెట్టడానికి మట్టిని తరలించడం తరచూ చేసేవారు.

14వ శతాబ్దానికి గానుగతో ఆడించిన చెక్కసున్నం నిర్మాణాలకు ఉపయోగించడం మొదలైంది. ఆధునిక డ్యామ్ లను తలపించేలా డిల్లీ సమీపంలో వజీరాబాద్ వద్ద 34.7 మీటర్ల పొడవైన కట్టను నిర్మించారు. దాని దిగువన ఆర్చీలు ఉన్నాయి. వాటికి నీటిని నిలువ చేయడానికి, అవసరమైనప్పుడు దిగువకు ప్రవాహాన్ని విడిచిపెట్టడానికి వీలుగా ఉండే గేట్లను అమర్చారు. దానిని ఆనుకుని 47.5 మీటర్ల పొడవు ఉన్న బ్రిడ్జిని నిర్మించారు. అది 9 ఆర్చిల మీద నిలబడింది. అటువంటిదే మరొక డ్యామ్ డిల్లీకి రెండోవైపున కూడా నిర్మించారు. ఈ నిర్మాణాలు ఫిరోజ్ తుగ్లక్ (1351-88) కాలంలో జరిగాయి. ఇతడి కాలంలోనే సట్లెజ్. యమున నదులనుండి అనేక



కాలువలను తవ్వి వ్యవసాయానికి నీటిని అందించే ఏర్పాట్లు జరిగాయి. వీటి డిజైన్లను ఆనాటి ఇంజనీర్లు ఏ విధంగా రూపొందించారో, కాలువలు ఒకదాని దిశకు మరొకటి అడ్డంగా వచ్చినప్పుడు ఆ సమస్యను ఏ విధంగా పరిష్కరించారో మనకు తెలియడం లేదు. ఐతే షాజహాన్ (1628-58) కాలంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల వివరాలు మనకి కొన్ని లభిస్తున్నాయి.

రావి నది నీటిని లాహోర్‌కు, పశ్చిమ యమున నీటిని డిల్లీకి తరలించే కాలువల నిర్మాణం షాజహాన్ కాలంలో జరిగింది. మార్గమధ్యంలో భూమట్టానికన్నా ఎగువన నీటిని తరలించగలిగేవిధంగా ఈ కాలువ నిర్మాణం చేపట్టారు.


**వ్యవసాయాధారిత ఉత్పత్తులు-పరికరాలు**


ధాన్యానికి పొట్టు తీసి, దానిని పిండి చేయడానికి రాతి పరికరాలను వాడడం కొత్త రాతియుగం నుండే ప్రారంభించారు. రాతి రోలుమధ్య గొయ్యిలా చేసి, దానిలో ధాన్యం పోసి, దానిని రోకలితో దంచేవిధానం అప్పటిదే. ఐతే తిరగలిని ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం మాత్రం చాలా కాలం తర్వాతనే వచ్చింది. చైనాలో, యూరప్ లోని మధ్యధరా ప్రాంతంలో ఈ తిరగలిని ఉపయోగించడం దాదాపు ఒకే కాలంలో, క్రీ.పూ. 2వ శతాబ్దంలో, మొదలైంది. భారత ఉపఖండంలో తొలి నాటి తిరగలి వాడకం క్రీ.శ.1వ శతాబ్దంలో అక్కడక్కడా కనిపించినా, వీటిని ఎక్కువగా ఉపయోగించడం క్రీ.శ.5వ శతాబ్దం లో చూస్తాం. మహిళలు తిరగలి విసురుతూ పాడే పాటలు ఆయా ప్రాంతాల జానపద గేయాలలో చాలా ప్రసిద్ధి చెందినవి ఉన్నాయి. (చూ. తక్షశిల లో ఉపయోగించిన తిరగళ్ళ ఊహాచిత్రాలు)

నూనె ఆడే గానుగల వినియోగం కూడా దాదాపు తిరగలి వినియోగంతోబాటే మొదలైంది. పశువులను ఉపయోగించే గానుగల వాడకం క్రీ.శ.8వ శతాబ్దం నాటికి మొదలైంది. ఒక శివాలయానికి ఇద్దరు దాతలు ఒక నూనె గానుగను విరాళంగా ఇచ్చిన శాసనం క్రీ.శ.804 నాటిది లభించింది.

చెరుకు గానుగలు భారత ఉపఖండంలో క్రీ.శ.1400 నాటికి ఉనికిలోకి వచ్చాయి. ఇందులో పరస్పరం వ్యతిరేక దిశలో తిరిగే రెండు స్తూపాకారపు రోలర్ల మధ్య నుండి చెరుకు గడలను జొప్పించి నలగ్గొట్టి రసం వెలికి తీసే విధానం ఉంటుంది. క్రమంగా ఈ గానుగకు పశువులను కట్టి ఉపయోగించడం కూడా మొదలైంది. ఈ

**❝ పశువుల శక్తిని వినియోగించే బదులు, ఎగువనుండి నీటి ప్రవాహాన్ని వేగంగా వదిలి, ఆ ఒత్తిడితో గానుగ నడిచే సాంకేతిక పరిజ్ఞానం వాయవ్య భారతంలో, కాశ్మీర్, నేపాల్ ప్రాంతంలో క్రీ.శ.17 వ శతాబ్దంలో ఉండేది. ఈ తరహా గానుగలను నూనె తీయడానికి, పిండి ఆడించడానికి ఎక్కువగా ఉపయో గించారు.❞**





స్తూపాకారపు రోలర్లను నిలువుగా అమర్చిన గానుగలు దక్షిణాది ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగించారు. వాటిని భూమికి సమాంతరంగా, అంటే అడ్డంగా అమర్చిన గానుగలను, బరువైన రోలు కింద తిరగలి మాదిరిగా అమర్చి వాటిమధ్య చెరుకును వేసి తిప్పే గానుగలను మధ్య, ఉత్తర భారతంలో ఎక్కువగా ఉపయోగించారు.

(చూ. క్రీ.శ.1800 నాటి చెరుకు గానుగ నమూనా. దీనిని దక్షిణాదిలో ఎక్కువగా ఉపయోగించారు.)


పశువుల శక్తిని వినియోగించే బదులు, ఎగువనుండి నీటి ప్రవాహాన్ని వేగంగా వదిలి, ఆ ఒత్తిడితో గానుగ నడిచే సాంకేతిక పరిజ్ఞానం వాయవ్య భారతంలో, కాశ్మీర్, నేపాల్ ప్రాంతంలో క్రీ.శ.17 వ శతాబ్దంలో ఉండేది. ఈ తరహా గానుగలను నూనె తీయడానికి, పిండి ఆడించడానికి ఎక్కువగా ఉపయో గించారు.

రెండు బండిచక్రాలకు మధ్య ఉండే అక్షం (యాక్సిల్) కు అమర్చిన పళ్ళ చక్రం తిరగడం ద్వారా పిండిని ఆడించే గానుగలు కూడా అక్బర్ కాలంలో ఉండేవని ఆ కాలపు రచనలు సూచిస్తున్నాయి.

### సారా తయారీ

చెరుకు, ద్రాక్ష, బార్లీ, కల్లు, కొబ్బరి, జీడి వంటి పలు రకాల ముడి పదార్థాలను సారా తయారీలో వినియోగించవచ్చు. సారా ఇచ్చే నిషాకు తరతరాలనుండీ మానవజాతి ఆకర్షితులౌతూనేవుంది. అందుచేత సారా తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానానికి కూడా సుదీర్ఘ చరిత్ర ఉంది. వాయవ్య భారతంలో, గాంధార ప్రాంతంలో క్రీ.పూ.150-క్రీ.శ,150 మధ్య కాలానికి చెందిన పరికరాలు, కుండలు లభించాయి. వాటి ఆకారాలను బట్టి అవి సారా తయారీకి ఉపయోగించారని నిర్ధారించారు. (చూ. గాంధారం లోని తొలినాటి సారా తయారీ ఊహాచిత్రం)

ఐతే ఈ తరహాలో తయారయే సారా ఎక్కువభాగం ఆవిరి రూపంలో ఉండగానే ఇగిరిపోతుంది ఈ పరిమితిని అధిగమించేందుకు, ఆవిరి రూపంలో సారాను వెనువెంటనే ద్రవ రూపంలోకి మార్చేందుకు ఆ పరికరం మీద నీటితో నిండిన పాత్రను అమర్చారు. 12వ శతాబ్దంలో యూరప్‌లోను, అరబ్బు ప్రాంతంలోను మొదలైన ఈ ప్రక్రియ 13వ శతాబ్దానికి భారత ఉపఖండానికి చేరింది. అనతికాలంలోనే ఉపఖండం అంతటికీ వ్యాపించింది. (చూ. యూరపియన్‌అరబ్ సాంకేతికత తో తయారైన సారాబట్టీ ఊహాచిత్రం)



1.14 Italo-Arab still, as described by Abū'l Fazl (artist's drawing)

ఇదే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అత్తర్లు, ఎసెన్సులు తయారు చేయడం క్రీ.శ.15 వశతాబ్దం నాటికి మొదలైంది.

### నీలిమందు తయారీ

నీలిమందు తయారీకి ఉపయోగించే మొక్కల సాగు మన దేశంలో క్రీ.పూ.350 నాటికే ఉండేది. ఈ మొక్కల బెరడును, ఆకులను నీటిలో నానబెట్టి, కుళ్ళిన తర్వాత కిందకు చేరిన మడ్డిని ఎండబెట్టి నీలిమందును తయారు చేసేవారు. తర్వాత క్రీ.శ.13వ శతాబ్దంలో స్వల్ప కాల వ్యవధిలోనే నీలి మందును ఉత్పత్తి చేసే సాంకేతికతను కనుగొన్నారు. చెట్ల ఆకులు, బెరడు నలిగేలా వేగంగా తిప్పి, దాని నుండి నీరు బైటకు తేరి వచ్చాక దిగువన ఉండే పదార్థాన్ని ఎండబెట్టే విధానాన్ని పాటించారు.

*(చేతి వృత్తుల సాంకేతికత పరిణామం గురించి వచ్చే సంచికలో)*

చరిత్ర గమనంలో సైన్సు -2

# భారత ఉపఖండంలో సాంకేతిక పద్ధతుల వ్యాప్తి

***(2023 డిసెంబర్ 23-25 తేదీల్లో విజయవాడలో జరిగిన సైన్సు వర్క్‌షాపులో ప్రవేశపెట్టిన పత్రం నుండి)***

**డా॥ గేయానంద్**



రచయిత జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు

క్రీ.శ 1000 -1500 వచ్చేసరికి భారత ఉపఖండం సాంకేతిక పరిజ్ఞానాలలో కొత్తదనం, మెరుగుదల కనిపించాయి. అయితే ఇది స్థానికంగా వచ్చిన అభివృద్ధి కాదు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల నుండి ఉపఖండంలోకి వ్యాప్తి చెందిన విజ్ఞానం ఇది. ముఖ్యంగా మధ్య ఆసియా, టర్కీ. పర్షియా. అరబ్. మధ్యధరా ప్రాంతాల నుండి ఈ విజ్ఞానం వచ్చింది. చైనా నుండి మధ్య ఆసియా, పర్షియా గుండా మరికొంత వచ్చింది.

ఆల్కహాల్, పెర్ఫ్యూమ్ తయారు చేసే స్వేదన ప్రక్రియ, (ఉపఖండపు ఉత్తర పశ్చిమ ప్రాంతాల్లో మొదట్లో ఉన్నవే) ఇటాలియన్ అరబ్ నమూనాలుగా వచ్చాయి. పశ్చిమాసియా నుండి జిప్సం సున్నము తయారు చేసే ఆవిరి ట్యాంకులు, బట్టీలు వచ్చాయి. నీలి రంగు తయారీ పెద్ద ఎత్తున మెరుగుపడింది. 15, 16 శతాబ్దాలు నడుమ మధ్యఆసియ, పర్షియా నుంచి మెరుగైన నూలువడికే పనిముట్లు భారతదేశంలోకి వచ్చాయి. రాజస్థాన్లో పెద్ద స్థాయిలో ఉండే ఖనిజాల వెలికితీత పద్ధతులు, గోల్కొండలో వజ్రాల గనుల్లో పద్ధతులు కూడా ఇతర నాగరికతల నుండి వచ్చినవే అని హబీబ్ అంటాడు. అయితే ఈ గనుల్లో కూడా తామర తంపరగా ఏమీ ఉత్పత్తి పెరగలేదు. గనుల్లో ఊరే నీటిని బయటకు పంపే పద్ధతులు, పంపులు లాంటివి వారికి తెలియకపోవడమే ఇందుకు కారణం. ఈ సమస్యకు పరిష్కారం యూరోప్ పారిశ్రామిక విప్లవపు కొత్త శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లభించింది.

కానీ ఆ కాలంలోనే కొన్నిచోట్ల స్థానికంగానే విజ్ఞానం పురోగమించడం కూడా చూస్తాం. అక్బర్ కాలంలోనే (1580) ఫ్రీజింగ్ మిక్సర్ (నీళ్లను చల్లబరిచే ప్రక్రియ), యూరోపియన్లకంటే ముందే భారతీయులకు తెలుసు. 15, 16 శతాబ్దాలలో కేరళలో గణిత ఖగోళ శాస్త్రాలు పురోగమించాయి. అయితే ఈ పరిష్కారాలు కొన్ని ప్రత్యేక సమస్యలకు ఉద్దేశించినవే. వీటికి రుజువులు ఒక శతాబ్దం తర్వాత గాని దొరకలేదు. యూరోప్‌లో జరిగినట్టు సూత్రీకరణలు జరగలేదు.

**యూరోప్ లో..**

క్రీస్తుపూర్వం 500కు ముందు గ్రీస్‌లో ప్రకృతిని ప్రకృతి కారణాలతోనే అర్థం చేసుకోవడానికి కొన్ని అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. క్రీస్తుపూర్వం 600 సమయంలో భారతదేశంలో ఉన్న చార్వాకులతో, కణాదుడితో పోల్చగల తాత్వికులు గ్రీస్‌లో ఆవిర్భవించారు.

థేల్స్ (క్రీ.పూ. 624) నీటితో ప్రకృతి తయారయింది అన్నాడు. అనాక్సిమినస్ (క్రీ.పూ. 570) గాలితో తయారయింది అన్నాడు. పైథాగరస్ (క్రీ.పూ. 560) ఒక కేంద్రక అగ్ని చుట్టూ భూమి తిరుగుతుంద న్నాడు. మానవ, జంతు శరీరాలను కోసి చూసిన ఆల్ కెమియాన్ మేధస్సుకు మెదడే కేంద్రం అన్నాడు. ఏది శాశ్వతం కాదు అన్ని మారుతూనే ఉంటాయని హెరాక్లిటస్ అన్నాడు. లూసిపస్ (క్రీ.పూ. 490) డెమొక్రటస్ (క్రీ.పూ. 470) ప్రపంచం అంతా అణువులతో నిర్మింపబడింది అన్నారు. మార్మికతను ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకించిన మరొక తత్వవేత్త అనెగ్జ గోరస్ (క్రీ.పూ. 460). ఆయన విశ్వం దేవుని చేత సృష్టింపబడలేదని అన్నాడు. సూర్యుడు ఒక ఎర్రటి రాయి అనీ, సూర్య కాంతి చంద్రుని మీద పడుతుందని అన్నాడు. ఇది నచ్చని గ్రీకులు విచారించి శిక్షించబోతే తప్పించుకొని పారిపోయాడు. క్రమేణా, ప్రకృతి గురించిన ఆలోచనలు నిలిచిపోయాయి. ప్రజాస్వామ్యం, మానవ స్వభావం, సామాజిక నీతి వైపు గ్రీకుల దృష్టి మళ్ళింది.

వీరందరూ ఒక విధంగా తొలి సైన్స్ భావనలకు ఆద్యులు. ప్రకృతిని ప్రకృతికి అతీతమైన కారణాలతో కాకుండా, ప్రాకృతిక కారణాలతోనే అర్థం చేసుకునే ప్రయత్నం వీరు చేశారు.

గ్రీకులు విశ్వాన్ని గురించి చేసిన ఊహలు దాదాపు 2000 సంవత్సరాలు మానవ ఆలోచనలను ప్రభావితం చేశాయి. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384), ప్లాటో(క్రీ.పూ. 427) ప్రకృతి పరిశీలనల తోనే కాక అప్పటికి తర్కబద్ధ ఆలోచనలతో అనేక భావనలను ప్రతిపాదించారు. విశ్వం ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం పని చేస్తుందనీ, ప్రకృతి దొంతర దొంతరలుగా ఉండి, ప్రతి జీవికీ అందులో నిర్దిష్టమైన స్థానం నిర్ణయమై ఉంటుందనీ అన్నాడు. ఖగోళం దోషరహితమైనదనీ, గ్రహాలు గోళాలలో ఒదిగి ఉండి, ఆ గోళాలు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాయని, భూమ్మీద పనిచేసే సూత్రాల కన్నా ఖగోళంలో సూత్రాలు భిన్నంగా ఉంటాయని- ఇలా అనేక ప్రతిపాదనలు వీరు ప్రకటించారు. అరిస్టాటిల్ ప్రభావంతో, టాలమీ (క్రీ.పూ. 100-170) విశ్వానికి భూమి కేంద్రం అనీ, గ్రహాలన్నీ భూమి చుట్టూ భ్రమిస్తుంటాయని ఒక భూకేంద్రక విశ్వనమునాను ప్రతిపాదించాడు. అరిస్టార్చెస్ (క్రీ.పూ. 230) సూర్యుడి చుట్టూ గ్రహాలు భూమి తిరుగుతున్నాయని ప్రతిపాదించినా, సాధారణ జ్ఞానం ఉన్న వారెవరు దీన్ని నమ్మడానికి సిద్ధపడలేదు. గాలెన్ (క్రీ.పూ. 130-200)

**“ గ్రీకుల తర్వాత ప్రాధాన్యత లోకి వచ్చిన రోమన్లు (క్రీ.పూ.27-600), వైజ్ఞాని కాంశాల కంటే రోజువారీ విషయాల పైననే మొగ్గు చూపారు. ఇంజనీరింగ్, ఫైనాన్స్, ప్రభుత్వ నిర్వహణ లాంటి అంశాలపై కేంద్రీకరించారు. కానీ రోమన్ మిలటరీ పెద్దదైపోయి దోచుకోవడం మీద ఆధారపడటంతో దాన్ని పోషించడం పతనమవుతున్న సమాజానికి వీలు కాలేదు. ”**

జంతువులను కోసి పరిశోధించి తద్వారా మానవ శరీర భాగాలను విశ్లేషించే ప్రయత్నం చేశాడు. గాలెన్ 1700 సంవత్సరాలు మానవ శరీర శాస్త్రంపై ప్రభావం చూపాడు.

అయితే మిగిలిన వారిలా కాకుండా, ప్రయోగాల ద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన ఆర్కిమెడిస్ (క్రీ.పూ.287) కూడా అప్పటి వాడే.

అలెగ్జాండర్ దండయాత్రలతో ఆయా దేశాలలో ఈ భావాల మార్పిడి (ఇండియా తో సహా) విరివిగా జరిగింది.

**మతం, మధ్యయుగాలు**

గ్రీకుల తర్వాత ప్రాధాన్యత లోకి వచ్చిన రోమన్లు (క్రీ.పూ.27–600), వైజ్ఞాని కాంశాల కంటే రోజువారీ విషయాల పైననే మొగ్గు చూపారు. ఇంజనీరింగ్, ఫైనాన్స్, ప్రభుత్వ నిర్వహణ లాంటి అంశాలపై కేంద్రీకరించారు. కానీ రోమన్ మిలటరీ పెద్దదైపోయి దోచుకోవడం మీద ఆధారపడటంతో దాన్ని పోషించడం పతనమవుతున్న సమాజానికి వీలు కాలేదు. వ్యవస్థలో ఏర్పడిన జడత్వం, బర్బరుల దాడులు, బానిసల తిరుగుబాట్ల వల్ల శాస్త్రీయ విజ్ఞాన కృషి చేయడానికి సమాజానికి వీలు లేకుండా పోయింది. బానిసత్వం సహజమే కదా అనే ధోరణిలో ఉన్న సమాజం అది. బానిసలకు మొదట్లో కొంత వెసులుబాటు దొరికినా, ఆ తరువాత వారిపై పీడన తీవ్రమై వారికి విజ్ఞానంతో సంబంధం లేకుండా పోయింది. బానిస వ్యవస్థలో ఉత్పత్తి స్తంభించి, చివరికి ఆటవిక తెగల దాడితో సామాజిక మార్పులు వచ్చాయి.

క్రీ.శ. 3–7 శతాబ్దాలలో యూరోప్‌లో క్రిస్టియానిటీ వ్యాప్తి చెందింది. క్రిస్టియానిటీ లోని ప్రజాతంత్ర భావాలు కింది తరగతి ప్రజలను ఆకట్టుకున్నాయి. క్రిస్టియానిటీ ప్రజల్లో వేళ్లూనడం చూసి బలహీనంగా ఉన్న రోమ్ సామ్రాజ్యం తన మనగడ కోసం క్రిస్టియానిటీలోకి మారిపోయింది. క్రైస్తవ మత బోధనలలో ఉన్న ప్రకృతీ, మానవుడూ దేవుడి సృష్టి లాంటి క్రైస్తవ మత బోధనలకు, గ్రీకులు చెప్పిన విశ్వనమూనాతో పోలికలు ఉన్నాయి. తొలి విజ్ఞాన శాస్త్రానికీ, క్రైస్తవ మతానికీ పెద్దగా ఘర్షణ ఏర్పడలేదు. కానీ క్రైస్తవ మతం యూరోప్‌లో ఒక బలియమైన శక్తిగా మారే క్రమంలో మేధో వ్యాపారాలను స్తంభింపజేసింది. భూస్వామ్యంలో బానిసలకు బదులుగా అర్ధ బానిసలు రైతులు ఉనికిలోకి వచ్చారు. కానీ భూమికి బంధింపబడి ఎటువంటి చొరవా లేకుండా ఉండిపోయారు. చర్చి నియంతృత్వంతో పాటు ఆర్థికంగా దెబ్బతిన్న సమాజం కావడంతో సైన్సు పురోగమించలేదు. వేళ్లూనుకుంటున్న ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా ఒక సుస్థిరమైన స్వయం పోషకమైన, స్థానికమైన ఉత్పత్తి పద్ధతులు ముందుకు వచ్చాయి. కొత్త పరిశోధనలు అవసరం అనిపించకుండా చేశాయి. విజ్ఞాన శాస్త్రం ఒక సుదీర్ఘమైన సుషుప్తిలోకి వెళ్ళింది.

చర్చి ఒక బలమైన అధికార శక్తిగా తయారై అధికారానికీ, ప్రభుత్వానికీ మారుపేరైంది. జీవితంలోని అన్ని అంశాలనూ, అభిప్రాయాలనూ, భావాలనూ నియంత్రించడం ప్రారంభించింది. మతాధికారులే మేధో ప్రపంచాన్ని కూడా ఆక్రమించుకున్నారు. మతాన్ని సమర్థించే విజ్ఞానం కోసం చర్చి అన్ని ప్రయత్నాలు చేసేది.

యూరోప్‌లో క్రిస్టియానిటీ, పశ్చిమాసియాలో ఇస్లాం ఉల్లంఘించడానికి వీలుకాని మత సూత్రీకరణలు చేసి బలమైన సామాజిక పాత్రలను తీసుకున్నాయి. ఒక పవిత్ర గ్రంథం కేంద్రంగా మత తాఖీదులను రుద్దుతూ, సామాజిక జీవితాలను శాసించాయి.

ఇదేవిధంగా చైనాలో కన్ఫ్యూషియస్ మతం కూడా స్థిరపడింది.

ఈ మతాలలో – యథాతథ సామాజిక స్థితిని సమర్థించడం – ఒక సాధారణ అంశం. భూస్వాములు పాలకుల రాజకీయ అధికారానికి పురోహిత వర్గం సాధికారికత కల్పించింది. కొన్ని సందర్భాలలో ఈ పూజారులే భూస్వాములై, పెద్ద ఎత్తున భూములు సైన్యాలు కలిగి ఉండే వారు.

యూరోప్‌లో మత, విద్యాసంస్థలకు చర్చే యజమాని. వాటి వద్ద ఎన్నో వనరులతో పాటు పెద్ద లైబ్రరీలు కూడా ఉండేవి. యూరోప్‌లో ఎంతోమంది క్రైస్తవ మత బోధకులే వైజ్ఞానికులుగా కూడా ఉండేవారు. మధ్యయుగాలలో సైన్స్ కృషి చర్చిలలోనే జరిగేది. అందుకే యూరోప్‌లో చర్చి బోధకుల ద్వారా జరిగిన వైజ్ఞానిక అధ్యయనాలన్నీ చర్చి నమ్మకాలకు, మూర్ఖత్వాలకు లోబడే జరిగాయి. కాబట్టే అరిస్టాటిల్ భూ కేంద్రక సిద్ధాంతం, బైబిల్ విశ్వ సృష్టి సిద్ధాంతం, ఖగోళ సిద్ధాంతం ప్రశ్నింపబడలేదు. అందుకే వీటిని చీకటి యుగాలున్నారు. కానీ అదే సమయంలో కొన్ని ఇతర ఆసియా నాగరికతలు ఎంతో కొంత స్వేచ్ఛగా ఆలోచించి సృజనాత్మకత చూపి (కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా), కొత్త విజ్ఞానాన్ని సృష్టించగలిగాయి.

**ఇస్లామిక్ పశ్చిమాసియా**

పశ్చిమాసియాలో మధ్య యుగాల తొలి రోజుల్లో ఆ కాలపు అన్ని సామాజిక మత ఉద్యమాల లాగే ఇస్లాం ఒక తిరుగుబాటు ఉద్యమంగా ప్రారంభమైంది. నైతిక విలువలను బోధించింది. దేవుని ముందు అందరూ ఒకటనే భావనను ప్రకటించింది. రోమన్ సామ్రాజ్యం లాగా ఏకశిలా సదృశ్యంగా కాకుండా కైరో, ఇస్తాంబుల్, సమర్ఖండ్, పర్షియా.. ఇలా అనేక అధికార కేంద్రాలు ఉనికిలోకి వచ్చాయి. గ్రీక్ రోమన్ కాలాల్లో క్రోడీకరింపబడిన విజ్ఞానమంత సామ్రాజ్య విస్తరణ ఫలితంగా అరబ్బులకు చేరింది. యూరోప్ నుంచి వచ్చిన విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు నాశనం కాకుండా ఇస్లాం రాజ్యాలు కాపాడుకున్నాయి. అరబ్బు రాజుల భాష సామాన్యుల భాష ఒకటే కావడంతో ఆచరణకూ, విజ్ఞానానికీ సంబంధం ఏర్పడింది. ఇస్లాం పెద్దగా నియంత్రణలు పెట్టేది కాదు. వైజ్ఞానిక అంశాల పట్ల మూర్ఖంగా వ్యవహరించేది కాదు. ఏ చర్చి శాఖతో కూడా పెద్దగా సంబంధం లేని, అనేక మంది పండితుల్ని చేరదీసే వాళ్ళు. వారు వివిధ వైజ్ఞానికాంశాలపై శ్రద్ధ పెట్టేవారు. అలాగే అరబ్, పర్షియన్ పండితులు చైనా ఇండియా లకు విస్తృత పర్యటనలు చేసేవారు. ఈ పర్యటనలకు ఆయా పాలకుల మద్దతు ఉండేది. చైనా ఇండియాల నుండి గ్రంథాలను సేకరించి అనువాదాలు చేసుకునేవారు. దశాంశ

> **"అంతకుముందున్న క్రైస్తవ సమాజం కంటే ఇస్లామిక్ సమాజాలు విశాల దృష్టి కలవి. అంతరాలు తక్కువ. ఇస్లాం సాధారణ మానవుడి మతంగా ముందుకు వచ్చింది కాబట్టి ప్రజాస్వామిక విలువలు ఉండేవి. సాధారణ వ్యక్తులకూ, చేతివృత్తుల వాళ్లకూ సంబంధించిన విషయాలను పండితులు కూడా పట్టించుకుని అధ్యయనం చేసేవారు. ఈ కాలంలోనే లోహ, రసాయన,ఖగోళ శాస్త్రాలు, పింగాణీ, గాజు కటకాల తయారీ, మ్యాపుల, యంత్రాల తయారీ - లాంటివి ఎన్నో ముందుకు వచ్చాయి."**

పద్ధతి క్రీ.శ. 750 ప్రాంతంలో ఇండియా నుండి అరబ్బులకు చేరింది. ఇండియా నుండి గణితం (ముఖ్యంగా ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ,) ఖగోళ శాస్త్రం, ఆయుర్వేదం- అరబిక్ అనువాదాల ద్వారా లాటిన్ లోకి వెళ్ళాయి. అలాగే చైనా నుండి – పింగాణి, కాగితం తయారీ, రసాయన శాస్త్రం, తదితరాలు – కూడా. అరబ్, పర్షియన్ పండితులు సేకరించారు. ఇలా సేకరించిన విస్తృతమైన వైజ్ఞానిక గ్రంథాలు, ఆ తర్వాత యూరోప్‌లో ఆధునిక సైన్సు ఆవిర్భావానికి దోహదకారి అయ్యాయి.

అంతకుముందున్న క్రైస్తవ సమాజం కంటే ఇస్లామిక్ సమాజాలు విశాల దృష్టి కలవి. ఇందులో అంతరాలు తక్కువ. ఇస్లాం సాధారణ మానవుడి మతంగా ముందుకు వచ్చింది కాబట్టి, ప్రజాస్వామిక విలువలు ఉండేవి. సాధారణ వ్యక్తులకూ, చేతివృత్తుల వాళ్లకూ సంబంధించిన విషయాలను పండితులు కూడా పట్టించుకుని అధ్యయనం చేసేవారు. ఈ కాలంలోనే లోహ శాస్త్రం, రసాయన శాస్త్రం, పింగాణీ తయారీ, గాజు కటకాల తయారీ, ఖగోళ శాస్త్రం, మ్యాపుల తయారీ, యంత్రాల తయారీ – లాంటివి ఎన్నో ముందుకు వచ్చాయి. గ్రీకుల ఆవిష్కరణ అయిన ఆస్ట్రోలాబ్ (నక్షత్రాల స్థానాల్ని గుర్తించే చిన్న పని ముట్టు) విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. వస్త్రాలు ఇతర పరిశ్రమలలో వాడే మధ్యంతర రసాయనాల తయారీ పెరిగింది. అది డమాస్కస్ ఇతర పశ్చిమాసియా కేంద్రాలకూ, చైనా, ఇండియా, యూరోప్‌లకూ మధ్య వ్యాపారానికే కాదు, విజ్ఞానం పరస్పరం పంచుకోవడానికి కూడా తోడ్పడింది.

విరివిగా జరిగే వ్యాపారాల వల్ల మామూలు మనుషులు లాభపడ్డారు. రాజులు, కులీనులే కాకుండా వ్యాపారులు కూడా పండితులకు మద్దతు ఇచ్చేవారు. విజ్ఞానం, జ్ఞానం కోసం మాత్రమే అని కాకుండా, ఆచరణాత్మక ఉపయోగాలకు వాడే వారు సాంకేతిక పద్ధతులు బాగా పురోగమించినా సాధారణ సూత్రీకరణలు పెద్దగా జరగలేదు.

ఉదాహరణకు అద్దాలు తయారయినాయి. కాంతి ఒక వాహకం నుంచి మరో వాహకానికి ప్రయాణిస్తే వంపు తిరుగుతుందని తెలుసు కొన్నారు. కానీ కాంతి వక్రీభవన సిద్ధాంతాలకు అది దారి తీయలేదు. అలాగే అరబ్, పర్షియన్, మధ్య ఆసియా విజ్ఞానులు ఖగోళ పరిశీలనలు ఎన్నెన్నో చేశారు. కానీ వాటి ఆధారంగా అరిస్టాటిల్, టాలెమి సిద్ధాంతాలను ఖండించే ప్రయత్నం వారెప్పుడూ చేయలేదు.

మానవాకృతిని చిత్రించడం ఇస్లాంలో నిషేధం కాబట్టి, మానవ శరీర శాస్త్ర అధ్యయనాన్ని ఇస్లాం అంగీకరించలేదు.

12,13 శతాబ్దాలలో సిసిలి, స్పెయిన్‌లలో ముస్లిం, క్రిస్టియన్ మేధావుల మధ్య సంబంధాలు ఏర్పడి అరబిక్‌లో ఉన్న గ్రీకు విజ్ఞానాన్ని మళ్లీ లాటిన్‌లోకి అనువాదాలు చేశారు. కానన్ అనే వైద్యశాస్త్ర గ్రంథం 30 సార్లు యూరోప్‌లో ముద్రించబడింది. 13వ శతాబ్దంలో యూరోప్ అంతటా ముస్లిం తరహా ఆసుపత్రులు ఏర్పడ్డాయి. స్పెయిన్ సిసిలీలలో ఇస్లాం వ్యాపించడం ద్వారా వారి సాంకేతిక శాస్త్రీయ విజ్ఞానాలు యూరోప్‌కు వ్యాపించాయి. భారతీయులు కనుగొన్న సున్నా అరబ్బుల ద్వారా యూరోప్‌లోకి వెళ్ళింది. అలాగే అయస్కాంతం మొదట ఉపయోగించింది చైనీయులు. ఐతే, అది అరబ్బుల ద్వారానే యూరోప్‌ను చేరింది. చైనీయులు మొదట తుపాకీ మందును కనుక్కొన్నా, దాని చొచ్చుకుపోయే శక్తిని గ్రహించి, దాన్ని వాడింది యూరోపే. అయితే 11వ శతాబ్దం నుండి బైజాంటైన్, ఇస్లామిక్ సామ్రాజ్యాలు బలహీనపడటంతో, సైన్స్‌కు ఆదరణ కరువైంది. అరబ్ వైజ్ఞానిక సంస్కృతి ఒక ముగింపుకు వచ్చింది. అయితే అది గ్రీక్ సైన్స్‌కు ఆధునిక సైన్స్‌కు మధ్య వారధిగా నిలబడింది.

### వాణిజ్యం, విజ్ఞానం పరస్పర మార్పిడి

విజ్ఞానానికి దేశాల, నాగరికతల ఎల్లలు ఉండవు. ఆ విధంగా పరిమితం చేయలేము (హిందుత్వ వాదులు చెబుతున్నట్టు). భూమార్గాల ద్వారా, సముద్రయానాల ద్వారా, సిల్క్ రూట్ ద్వారా పెద్ద ఎత్తున సరుకుల సరఫరా జరిగింది. ఈ ప్రక్రియలో నాగరికతలూ, సంస్కృతుల మధ్య విజ్ఞానం పరస్పరమారకం జరిగింది. దీనితో వ్యాపారమూ పెరిగింది. భూమార్గాలు, సముద్ర మార్గాలు సిల్క్ రూటు ద్వారా ప్రపంచంలోనే అన్ని ప్రాంతాల మధ్య పెద్ద ఎత్తున వాణిజ్యం జరిగేది. తూర్పు ఉత్తరాఫ్రికా, పశ్చిమాసియా, మధ్యధరా ప్రాంతాలు పర్షియా, భారత ఉపఖండం, చైనాల మధ్య వ్యాపారాలు జరిగేవి. కొన్ని ప్రాంతాలు కొన్ని,కొన్ని ఉత్పత్తులకు మరికొన్ని ప్రాంతాలు మరికొన్ని వ్యాపారాలకు పేరు తెచ్చుకున్నాయి. మస్లిన్, ఇనుము, ఉక్కులకు ఇండియా, సిల్కు, పింగాణీలు, సుగంధ తైలాలకు పర్షియా పశ్చిమాసియా ప్రసిద్ధి చెందాయి. ఈ క్రమంలోనే విజ్ఞానమూ వ్యాప్తి చెందింది.

అదే సమయంలో కొన్ని జ్ఞానాలను రహస్యంగా ఉంచి ఆ నైపుణ్యాలనూ, పద్ధతులనూ ఎవరికీ తెలియనిచ్చేవారు కాదు. ఆ కుటుంబాలకో, కులాలకో, వృత్తి శ్రేణుల మధ్యనో అదంతా నిక్షిప్తం అయిపోయి ఉండేది. దాంతో అటువంటి విజ్ఞానం ఆయా ప్రాంతాలకే పరిమితమై పోయేది. చాలా నాగరికతల్లో సంస్కృతుల్లో భవన నిర్మాణ పద్ధతులు, లోహపు పనులు, పింగాణీ వస్త్రం, నీటిపారుదల, ఎత్తిపోతల, పరికరాలలో ఎంతో పురోగమనం చూస్తాము. అయితే కొత్తగా పెరుగుతున్న ఒక వ్యావసాయక క్రమం, భూస్వామ్యం దీనికి అడ్డుకట్ట వేశాయి.

విజ్ఞానం పుట్టుకను, అందులోని విషయాన్ని దాన్ని దశ దిశలను ప్రగాఢంగా ప్రభావితం చేసినవి – ఆనాటి సామాజిక ఆర్థిక పరిస్థితులూ సామాజిక నిర్మాణాలే. అవి రాజులు, ఉన్నత ఉద్యోగులు, కూలీనుల చేతుల్లో ఉండేవి.

హస్తకళా నిపుణులు పండితులు వృత్తిదారుల మధ్య పెద్దగా ఇచ్చి పుచ్చుకోవడాలు ఉండేవి కాదు. వివిధ నాగరికతల్లో ఉన్న వృత్తిదారుల మధ్య కూడా పెద్దగా సంబంధాలు ఉండేవి కాదు. శతాబ్దాల కాలంలో ఉన్నత స్థితికి చేరుకున్న నైపుణ్యాలు వ్యవసాయ దారులకు గృహస్థులకు కులీనులకు సైన్యానికి అవసరాలు తీరుస్తూ వచ్చాయి. కానీ వృత్తిదారుల

> **❝ ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడం తో, సామాజిక పరిస్థితుల్లో కూడా మార్పులు మొదలయ్యాయి. మేధో ప్రపంచాన్నీ, అధికార వ్యవస్థనూ నియంత్రిస్తూ ఫ్యూడల్ వ్యవస్థను కాపాడే క్రమంలో అతి శక్తివంతంగా తయారైన చర్చినీ, చర్చి అధికారాన్నీ ప్రశ్నించడం మొదలైంది. ఫ్యూడల్ భూస్వాములకు ప్రత్యర్థులుగా తయారైన వ్యాపారులు చర్చికి వ్యతిరేకంగా నిరసనను ప్రోత్సహించారు. ❞**

నైపుణ్యాలను సాంకేతికతలనూ, అర్థం చేసుకొని అధ్యయనం చేయాల్సిన పండితులు, ఆ పని చేయలేదు. పాలకులూ పట్టించుకోలేదు. అది ఉపయోగమని కూడా అనుకోలేదు. అంటే మేధో కృషి చేసే వాళ్లకు, సాంకేతిక నిపుణులకు మధ్య దూరం బాగా పెరిగి, ఘనీభవించింది. ఆలోచించే మెదడుకు, పనిచేసే చేతికి సంబంధం లేకుండా పోయింది.

**క్యాపిటలిజం -**
**ఆధునిక విజ్ఞాన శాస్త్ర ఆవిర్భావం**

క్రీ.శ.1500లకు ముందు చూస్తే బహుశా ప్రపంచమంతా, (వివిధ దేశాలలో భారత దేశంతో సహా) శాస్త్ర సాంకేతిక అంశాలు తరతమస్థాయిలతో ఒకే విధంగా ఉన్నాయనుకోవచ్చు. కానీ తరువాత యూరోప్‌లో వైజ్ఞానిక విప్లవం జరగడానికి కొన్ని నిర్దిష్ట చారిత్రక పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే పారిశ్రామిక విప్లవానికి దారితీసింది.

ఫ్యూడల్ వ్యవస్థలో సాగుభూమి విస్తరించి, సమాజ అవసరాలు ఎక్కువయ్యే కొద్దీ బానిసల సంఖ్య సరిపోలేదు. మానవ శ్రమను ఇతర శ్రమలతో పూరించాల్సి వచ్చింది. గుర్రపు జీను కనుగొని (11వ శతాబ్దం) జంతుశక్తిని ఎక్కువగా ఉపయోగించడం అవసరమైంది. మధ్యయుగాలలో వాయు శక్తిని, నీటి శక్తిని కూడా ఎక్కువగా ఉపయోగించడం ప్రారంభించారు.

మధ్యయుగాల్లో సాంకేతిక పరికరాలను మెరుగు చేసుకోవడం అవసరమైంది. కంపాస్, తుపాకిమందు, ప్రింటింగ్ ప్రెస్ యూరోప్ సమాజంలోకి ప్రవేశించాయి. ఇవి యూరోప్ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులకు దారితీసాయి. ఉత్పత్తి పెరిగే సరికి, వ్యాపార అవకాశాలను వెతుక్కోవాల్సి వచ్చేసరికి రవాణా అవసరమైంది. అర్ధ బానిసల బలవంతపు చాకిరీ మీద ఆధారపడిన వ్యవసాయక ఉత్పత్తుల ఆర్థిక వ్యవస్థ నుంచి, క్రమేణ పట్టణ ఉత్పత్తుల వ్యాపారాధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అయింది.

ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు రావడం తో, సామాజిక పరిస్థితుల్లో కూడా మార్పులు మొదలయ్యాయి. మేధో ప్రపంచాన్నీ, అధికార వ్యవస్థనూ నియంత్రిస్తూ ఫ్యూడల్ వ్యవస్థను కాపాడే క్రమంలో అతి శక్తివంతంగా తయారైన చర్చినీ, చర్చి అధికారాన్నీ ప్రశ్నించడం మొదలైంది. ఫ్యూడల్ భూస్వాములకు ప్రత్యర్థులుగా తయారైన వ్యాపారులు చర్చికి వ్యతిరేకంగా నిరసనను ప్రోత్సహించారు. అంతవరకు అఖండమైన శక్తిగా ఉన్న చర్చిలో చీలిక వచ్చింది. 1378-1418 మధ్య ముగ్గురు వేర్వేరు పోపులు తయారయ్యారు. చర్చిలో సంస్కరణలు అనివార్యమయ్యాయి. అధికారం కోసం ప్రభువుల మధ్య ,పోపుల మధ్య సంఘర్షణ ప్రారంభమైంది.

మరోవైపు ఉత్పత్తి పెరిగి, వ్యాపార అవసరాలు పెరిగే కొద్దీ, సాహస నౌకా యాత్రలు ముందుకు వచ్చాయి. కొలంబస్, వాస్కోడిగామా, మేజిలాన్ లాంటి సాహస యాత్రికులకు యూరోప్ లోని రాచరిక వ్యవస్థలే అవసరమైన సహాయాన్ని స ్ వ ు క ్ ా ం ా ౘ ం ు ు . ఉత్పత్తి పద్ధతుల్లో, టెక్నిక్‌లలో, చాలా సంక్లిష్ట మార్పులు వచ్చాయి. టెక్నిక్‌లో మార్పులు సైన్స్‌కు దారి తీస్తే, టెక్నిక్‌లు వేగంగా మారిపోవడానికి సైన్స్ తోడ్పడింది. ప్రయోగము, గుణింతము ఒక పద్ధతిగా సైన్స్‌లో ఎదగాల్సి వచ్చింది. ఈ విధమైన సాంకేతిక ఆర్థిక సామజిక వైజ్ఞానిక పెనుమార్పులు అల్లుకుపోయే ఒక సామాజిక దృశ్యం ముందుకు వచ్చింది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ఆవిర్భవించడం అనివార్యమైపోయింది.

15వ శతాబ్దం చివరలో సైన్స్ ఆసక్తి అంతా ఆకాశం మీదే. భూ కేంద్రక సిద్ధాంతమే విజ్ఞాన శాస్త్రానికి, ధార్మిక శాస్త్రాలకు ఒక 1400 సంవత్సరాలు ఆధారంగా ఉండేది. మధ్యయుగాల స్తబ్దత నుంచి బయటపడటానికి నూతనంగా రూపొందుతున్న వ్యాపారుల చేతివృత్తుల నావికుల అవసరాలను తీర్చే క్రమంలో శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన మార్పు అవసరమైంది. ఆ మార్పును తెచ్చిన వాడే కోపర్నికస్.16వ శతాబ్దంలో ఒక సాహసోపేతమైన మేధో విన్యాసంతో, కోపర్నికస్(1473) భూమిని స్థాన భ్రంశం చేసి సూర్యుని విశ్వకేంద్రంలో ప్రతిష్టించాడు. గ్రహాల చలనాలు అర్థం చేసుకోవాలంటే భూ కేంద్రక సిద్ధాంతం సరిపోదని సూర్యకేంద్రక సిద్ధాంతం కోపర్నికస్ ప్రతిపాదించాడు. అయితే క్యాథలిక్ చర్చి నుండి ఖండనను ఎదుర్కోవాల్సి వస్తుందని భయంతో తన అభిప్రాయాలను 9 సంవత్సరాలు బయట పెట్టలేదు. కానీ గ్రీకుల, ఇస్లాం క్రిష్టియన్ మతాల ప్రభావంలో ఉన్న విజ్ఞానం స్థానంలో, ఒక సరికొత్త విజ్ఞానం ఆవిష్కృతమైంది. తరువాత టైకోబ్రాహీ (1546-1601), జాన్ కెప్లర్ (1571-1630), గెలీలియో (1564-)లు ఒక నూతన ఖగోళ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. కానీ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని సమర్ధించి నందుకు గెలీలియోకు 70 ఏళ్ల వయసులో గృహనిర్బంధాన్ని చర్చి విధించింది. అలాగే బ్రూనో (1548-1600), విశ్వం అనంతమని స్వేచ్ఛగా ప్రచారం చేసినందుకు చర్చి సజీవ దహనం చేసింది. కానీ బైబిల్ అధికారం చర్చి నమ్మకాలు కదిలిపోయాయి. విజ్ఞాన శాస్త్రం ఓ పుస్తకం లేదా ఒక మత గ్రంథం ఆధారంగా కాకుండా ప్రయోగాల ద్వారా పరిశీలనల ద్వారా రుజువుల ద్వారా ముందుకు వెళ్లాల్సిన ఒక నూతన పరిస్థితి ఏర్పడింది.

14,15 శతాబ్దాల యూరోప్‌లో, ఆ తర్వాత 16, 17 శతాబ్దాల్లో విప్లవాత్మక మైన అడుగులు పడ్డాయి. కొన్ని సంఘటనలు కొన్ని సామాజిక క్రమాలు ప్రారంభమై ఆధునిక సైన్స్ ఆవిర్భావానికి దారితీసింది. కొంచెం అటు ఇటుగా, ఇదే కాలంలో మూడు సామాజిక ఉద్యమాలు దాదాపు ఒకే సమయంలో తల ఎత్తాయి. అప్పుడున్న సామాజిక అధికారాలను ధిక్కరిస్తూ వచ్చిన ఉద్యమాలవి. అవి 1. క్యాథలిక్ చర్చికి ఇతర క్రైస్తవ శాఖలకు వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాటు ఒకటి. మత సంస్కరణల కోసం, చర్చి మూర్ఖపు పట్టు నుంచి స్వేచ్ఛ కోసం, పోపుకు చర్చికి మధ్య ఉన్న సంబంధాల విషయంలో - వచ్చిన ఉద్యమం ఇది 2. ఫ్యూడల్ నియంతృత్వాలకు వ్యతిరేకంగా నూతనంగా ఆవిర్భవించిన

బూర్జువా పారిశ్రామిక తరగతి ఉద్యమించడం రెండవది.

ఆస్తి హక్కు, చట్టబద్ధ పాలన, ప్రజల ఆకాంక్షలు – వీటిపై ఆధారపడ్డ ప్రజాస్వామిక వ్యవస్థ కావాలంటూ జరిగిన ఉద్యమం ఇది.

3. ఒక హేతువాద ఆలోచనల (తాత్విక శాస్త్రీయ) కోసం, ఏ విమర్శ లేకుండా పాత విజ్ఞానాలని స్వీకరించడం పై, పాత మూఢవిశ్వాసాలపై, ప్రారంభమైన మేధో ఉద్యమం మూడవది.

ఈ మూడు పాయలూ ఫ్యూడల్ మధ్యయుగాల సామాజిక నిర్మాణాలకు ఒక సవాలు విసిరాయి.

❝ మధ్యయుగాల చివరిలో తయారైన పట్టణాలు, ఫ్యూడల్ ఎకానమీతో పొసగక ఇబ్బంది పడ్డాయి. లోలోపలి మార్పులు జరిగి కొత్త ఆర్థిక క్రమాలు సైన్స్‌కు కారణమయ్యాయి. కొత్త సాంకేతికతల మీద ఆధారపడిన పరిశ్రమలు ఆవిర్భవించాయి. మంచి టెక్నిక్‌లు, మంచి రవాణాతో మార్కెట్లలో అమ్మకపు సరుకుల ఉత్పత్తి పెరగసాగింది. 15వ శతాబ్దం వచ్చేసరికి బూర్జువాలు ఎంత శక్తివంతులయ్యారంటే బలవంతపు చాకిరీ స్థానంలో డబ్బు తీసుకొని శ్రమ చేసే ఉత్పత్తి పద్ధతిని తీసుకొచ్చారు. ❞

ఈ లోపు క్యాపిటలిజం ఒక ప్రధాన ఉత్పత్తి పద్ధతిగా (1450–1690) పరిణామం చెంద సాగింది.

కానీ మధ్యయుగాల చివరిలో తయారైన పట్టణాలు, పరిశ్రమలు, వ్యాపారం, ఫ్యూడల్ ఎకానమీతో పొసగక ఇబ్బంది పడ్డాయి. లోలోపలి మార్పులు జరిగి కొత్త ఆర్థిక క్రమాలు సైన్స్ కు కారణమయ్యాయి. కొత్త సాంకేతికతల మీద ఆధారపడిన పరిశ్రమలు ఆవిర్భవించాయి. మంచి టెక్నిక్‌లు, మంచి రవాణాతో మార్కెట్లలో అమ్మకపు సరుకుల ఉత్పత్తి పెరగసాగింది. ఈ మార్కెట్లు అంతకు ముందు గ్రామీణ ప్రాంతాలపై ఆధారపడి బతికేవి. అయితే 15వ శతాబ్దం వచ్చేసరికి బూర్జువాలు ఎంత శక్తివంతులయ్యారంటే బలవంతపు చాకిరీ స్థానంలో డబ్బు తీసుకొని శ్రమ చేసే ఉత్పత్తి పద్ధతిని తీసుకొచ్చారు. ఫ్యూడల్ బానిసత్వం నుంచి శ్రామికులకు స్వేచ్ఛ, చట్టబద్ధ ప్రభుత్వ పాలన కావాలన్నారు. కొత్త ప్రకృతి సూత్రాల ఆవిష్కరణల ఆధునిక సైన్సు, భిన్న సాంకేతికతల కలయిక నుంచి కొత్త ఉత్పత్తులు ముందుకు వచ్చాయి. ఒక అద్భుతమైన సాగర యాత్రలు, సంస్కరణోద్యమాలతో ఒక పునర్వికాసం (1440–1540)ఊపందుకున్నది. అచ్చు యంత్రం అందుబాటులోకి వచ్చింది. సముద్ర యాత్రికులకు రెండు పరికరాల ఆవిర్భావం – టెలిస్కోపు గడియారం – అవసరంగా మారింది. తీవ్రమైన మత యుద్ధాలు జరిగినా (1540–1650) యూరోప్ వ్యాపారులకు అమెరికా తూర్పు దేశాలు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యూడల్ రాజులే పరిపాలన చేస్తూ ఉన్నా క్రమేణా బూర్జువా వర్గం పాలనా యంత్రాంగంపై పట్టు సంపాదించింది. యూరప్ అంతా బూర్జువా వర్గం హస్తగతం గావడానికి 200 సంవత్సరాలు పట్టింది.. ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి పునాదులయ్యాయి.

ఇక అప్పటి సైన్స్ కున్న వ్యవస్థాగత నిర్మాణంలో (నాచురల్ ఫిలాసఫీ) కూడా పెద్ద మార్పులే వచ్చాయి. మతాధికారుల శిక్షణ కోసం మతాన్ని సమర్థించే విజ్ఞానం కోసం విద్యాలయాలు ప్రారంభించారు. ఇవే ఆ తర్వాత విశ్వవిద్యాలయాలుగా మారాయి. రాబర్ట్ గ్రోసెట్ (1168–1253)కు యూరోప్‌లో ముఖ్యమైన శాస్త్రవేత్తగా పేరు ఉండేది. ఆయన ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్. అలాగే బిషప్ కూడా. ఆయన కాంతి మీద, అద్దాల శాస్త్రం మీద ప్రయోగాలు చేసి అవన్నీ దైవికమైనవిగా తేల్చాడు.

ఆ కాలంలో పుస్తకాలు తక్కువ కాబట్టి ఉపన్యాసాలతో, చర్చలతో బోధన జరిగేది. గ్రామరు, తర్కం, వివాదం, అంకగణితం, జామెట్రీ, ఖగోళ శాస్త్రం, సంగీతం, మతశాస్త్రం, తత్వశాస్త్రం బోధించేవారు. చాలా తక్కువ సైన్సు ఉండేది. ఆ సైన్స్ కూడా మతనమ్మకాలను సమర్థించడం కోసం ఉండేది. అయితే కొత్త వైజ్ఞానిక కృషి కూడా కొంత జరిగింది. ప్రకృతి, చరిత్ర, ఖనిజాలు, పక్షులు, కంటి శాస్త్రం.. ఇలాంటి అంశాలపై కొంత కృషి జరిగింది. అయితే ఈ వేయి సంవత్సరాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవడానికే ఎక్కువగా ఉపయోగపడ్డాయి. క్రమేణా యూనివర్సిటీలలో జరిగే చర్చలలో విజ్ఞానార్జనను ప్రోత్సహించేవారు. గ్రీకు, అరబ్బు, చైనా, ఇండియా లాంటి సంస్కృతులతో సంపర్కం ఏర్పడింది. తర్వాత జరిగిన వైజ్ఞానిక విప్లవానికి ఇలాంటి ధోరణులే ఆలంబన అయ్యాయి. 14,15 శతాబ్దాలలో కేథలిక్ చర్చి, రాజుల మద్దతుతో యూనివర్సిటీలు విస్తృతమయ్యాయి. యూనివర్సిటీలలో క్లాసికల్ గ్రంథాల అధ్యయనం, మతశాస్త్రం, తత్వశాస్త్రం, ఇతర కళల అధ్యయనం జరిగేది. ఇటువంటి అవసరం చర్చి వెలుపల ఉండే సమాజంలో కూడా పెరిగింది. అయితే యూనివర్సిటీలన్నీ చాందస భావాలకు నెలవులుగా కూడా ఉండేవి. చర్చి ఏది చెబితే అదే చెల్లుబాటు అయ్యేది. సామాజిక పరిస్థితులు దానికి తగినట్లే ఉన్నాయి. గెలీలియో, బ్రూనోలకు ఏం జరిగిందో అందరికీ తెలుసు. అయితే కొద్ది కాలంలోనే ఇవన్నీ సమూల మార్పులకు లోనయ్యాయి.

వేల సంవత్సరాలుగా ఉన్న విజ్ఞానాలను ప్రశ్నించకుండా శాస్త్రం ముందుకు పోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి శాస్త్రాలలో పాత అధికార గ్రంథాలు ప్రశ్నించబడ్డాయి. వేల సంవత్సరాలుగా గాలన్ చెప్పిన మానవ శరీర నిర్మాణాన్ని, మానవ శరీరంపై ప్రత్యక్షంగా పరిశోధనలు చేసిన వెశాలియస్ (1514–1564) సవాలు చేశాడు. విలియం హార్వే (1578) గుండె, రక్తనాళాల ద్వారా రక్తప్రసారం జరుగుతుందని నిరూపించి మానవ శరీర నిర్మాణాన్ని అర్థం చేసుకోవడంలో నూతన విజ్ఞానానికి తలుపులు తెరిచాడు. న్యూటన్ (1642)తన చలనసూత్రాలతో, ఒక యాంత్రిక విశ్వాన్ని ఆవిష్కరించడంతో, అరిస్టాటిల్ దొంతరల విశ్వం కూలిపోయింది. రసాయన శాస్త్రంలో ఫ్లాజిస్టాన్ సిద్ధాంతం బద్దలు కొట్టబడి ప్రకృతిలోనే ఇతరేతర శక్తులపై దృష్టి సారించబడింది. ఈ ఆవిష్కరణల క్రమంలోనే శాస్త్రీయ పద్ధతి ముఖ్యమైన అంశంగా ముందుకు వచ్చింది. పరిశీలన దత్తాంశాలు కొలతల మీద ఆధారపడిన ప్రయోగాలు సిద్ధాంతాలు ముందుకు వచ్చాయి. శాస్త్రం ఒక సెల్ఫ్ కరెక్టింగ్ ప్రాసెస్‌గా ముందుకు వచ్చింది.

ఈ కాలంలో వచ్చిన ఆర్థిక అభివృద్ధి వల్ల ఏర్పడిన భౌతిక అవసరాలు– గనులు సముద్రయానం యుద్ధాలు – మరింత సాంకేతిక అభివృద్ధిని ఆశించాయి. రంగంలోకి వచ్చిన కొత్త కొత్త పదార్థాలు, ద్రవ్యాలు కొత్త కొత్త ప్రక్రియలు,

> **"ఈ కాలంలో వచ్చిన ఆర్థిక అభివృద్ధి వల్ల ఏర్పడిన భౌతిక అవసరాలు- గనులు సముద్రయానం యుద్ధాలు - మరింత సాంకేతిక అభివృద్ధిని ఆశించాయి. రంగం లోకి వచ్చిన కొత్త కొత్త పదార్థాలు, ద్రవ్యాలు కొత్త కొత్త ప్రక్రియలు, కొత్త కొత్త సమస్యలు తెచ్చి సైన్స్‌పై వత్తిడి పెంచాయి. మరింత ముందుకు పోవాలంటే కొత్త తాత్వికతలు కావాల్సి వచ్చింది."**

కొత్త కొత్త సమస్యలు తెచ్చి సైన్స్‌పై వత్తిడి పెంచాయి. మరింత ముందుకు పోవాలంటే కొత్త తాత్వికతలు కావాల్సి వచ్చింది. 17వ శతాబ్దం మొదటి కల్లా రంగంలోకి వచ్చిన నూతన బూర్జువా వర్గం ఈ ప్రేరణలకు స్పందించ గలిగింది. సైన్సు ప్రయోగాత్మకంగా మారటానికి అవసరమైన అంశాలను ప్రోది చేసుకోగలిగింది. నావికులను తెచ్చుకున్నట్టే శాస్త్రవేత్తలను తెచ్చుకోగలిగింది. 17వ శతాబ్దం ముగిసేసరికి, యాంత్రిక శాస్త్రంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ ఉండే కీలక సమస్యలను బేధించగలిగింది. చరిత్రలో మొదటిసారిగా ఒక సామాజిక అవసరం ఏర్పడినప్పుడు, ఒక కొత్త సాంకేతిక ఆవిష్కరణతో పరిష్కారం చూపింది. దేశాల జాతీయ ఆర్థిక రాజకీయ విజయాలకు కారణభూతమైన సముద్రమార్గాలపై నియంత్రణ, కొత్త ప్రపంచాలు కనుక్కోవడం అవసరమైనప్పుడు, నౌకాయానంలో అనేకమార్పులు వచ్చాయి. ఆ నౌకాయానం సైన్స్ సాధించిన కొత్త విజయం.

16,17 శతాబ్దాలలో యూనివర్సిటీలు మరింతగా పెరిగాయి. ఖగోళం, గణితం, చట్టం, రాజకీయాలు లాంటి ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన సబ్జెక్టులు వచ్చాయి. వాటిని ఆదరించే పోషకులు కూడా పెరిగారు. వివిధ కోణాలనుంచి అధ్యయనాలను, సిద్ధాంత కల్పనలను యూనివర్సిటీలు ప్రోత్సహించాయి. దీంతో ఎక్కడెక్కడ నుంచో పండితులు ఆకర్షించ బడ్డారు. క్యాథలిక్ చర్చిని ప్రశ్నిస్తున్న ప్రొటెస్టెంట్ల మద్దతు కూడా దొరికింది. కొత్త విలువలు, వికాసాలకు కొత్త కులీనుల నుండి, వ్యాపారుల నుండి పారిశ్రామికవేత్తల నుండి పెద్ద మద్దతు లభించింది.

ఇప్పుడిక వాణిజ్యం యూరోపులో వేగంగా అభివృద్ధి కావడం ప్రారంభించింది. సముద్రయానం పకడ్బందీ వ్యవహారం కావడంతో వృత్తి గతంగా ప్రత్యేక సేవలు అందించాల్సిన వాళ్లు అవసరమయ్యారు. ఖగోళ శాస్త్రవేత్తలు మ్యాప్స్ తయారు చేసే వాళ్ళు ఓడ ఎలా పోవాల్సిందో లెక్కలేసే వాళ్లు అవసరమయ్యారు. ఆయుధాలు, లోహాలు, వస్త్రాలు, పత్తి, ఇతర సరుకుల తయారీ పెరిగి మార్కెట్లు విస్తృతమయ్యాయి.

వ్యాపార అవసరాలు, సముద్ర యాన అవసరాలు, కొత్త బూర్జువా వర్గ ఉత్పత్తి అవసరాలు వైజ్ఞానిక కృషి పై ఒత్తిడిని పెంచాయి. సైన్స్‌లో ఒక ఐక్యత అవసరమైంది. న్యూటన్ ఫిజిక్స్‌తోపాటు మ్యాథమెటిక్స్‌లోనూ, ఆస్ట్రానమీలోనూ, ఆప్టిక్స్‌లోనూ, యాంత్రిక శాస్త్రంలోనూ, కెమిస్ట్రీలోనూ పెద్ద కృషి చేశాడు. మైక్రోస్కోప్ కనుగొన్న హుక్, పై అన్నింటితో పాటు మానవ శరీర ధర్మ శాస్త్రంలో కూడా కృషి చేశాడు. శాస్త్రవేత్తల కృషిలో ఉన్న ఈ సారూప్యత వల్లనే 17వ శతాబ్దం సైన్స్ ఒక ఐక్య చిత్రాన్ని ఆవిష్కరించింది. 17వ శతాబ్దం చివరికంతా క్యాపిటలిస్టు ఉత్పత్తి ప్రవేశించింది. పట్టణ మధ్యతరగతి, ఫ్యూడల్ పరిమితులను ఛేదించుకుని లాభం కోసం ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. నౌకాయానం పెరగడంతో ఈ ఉత్పత్తికి ప్రపంచవ్యాప్త మార్కెట్లు ఏర్పడినాయి. ఖర్చులు తగ్గించుకొని లాభాలను, ఉత్పత్తిని పెంచే ఆవిష్కరణలు మరింత అవసరమయ్యాయి. చేతి ద్వారా ఉత్పత్తి చేయడం స్థానంలో యాంత్రిక ఉత్పత్తి ప్రవేశించింది. దీనితో ఆవిరి యంత్రం ఆవిష్కరణ అనివార్యమై పోయింది.

ఈ కాలంలో మైనింగ్, మెటల్ వర్క్స్, ట్రాన్స్ పోర్ట్, టెక్స్ టైల్స్ విస్తృత మయ్యాయి. వీటి నిర్వహణలో ఏర్పడిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కనుగొనాల్సి వచ్చింది. అయితే ఈ పరిష్కారాలు తెచ్చిన కొత్త చిక్కుల్ని ఎదుర్కోవడానికి కొత్త విజ్ఞానాన్ని ఆవిష్కరించడం అవసరమైంది. పనివారికి కూడా శాస్త్రం తెలియాల్సిన అవసరం వచ్చింది. ఉదాహరణకు గడియారాలు చేసే వాళ్ళు డైనమిక్స్‌ను తెలుసుకోవడం అవసరమైంది.

16, 17 శతాబ్దాలలో ప్రకృతి గురించి సమాచారం తెలుసుకోవడానికి టెలిస్కోప్, మైక్రోస్కోప్, థర్మా మీటరు, బారో మీటరు లాంటి పరికరాలు అవసరమైతే, 18 19 శతాబ్దాలలో ప్రకృతిలో జోక్యం చేసుకొని మార్పులు చేసే మెషిన్లు – స్టీమ్ ఇంజన్లు, టర్బైన్లు డైనమో, ఎలక్ట్రిక్ మోటార్, కెమికల్ ప్లాంట్లు రంగ ప్రవేశం చేశాయి. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి మానవజాతి చరిత్రలో పెద్ద విప్లవానికి కారణమైనాడు.

19 శతాబ్దం చివరికి వచ్చేసరికి ఎలెక్ట్రో మాగ్నెటిక్ థియరీ, మెడలీఫ్ మూలకాల పట్టిక వచ్చి, సైన్సుకు ఒక పరిపూర్ణత వచ్చిందా? అనిపించాయి.

17వ శతాబ్దంలో జ్ఞానం యొక్క పరిణామం జరిగితే, 18వ శతాబ్దంలో శక్తికి సంబంధించిన పరిణామం జరిగింది. 17వ శతాబ్దంలో ఉన్న మ్యాథమెటికల్ మెడికల్ ఖగోళ సైన్స్‌లు 18వ శతాబ్దం వచ్చేసరికి కెమికల్ థర్మల్ ఎలక్ట్రికల్ సైన్సులుగా రూపాంతరం చెందాయి.

### పారిశ్రామిక విప్లవం

నీరు, గాలిద్వారా నడిచే యంత్రాలు మొదటి పారిశ్రామిక విప్లవానికి కారణం. సరుకుల డిమాండ్‌కు, ఈ యంత్రాలు తట్టుకోలేకపోయాయి. ఇంగ్లాండులో, అధిక ఉత్పాదన చేసే, అధిక కండెలు ఉన్న స్పిన్నింగ్ యంత్రాలు కూడా సరి పోలేదు. ఆయుధాల తయారీ, ఓడల తయారీ కోసం అవసరమైన ఉక్కు డిమాండు పెరిగిపోయింది. ఇది బొగ్గు డిమాండ్ పెరగడానికి దారితీసింది. అధికాధికంగా గనుల నుంచి బొగ్గును వెలికితీయడం అనేక ఇతర కొత్త సమస్యలకు దారితీసింది. గనుల్లో పెద్ద ఎత్తున నీరు చేరడం అందులో ఒకటి. ఆ నీటిని వెంటవెంటనే త్వరత్వరగా తొలగిస్తే కానీ తవ్వకాలు ముందుకు పోవు. బొగ్గు లభించదు.

ఈ సమస్యను పరిష్కరించే క్రమంలోనే సమాజంలో పెనుమార్పులకు కారణమైన, పూర్తిస్థాయి ఆవిరి యంత్రం కనుక్కోబడింది.

అయితే అంతకు ముందు ఎన్నడూ జరగని పరిణామం జరిగింది. కొత్తగా ఆవిష్కరింపబడిన విజ్ఞాన సిద్ధాంతాలను, (జేమ్స్ వాట్ కొత్తగా కనుక్కున్న ఉష్ణ

సిద్ధాంతాలు, శూన్య స్థితి సిద్ధాంతాలను) అంతకుముందే ఉన్న యాంత్రిక నైపుణ్యాలతో అనుసంధానం చేయడం – ఇది. జేమ్స్ వాట్ ఒక మెకానిక్. అయితే సైదాంతిక జ్ఞానాన్ని ఒక యూనివర్సిటీలో పనిచేస్తూ సంపాదించాడు. అంతకుముందున్న యంత్రాల వల్ల ఉష్ణం ఎంతో నష్టపోయేది. అయితే ఆవిరితో నడిచే పిస్టన్ ఇంజన్లను కనుక్కోవడం ద్వారా జేమ్స్ వాట్ దీనిని అధిగమించాడు. విజయవంతమైన ఈ యంత్రాలను ఎందరో కొనుక్కున్నారు. అదేవిధంగా స్టీవెన్సన్ కూడా. అతడు ఒక మొదటి తరం చదువుకున్నవాడు. నైపుణ్యం ఉన్న మెకానిక్. ఖరీదైన ఇంజనీరింగ్ విద్యను ఎంతో కష్టపడి చదువుకున్నాడు. ఆయన కనుగొన్న ఆవిరి లోకోమోటివ్ దాదాపు ఒక శతాబ్దం పాటు ఏ మార్పులు అవసరం లేకుండా మనగలిగింది.

ఆవిరి యంత్రం ఎన్నో ఇతర ఆవిష్కరణలకు (వడకడం నేయడం) దారితీసింది. ముఖ్యంగా ఆవిరితో నడిచే నౌక రెండవ పారిశ్రామిక విప్లవానికి పునాదులు వేసింది. పెట్టుబడిదారీ విధానం ముందుకు పోవడానికి, వలసలు విస్తృతం కావడానికి దోహదం చేసింది.

ఈ పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం తెచ్చిన నూతన సామాజిక క్రమాలు సైన్సుకు, శాస్త్రవేత్తలకు (ఇంజనీర్లకు) ఒక సొంత అస్తిత్వాన్ని ఇచ్చింది. లౌకిక వ్యవహారాలకు ప్రాధాన్యతను ఇచ్చే విశ్వవిద్యాలయాలు, కొత్త వికాస ఉద్యమం ఇచ్చిన హేతువాదం, వైవిధ్య విలువలు ఇందుకు దోహదం చేశాయి. తర్వాత తర్వాత ఎన్నో శాస్త్ర ఆవిష్కరణలు జరిగాయి. విద్యుత్తు, విద్యుదయస్కాంత సిద్ధాంతాలు వచ్చాయి. విద్యుత్‌తో నడిచే బల్బులు జనరేటర్లు మోటర్లు కనుగొన్నారు. వీడియో టెలిగ్రాఫ్ లాంటి వైర్‌లెస్ కమ్యూనికేషన్లు వచ్చాయి. పరిణామ వాదం జన్యు సిద్ధాంతాలు, పెన్సిలిన్ ఎక్స్ రేలు, రేడియో ధార్మికత, ఇలాంటి ఎన్నో కనుగొన్నారు. ఇవన్నీ సైన్స్‌నే కాకుండా సమాజాన్ని కూడా వేగంగా మార్చివేశాయి. 20 శతాబ్దం మొదటికి వచ్చేసరికి మరో శాస్త్రీయ విప్లవం వచ్చేసింది.

వీటన్నింటితో పాటు నూతన వ్యవస్థాగత పోకడలు కూడా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీల పరిశోధనలను కార్పొరేషన్లు స్పాన్సర్ చేయడం ప్రారంభించాయి. అంతేకాకుండా తమ సొంత పరిశోధన సంస్థలను కూడా నెలకొల్పాయి. సంపదను, లాభాలను పోగు చేసుకోవడానికి శాస్త్రాన్ని వాడటం కొత్త విషయమేమీ కాదు. అయితే కార్పొరేట్లు పరిశోధనలు చేయించడం, అవి వడివడిగా పెరగడం వల్ల ఎవరో కొందరి ప్రత్యేక ప్రయోజనాలు కోసం పరిశోధనలు జరిగే పరిస్థితి ఏర్పడింది. కార్పొరేట్ల నుంచి పరిశోధనలకు నిధులు వచ్చేకొద్దీ విజ్ఞాన పరిశోధనలు కూడా వికృతమవుతున్నాయి. శాస్త్ర విజ్ఞానానికి ఉండే సాపేక్ష స్వాతంత్రతకు ఏమీ కాదనే హామీ లేకుండా పోతున్నది.

"వీటన్నింటితో పాటు నూతన వ్యవస్థాగత పోకడలు కూడా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీల పరిశోధనలను కార్పొరేషన్లు స్పాన్సర్ చేయడం ప్రారంభించాయి. అంతేకాక తమ సొంత పరిశోధన సంస్థలను కూడా నెలకొల్పాయి. సంపదను, లాభాలను పోగు చేసుకోవడానికి శాస్త్రాన్ని వాడ టం కొత్త విషయమేమీ కాదు. అయితే కార్పొరేట్లు పరిశోధనలు చేయించడం, అవి వడివడిగా పెరగడం వల్ల ఎవరో కొందరి ప్రత్యేక ప్రయోజనాలు కోసం పరిశోధనలు జరిగే పరిస్థితి ఏర్పడింది."

సైన్స్ అండ్ టెక్నాలజీని నడిపే మరొక వ్యవస్థ ఉంది. అది మిలటరీ. విజ్ఞానము, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలను యుద్ధాలలో వాడటం అనేది ఎప్పుడూ ఉండనే ఉంది. ఆదిమ ఆయుధాలనుంచి ఉక్కు ఖడ్గాలు తుపాకి మందు ఇతర మరణాయుధాల దాకా ఇది జరుగుతూనే ఉంది. ఆయుధ పరిశోధనల మీద పారిశ్రామిక శక్తి మీద ఆధారపడి మొదటి ప్రపంచ యుద్ధం, ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం జరిగిందనవచ్చు. ఈ ధోరణి మరింత పెరిగింది. దేశాలు శత్రువులను ఓడించడానికి పరిశోధనల్ని, ఆయుధాల శక్తిని పెంచుకుంటూ పోయాయి. రాడార్లు, అల్ట్రాసౌండ్, రాకెట్లు, కంప్యూటర్లు – ఇవన్నీ కూడా రెండవ ప్రపంచ యుద్ధం ఫలితాలే. ఏ సమస్య వచ్చినా రాజకీయ సైనిక వ్యవస్థలు పరిష్కారం కోసం శాస్త్ర సాంకేతిక నిపుణుల వైపే చూశాయి. శత్రువులకు దీటైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలపై దృష్టి కేంద్రీకరించాయి.

### సైన్స్ అండ్ టెక్నాలజీకి కొత్త సమస్యలు.. సైన్స్ సర్వస్వమా?

ఈ పరిణామాలన్నీ సైన్స్‌కు ఒక గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చాయి. సైన్స్ వద్ద అన్ని సమస్యలకు పరిష్కారాలు ఉంటాయనే ధోరణి పెరిగింది. సైన్సు దగ్గర అన్ని జవాబులు ఉంటాయనీ, ఎప్పుడూ మంచి ఫలితాలే వస్తాయని అనుకున్నారు. ఇది యూరోపియన్ పాజిటివిస్ట్ ధోరణుల వల్ల ఏర్పడిన భ్రమ. ఈ భ్రమల్ని శాస్త్రవేత్తలే ప్రోత్సహించారు. వారి ప్రాచుర్యానికి, గొప్పదనానికి ఇది తోడ్పడుతుందనుకొని ఉండొచ్చు. అయితే యుద్ధం ముగింపుకొచ్చేసరికి సమాజంలోనే కాకుండా సైన్స్‌లో కూడా ఈ భావనలు తగ్గుముఖం పట్టాయి. అమెరికా, హిరోషిమా నాగసాకి మీద వేసిన ఆటంబాంబు ఇందుకు ఒక కారణం. అమెరికా బాంబులు వేయటాన్ని, హైడ్రోజన్ బాంబులను తయారు చేయడాన్ని పై శాస్త్రవేత్తలు ప్రశ్నించారు. అమెరికా న్యూక్లియర్ ఎస్టాబ్లిష్మెంట్‌కు చెందిన ఓపెన్ హైమర్, లియో జిలార్డ్ లాంటి శాస్త్రవేత్తలే ప్రశ్నించారు. అనేక సంభావ్యతలకు, స్థితులకు అవకాశం ఇచ్చే క్వాంటం సిద్ధాంతం, (దేవుడు జూదగాడు కాదు అని ఐన్ స్టీన్ అన్నా) కూడా ప్రభావం చూపి, అనేక సమాధానాలకు ఆస్కారం ఇచ్చింది. న్యూక్లియర్ ఆయుధాలు, అనేక నైతిక ప్రశ్నలకు దారితీసాయి. పరిశోధనలు ఏ మార్గంలో జరుగుతున్నాయనే విషయంలో శాస్త్రవేత్తలు తమ్ము తాము శోధించుకోవాల్సి వచ్చింది. జన్యు పరిశోధనలు నానో టెక్నాలజీ లాంటివి భవిష్యత్తులో ఏ ఫలితాలను ఇస్తాయో చెప్పలేమని శాస్త్రవేత్తలే అంటున్నారు. ముందు జాగ్రత్తగా, ఒక స్పష్టత వచ్చేదాకా, అటువంటి పరిశోధనలను నిలిపివేయాలని కూడా అంటున్నారు. ప్రభుత్వాలు, కార్పొరేట్లు పారదర్శకతను పాటించకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిస్తున్నది. న్యూక్లియర్ ఆయుధాలతో మానవజాతిని ఎప్పుడైనా సర్వనాశనం చేయవచ్చనే భయాలు ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక ఫలితాలు ప్రజలందరికీ అందుబాటులో లేకపోవడం ఒకటైతే, ఆ ఫలితాలలో సమాజానికి మంచి చేయనివి కూడా ఉన్నాయనేది మరొక అంశం..

పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం నుండే క్లైమేట్‌చేంజ్ సమస్య ఏర్పడింది. బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అంతరిక్ష పరిశోధనలు లాంటివి పెట్టుబడిదారీ

(మిగతా 16వ పేజీలో)

**మీడియా**

# స్వామిభక్తి మార్గం పట్టిన స్వతంత్ర్య మీడియా



రచయిత స్వతంత్ర జర్నలిస్టు, కాలమిస్టు. అభివృద్ధి, పర్యావరణం, లింగ వివక్ష తదితర అంశాలపై విస్తృతంగా రాస్తున్నారు.

కల్పా శర్మ

"దేశంలోని బడా మీడియా ఒకప్పటి తన పోరాట పటిమకూ, పరిశోధనాత్మక జర్నలిజానికీ స్వస్తి చెప్పి ప్రయత్నపూర్వకంగా తనను తాను ప్రభుభక్తి పరాయణురాలిగా, ప్రభుత్వానికి ఊడిగం చేసేదానికి మలుచు కుంటూ ఈక్రమంలో విశ్వసనీయతను, జర్నలిజం పట్ల ఉండే గౌరవాన్ని మంట కలుపుతున్నది."

దేశప్రధానికే ముడుపులు ముట్టిన కుంభకోణాన్ని నాడు భారతీయ మీడియా బట్టబయలు చేసింది. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఆయన ప్రాతినిధ్యం వహించే పార్టీ ఓటమి పాలయ్యింది. ఇది జరిగి నిండా 40 ఏళ్ళు గడవకముందే దేశంలోనే అత్యంత శక్తివంతమైన, సంప ద్వంతమైన వ్యాపారవేత్త, ప్రధాని అనుంగు మిత్రుడు కాంట్రాక్టులు దక్కించు కోవడం కోసం లంచాలు ఇచ్చాడని అమెరికన్ కోర్టులో అభియోగాలు నమోదు అయితే మీడియాలో ఆ వార్త కోసం వెతుక్కోవాల్సి వచ్చింది. గత నాలుగు దశాబ్దాలలో భారత మీడియాలో వచ్చిన గుణాత్మక మార్పుకు ఇది తార్కాణంగా నిలుస్తుంది.

ఒకప్పుడు పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన మీడియా ఆ తర్వాత వాణిజ్యమయంగా మారిపోయి కాకి గోల స్థాయి దిగజారి అక్కడ నుండి మరింత వేగంగా అధికారంతో కుమ్మక్కు అయ్యే దుస్థితిలోకి జారిపోయింది. మీడియా దిశ, కంటెంట్ రెండూ నాటకీయ మార్పులకు లోనయ్యాయి.

1980వ దశకంలో మీడియా అంటే ప్రధానంగా వార్తాపత్రికలే. అప్పట్లో 'ప్రెస్' అనేవారు. మీడియా అంటే దూరదర్శన్ ఆల్ ఇండియా రేడియోలు ఉండేవి గానీ రెండూ ప్రభుత్వ ప్రాయోజితాలే.

ఇవాళ 'మీడియా' అంటే విస్తృతార్థం ఏర్పడింది. పత్రికా ప్రచురణ, టీవీ ప్రసారా లతో పాటుగా, డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలు రంగప్రవేశం చేసి మీడియా ఘన వారసత్వానికి ప్రమాదకరంగా పరిణమిం చాయి. 'అబ్జర్వర్' పత్రికలో కరోల్ కాడ్‌వాల్టార్ రాసినట్లుగా 'సామాజిక మాధ్యమాలే ఇవాళా రేపూ ప్రధాన స్రవంతి మాధ్యమంగా మారా యి. ప్రపంచంలో మెజార్టీ ప్రజానీకం సామా జిక మాధ్యమాల ద్వారానే వార్తలు తెలుసు కుంటున్నారు'

అంటే ఇవాళ్టి మీడియా విస్తృతి, అవ కాశాలతో పోలిస్తే గతంలో మీడియా ఇప్పటికన్నా స్వతంత్రంగా పనిచేసిందా?

అయి ఉండకపోవచ్చు. గతంలో ప్రింట్ మీడియాలో ఎక్కువలో ఎక్కువ వార్తాపత్రికలు ప్రైవేటు యాజమాన్యంలోనే ఉన్నాయి. పారిశ్రామిక వేత్తలు తమతమ వ్యాపార ప్రయోజనాల రీత్యా ఈ పత్రికలు నడిపారు. వార్తాపత్రికలు నడపడం లాభసాటి కాదని తెల్సి కూడా తమ చేతిలో ఒక పేపరు ఉంటే రాజకీయంగా పలుకుబడి ఉంటుందని విశ్వసించేవారు. అయితే ఆ పలుకుబడికి పరిమితులు ఉండేవి. ప్రభుత్వం మీద వాళ్ళ పత్రికలలో పెద్దగా విమర్శలు రానీయకుండా అధికారపక్షం ఒత్తిడులు తీసుకురావడమూ ఉండేది.

ఎన్ని ఒత్తిడులు ఉన్నా 1980వ దశకం లో వార్తాపత్రికా రంగం ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వ తప్పొప్పులను విమర్శించేది. 1975లో ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి ప్రెస్‌సెన్సార్‌షిప్‌కు పూనుకోవడం పత్రికా రంగాన్ని పెద్ద 'షాక్'కు గురిచేసింది. అప్పటి వరకు నిద్రాణంగా ఉన్న పత్రికా రంగానికి ఇది ఒక మేల్కొలుపు వంటిది. 'పత్రికా స్వేచ్ఛ'ను ఆషామాషీగా తీసుకోకూడదని గుర్తించింది. దాంతో పత్రికలు సమాజంలో అన్ని పార్శ్వాలనూ తడమడం మొదలు పెట్టింది. వరకట్న మరణాలు, కట్టు బానిస పనివిధానం, మహిళల అక్రమరవాణా, పోలీసు అకృత్యాలు, ఎన్‌కౌంటర్‌ల పేరిట పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని హత్యలకు పాల్పడడం, లాకప్ మరణాలు ఇలా అనేకానేక అంశాల మీద పరిశోధనాత్మక వార్తా కథనాలు, ప్రత్యేక కథనాలు వెలుగులోకి తీసుకువచ్చాయి. నలభై ఏళ్ళ క్రితం జరిగిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఉదంతం మీద పత్రికలు వరుస కథనాలు ప్రచురించాయి. ప్రభుత్వాన్ని ముద్దాయిగా నిలబెట్టాయి.

ఆ దశాబ్దంలోనే పౌరసమాజంలో మహిళా హక్కుల కోసం ఆందోళనలు, ఉద్యమా లు విస్తృతంగా నడిచాయి. మహిళా ఉద్యమం లేవనెత్తిన ఆందోళనకర అంశాల మీద పత్రిక లు సంపాదకీయాలు, వ్యాసాలు, చర్చలు, పరిశోధనాత్మక కథనాలు వెలువరించాయి. భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత సమాజంలో పర్యావరణ స్పృహ కూడా పెరిగింది. పారిశ్రా మిక కాలుష్యం మూలంగా ప్రజానీకం ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఎదుర్కొంటున్న తాగునీరు, ఆరోగ్యం వంటి సమస్యలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, నర్మ దానది మీద నిర్మిస్తున్న సర్దార్ సరోవర్ వంటి భారీ డ్యామ్‌ల కారణంగా విస్థాపనకు గుర యిన ప్రజల ఇక్కట్లు, అణువిద్యుత్ కేంద్రాలు నెలకొల్పడం మూలంగా ప్రజలకు ఎదురయ్యే కష్టాలు. ఇలా అనేక అంశాల మీద పత్రికలు ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషిచేసాయి.

1987లో 'హిందూ' దినపత్రిక బోఫోర్స్

కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. బోఫోర్స్ శతఘ్నులు కొనడానికి భారత ప్రభుత్వం నుండి ఆర్డర్లు పొందడానికి స్వీడన్ ఆయుధ తయారీ కంపెనీ మధ్యవర్తులకు కమీషన్‌లు ముట్టచెప్పింది అన్న సాధికార కథనాన్ని ప్రచురించింది. అప్పట్లో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నాడు.

(1984లో ఇందిరాగంధీ హత్యానంతరం కాంగ్రెస్ పార్టీ లోకసభలో 400 పైగా సీట్లు గెలుచుకుని అధికారం చేపట్టింది). దేశ అత్యున్నత స్థానంలో ఉన్నవారికి ఈ ముడుపులు అందాయన్న పరిశోధనాత్మక కథనాలు వెలువడ్డాయి. పత్రికలు ఈ కుంభకోణాన్ని వెలుగులోకి తీసుకురావడం, ప్రతిపక్షాలు 1989 సార్వత్రిక ఎన్నికలలో ప్రభుత్వం అవినీతిని ప్రధాన ప్రచార అస్త్రంగా చేసుకోవడంతో ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటమి చవిచూసింది.

అదే నాలుగు దశాబ్దాల తర్వాత కొద్ది వారాల క్రితం గౌతమ్ అదానీ కంపెనీలు హరిత ఇంధన ప్రాజెక్టు కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచాలు ఇచ్చాయని అమెరికా కోర్టులో అభియోగాలు నమోదు అయితే వేళ్ళ మీద లెక్కించదగిన పత్రికా, ప్రసార మాధ్యమాలు మినహా మీడియా మొత్తం మిన్నకుండి పోయింది. కొన్ని పత్రికలు అయితే ఆరోపణల కన్నా ఆదానీ కంపెనీలు ఈ ఆరోపణలు తిరస్కరిస్తూ ఇచ్చిన పత్రికా ప్రకటనలకు ఎక్కువచోటు కల్పించాయి. అయితే ఈ అంశం మీద తాజా పరిణామాలు అందించడంలోగానీ, వాస్తవాలను వెలికి తియ్యడానికి గానీ ప్రధాన స్రవంతి మీడియా ఏమాత్రం పూనుకోలేదు. దేశప్రధానికి సన్నిహిత మిత్రుడిగా మెలిగే ఈ వ్యాపారవేత్త అతి కొద్దికాలంలో గాలిపాటున ప్రపంచ కుబేరులలో ఒకటిగా ఎలా ఎదిగాడు, తాజాగా అతని కంపెనీల మీద వచ్చిన ఆరోపణలలో నిజనిజాలు ఏమిటి అని వెలికి తియ్యడానికి ప్రధాన స్రవంతి మీడియా ఏమాత్రం ప్రయత్నించలేదు.

పోరాటతత్వం, ప్రశ్నించే వైఖరికి మారు పేరుగా ఉన్న మన మీడియా ఎప్పుడు, ఎలా, ఎందుకు ఇలా తయారయ్యింది?

1990లలో పి.వి. నరసింహారావు ప్రధానిగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సంస్కరణల పేరిట దేశంలో ప్రైవేటు పెట్టుబడుల ప్రవేశానికి పూర్తిగా గేట్లు ఎత్తివెయ్యడంతో మొదలుగా మీడియాలో పైన పేర్కొన్న ధోరణులు కూడా మొదలయ్యాయని మీడియా విశ్లేషకులు చెబుతుంటారు.

> “ గౌతమ్ అదానీ కంపెనీలు హరిత ఇంధన ప్రాజెక్టు కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచాలు ఇచ్చాయని అమెరికా కోర్టులో అభియోగాలు నమోదు అయితే వేళ్ళ మీద లెక్కించదగిన పత్రికా, ప్రసార మాధ్యమాలు మినహా మీడియా మొత్తం మిన్నకుండి పోయింది. కొన్ని పత్రికలు అయితే ఆరోపణల కన్నా ఆదానీ కంపెనీలు ఈ ఆరోపణలు తిరస్కరిస్తూ ఇచ్చిన పత్రికా ప్రకటనలకు ఎక్కువచోటు కల్పించాయి. ”

90వ దశకం నాటి సంస్కరణలు మీడియా మీద దీర్ఘకాలిక ప్రత్యక్ష ప్రభావం కలిగించాయి. అప్పటివరకూ ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న ప్రింట్ మీడియాను లాభార్జన చేసే సంస్థలుగా యజమానులు భావించలేదు. మొదటిసారిగా మీడియా ద్వారా సొమ్ము చేసుకోవచ్చునే స్పృహ కలిగింది. దానితో దేశంలోని బడా వార్తా పత్రికల గ్రూపు సంస్థలు ఆ బాట పట్టాయి. నికొలస్ కూల్‌రిడ్జ్ మన దేశంలోని మూడు ప్రధాన వార్తాపత్రికల గ్రూప్ సంస్థల యజమానులయిన సమీర్ జైన్ (ద టైమ్స్ గ్రూప్), రామనాధ్ గోయంకా (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ సంస్థలు), అవీక్ సర్కార్ (ఎబిపి గ్రూప్) లతో చేసిన ఇంటర్వ్యూలను ‘పేపర్ టైగర్స్, ద లేటెస్ట్ గ్రేటెస్ట్ న్యూస్ పేపర్ టైకూన్స్’ (బర్చ్ లేన్ ప్రెస్ 1994) అన్న పుస్తకంలో పొందుపరిచాడు.

సమీర్‌జైన్ ఆ రచయితతో ఏమంటాడంటే – “నాణ్యత ఒక్కటే సరిపోదు. పత్రిక తీసుకు రావడం అంటే ద్వంద్వ యుద్ధానికి తలపడడం లాంటిది. నువ్ మార్కెట్‌లో అగ్రగామివి అయినా కాకపోయినా నువ్ ఉగ్రంగా ఈ ద్వంద్వ యుద్ధంలోకి దిగాల్సిందే. వాళ్ళు – వాణిజ్య ప్రకటనలు ఇచ్చే సంస్థలు – ఈ ద్వంద్వయుద్ధంలో నువ్వు ఓ కన్ను పోగొట్టుకున్నావా, ఓ చెయ్యి కోల్పోయావా, ఒక ఎడిటర్‌ని వదులుకున్నావా, ఒక కాలమిస్టును గెలుచుకున్నావా అని చూసి ఆనందిస్తుంటారు. నువ్ నీ పేపరు ఎంత నాణ్యంగా అయినా తీసుకురా అయినా నువ్వీ యుద్ధంలో నిలవాల్సిందే, వాణిజ్య ప్రకటనల రూపేణా నువ్ ఇంకా ఇంకా సంపాదించాల్సిందే. వాళ్ళు ఇచ్చే రేటింగ్‌లే ఇవాళ ప్రమాణాలుగా మారాయి. దానికి తోడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఈ ఆదాయాన్ని మనం ఎంత ఎక్కువగా చేజిక్కించుకుంటే మన పోటీదారులకు అంత అడుగుబొడుగూ దక్కేట్లు చెయ్యచ్చు” (పేజీ 241-242)

వార్తా పత్రిక అంటే ఒక సరుకు అన్న అభిప్రాయం స్థిరపడిపోయాక అది మార్కెట్‌లో ఉధృతంగా అమ్ముడు పోవాలంటే అందులో విషయం ఏమి ఉండాలనేది మార్కెట్ నిర్ణయిస్తుంది. అందులో భాగంగానే పేదరికం, మానవహక్కుల ఉల్లంఘన, అణిచివేత, పీడనల వంటి అంశాల మీద వార్తాకథనాలు పత్రికల నుండి శాశ్వతంగా శలవు తీసుకు న్నాయి. ఆ స్థానంలోకి సెలబ్రిటీలు, వాళ్ళ జీవన శైలులకి సంబంధించిన కథనాలు, సంచలనాలు అడుగు పెట్టాయి. ఇదే కాలంలో ఉపగ్రహప్రసారాలు అందుబాటులోకి రావడంతో ప్రైవేటు టీవీ ఛానళ్ళు తామర తంపరగా వెలిసాయి స్థిరంగా ఉన్న వాణిజ్య ప్రకటనల ఆదాయం నుండి ఎవరి వాటా వాళ్ళు దక్కించుకోవడానికి ఒకదానితో మరొకటి తీవ్రమైన పోటీకి కలబడ్డాయి. ఈ ద్వంద్వ యుద్ధాలు, పెనుగులాటలలో వార్తా ప్రసారాల ఛానళ్ళు కూడా వినోద ప్రధాన సాధనాలుగా మారి మరింత వాణిజ్య ప్రకటనల ఆదాయం గడించడానికి వీలుండే సమాచార ప్రసారాల వైపుకు మొగ్గాయి. అందులో భాగంగానే ధ్వని ప్రధానంగా మొదలయిన చర్చా గోష్ఠులు ఇవాళ అరుపులు కేకల స్థాయికి ఎదిగాయి.

టీవి మాధ్యమం విస్తృతి చాలా ఎక్కువ. ప్రస్తుతం డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలు కూడా ఆస్థాయికి చేరుతున్నాయి. ఇవాళ దేశంలో 900 ప్రైవేటు టీవీ ఛానళ్ళు ఉన్నాయి. ప్రభుత్వ హయాంలో ఉన్న దూరదర్శన్ దీనికి అదనం. అలాగే 20 భాషలలో ప్రచురితం అవుతున్న వార్తా పత్రికల సంఖ్య అక్షరాలా 1,40,000. అయినప్పటికీ 70 శాతం మంది వార్తల కోసం ‘ఆన్‌లైన్’ మీదనే ఆధారపడుతున్నారని తాజా సర్వే నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2022 జూలై నాటికి 59 శాతం మంది ప్రజానీకం అంటే 83.3 కోట్ల మంది ప్రజలకు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నట్లు లెక్క తేలింది.

> **❝ ప్రభుత్వ పనివిధానాన్ని విమర్శనాత్మకం గా, పరిశోధనాత్మకంగా ఎండగట్టేందుకు కృషి చేసిన జర్నలిస్టుల మీద ప్రత్యక్షం గా వేధింపు లకు దిగడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మరో ప్రమాదకరమైన పోకడ. ఈ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది జర్నలిస్టులు అరెస్టులకు గురయి జైళ్ళ పాలయ్యారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన నేపథ్యం లో కాశ్మీర్‌లోని జర్నలిస్టు లను పోలీసులు విచారించి, వేధించి, బెదిరించి, జైళ్ళ పాల్జే సారు. ❞**

1990వ దశకంలో మొదలయిన ఉదారవాద విధానాల పర్యవసానంగా మీడియా రంగం కేంద్రీకృతం (కన్సాలిడేషన్) కావడం పెరిగింది. భారతదేశంలో మీడియా సంకర యాజమాన్యాన్ని నిరోధించే చట్టం ఏదీలేదు. దాంతో ఓ గుప్పెడు మీడియా సంస్థలే వార్తా పత్రికలు, టీవీ ఛానళ్ళు, డిజిటల్ ఛానళ్ళలో గుత్తాధిపత్యం నెలకొల్పుకున్నాయి.

ఇవాళ మనం ఏం చదవాలి, ఏం చూడాలి అనేది ఈ గుత్తాధిపత్య సంస్థలే నిర్ణయిస్తున్నాయి. ఈ కొద్దిపాటి సంస్థలను ప్రభుత్వం నయానో, భయానో తన దారికి తెచ్చుకుంటే మీడియామీద పట్టు సాధించేసినట్లే. ప్రస్థుతం మనదేశంలో ఉన్న ఈ గుత్తాధిపత్య మీడియా సంస్థలు అన్నీ ఆ రకంగా ప్రభుత్వం దారికి వచ్చేసాయి. సర్కారుతో షరీకయిపోయయి.

పదేళ్ళ క్రిందట మోడీ నాయకత్వంలో భాజపా కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి మీడియా వ్యవహారశైలి మొత్తం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. 2013లో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఏర్పడిన యుపిఎ ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా అన్నాహజారే తదితరులు చేపట్టిన ఉద్యమం గురించి ఊరూవాడా మోతెక్కిపోయేలా ప్రచారం చేసిన మీడియా ఇదేనా అని అనుమానం వచ్చేంతగా మారిపోయింది.

మోడీ ప్రభుత్వం అధికారికంగా ప్రెస్ సెన్సార్‌షిప్ విధించలేదు. చూస్తుంటే మీడియా తనే స్వయంగా ఇష్టపూర్వకంగా సెన్సార్‌షిప్ విధించుకున్నట్లు కనబడుతుంది. మోడీ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను హరించి వేయడానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ చేసిన ప్రయత్నాల్లోని చమత్కారం అలాంటిదిమరి.

గత పదేళ్ళలో ప్రధాని హోదాలో మోడీ ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించకపోవడం పట్ల ఈ ప్రభుత్వం ఏమాత్రం సిగ్గుపడడం లేదు. టెలివిజన్‌లో ప్రసారమయ్యే మోడీ ఇంటర్వ్యూలు అన్నీ ఎంపిక చేసిన జర్నలిస్టులతో ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం జరిగినవే అని చూసేవారికి ఎవరికైనా ఇట్టే అర్థమై పోతుంది. భాజపా ఎదురులేని శక్తి అని ప్రజలను నమ్మించడానికి ఒక 'ఇమేజ్' ను సృష్టించుకునే రాజకీయ ఎత్తుగడకి మీడియా ఇష్టపూర్వకంగా స్నేహహస్తం అందించింది.

ప్రభుత్వ పనివిధానాన్ని విమర్శనాత్మకంగా, పరిశోధనాత్మకంగా ఎండగట్టేందుకు కృషి చేసిన జర్నలిస్టుల మీద ప్రత్యక్షంగా వేధింపులకు దిగడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న మరో ప్రమాదకరమైన పోకడ. ఈ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది జర్నలిస్టులు అరెస్టులకు గురయి జైళ్ళ పాలయ్యారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన నేపథ్యంలో కాశ్మీర్‌లోని జర్నలిస్టులను పోలీసులు విచారించి, వేధించి, బెదిరించి, జైళ్ళ పాల్జేసారు. ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, హర్యానా, బీహార్, కేరళ, తెలంగాణా రాష్ట్రాలలోకూడా జర్నలిస్టులకు ఇవే చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా భాజపా పాలిత రాష్ట్రాల్లోని చిన్న పత్రికలను తమ దారికి తెచ్చుకోవడానికి అప్పటి వరకూ ఆయా పత్రికలకు ఇచ్చే వాణిజ్య ప్రకటనలు నిలిపివేసి నిధులలేమితో కునారిల్లేలా చేసారు. తద్వారా ప్రభుత్వం మీడియాకు స్పష్టమైన హెచ్చరిక పంపింది – మామీద పల్లెత్తు విమర్శ చేయకూడదు అనేదే ఆ హెచ్చరిక సారాంశం.

ఈ వ్యూహం ఫలించింది. బడా మీడియా దానంతట అదే దారికి వచ్చేసింది. ప్రత్యేకించి టీవీ మాధ్యమం అయితే విధేయంగా వొంగమని అడిగితే ఏకంగా సాష్టాంగపడిపోయింది. ఒకప్పుడు మీడియా మధ్యన ఎవరు ప్రజాప్రయోజన సంచలనాత్మక కథనాలు ఎక్కువ ప్రసారం చేస్తారన్న పోటీ ఉండేది. ఇప్పుడు ఆ పోటీ ప్రభుత్వానికి ఎవరు, ఎంత విధేయంగా ఉంటారనే అంశానికి మారింది. అధికారాన్ని నిలదియ్యడానికి బదులు ప్రతిపక్షాలను నిందించడం రివాజుగా మారింది. సామాన్య ప్రజానీకం పౌరహక్కులను ఎత్తిపట్టాల్సిన మీడియా ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి అధికార పార్టీ చేసే మైనార్టీ వ్యతిరేక ప్రచారాన్ని ఎగదోసే సాధనంగా మారిపోయింది. ప్రభుత్వ అజెండాకు పక్కవాయిద్యగాడిగా తయారయ్యింది. పేరుకే ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న టీవీలు అన్నమాటేగానీ అవిప్పుడు గంపగుత్తగా అధికార పార్టీ హస్తగతం అయిపోయాయి.

వార్తాపత్రికలలో మాత్రం ఇంకా విమర్శనాత్మక గొంతుకలు మిగిలే ఉన్నాయి. అవి కూడా మరోపక్కన ప్రధాని మోడీని ఆకాశానికి ఎత్తేసే ప్రచారాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ కొద్దిమేర అయినా విమర్శకు చోటిస్తున్నాయి. వార్తా పత్రికలకు కొన్ని దశాబ్దాలుగా ప్రతిష్ఠాత్మకంగా కొనసాగిన పరిశోధనాత్మక కథనాలు అయితే గతకాలపు ఘనకీర్తిగా మిగిలి పోయింది.

దేశంలో డిజిటల్, సోషల్ మీడియా సహా మొత్తంగా మీడియా అనూహ్యంగా విస్తరించింది కాబట్టి పత్రికాస్వేచ్ఛ కూడా పరిఢవిల్లుతుంది అని భావించిన వారికి నిరాశే ఎదురయ్యింది. స్వతంత్ర మీడియా భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారయ్యింది.


సామాజిక అంశాలమీద పరిశోధనాత్మక కథనాలు ఈనాడు ఎక్కువగా స్వతంత్ర డిజిటల్ మీడియాలో రావడం గమనించవచ్చు. అయితే ఈ మీడియా నిర్వహణకు అయ్యే ఆర్థికభారాన్ని తట్టుకోవడం అంత తేలిక కాదు. ఇవి వాణిజ్య ప్రకటన అదాయం మీద అధారపడలేవు. అలాగే బయటివ్యక్తుల నుండి తీసుకునే ఆర్థికసాయానికీ పరిమితులు ఉంటాయి. కేవలం పాఠకులు, వీక్షకులు అందించే ఆర్థిక తోడ్పాటు మీద ఆధారపడి వీటి మనుగడ కొనసాగుతున్నది. 'స్వతంత్ర జర్నలిజానికి' ఇంకా చోటు మిగిలే ఉందని మనకు దీన్ని బట్టి అర్థమవుతున్నది. అలాగే మీడియాకు ప్రజలకు మధ్య ఉండాల్సిన సజీవ సంబంధాలనూ ఈ కొద్దిపాటి సంస్థలే నిలబెడుతున్నాయి. మెజార్టీ మీడియా సంస్థలు ప్రజల నుండి పూర్తిగా వేరుపడిపోయాయి.

డిజిటల్, సోషల్ మీడియా విస్తృతి పెరగడం రెండంచుల పదును గల కత్తివంటిదే. ఇవే మాధ్యమాలను ఉపయోగపెట్టుకుని తప్పుడు వార్తలు, విద్వేష ప్రచారాలకు పాల్పడుతూ హింసను ప్రేరేపించే చీకటి శక్తులకూ కొదవలేకుండా ఉన్నది.

ప్రధాన స్రవంతి మీడియా ఇవాళ

(మిగతా 34వ పేజీలో)

# విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న కేంద్ర ప్రభుత్వం


రచయిత ఎన్‌సిఆర్‌టి మాజీ డైరెక్టర్

ప్రొ॥ కృష్ణ కుమార్

గత నాలుగు దశాబ్దాల నుండి విద్యా విధానం ఎగుడుదిగుడు మార్గంలో సాగుతున్నది. విద్యారంగంలో ప్రభుత్వ పాత్రను గురించిన భావాలలో తీవ్రమైన మార్పులు రావటం, స్థానిక వైరుధ్యాలు దీనిలో ముఖ్యాంశాలుగా ఉన్నాయి. స్వాతంత్ర్యా నంతరం రూపుదిద్దుకున్న దీర్ఘకాలిక దృక్పథం ప్రాతిపదికగా పరిశీలించినపుడు ప్రస్తుత పరిస్థితులు ఏ మాత్రం ఉత్సాహం కలిగించేవిగా లేవు.

విద్యారంగ భవిష్యత్‌ను నిర్ణయించటానికి తీసుకున్న ప్రధాన చర్యలు, 1980 దశాబ్దం మధ్యకాలంలో జరిగిన నాటకీయమైన పరిణామాలు దీనికి పునాదిగా ఉన్నాయి. ప్రధానమంత్రిగా రాజీవ్‌గాంధి చేసిన మొదటి ప్రసంగంలోని నూతన ఆలోచనలలో దీనికి పునాదులు ఉన్నాయి. తర్వాతి కాలంలో జాతీయ విద్యా విధానంలో వాటికి చోటు కల్పించారు. ప్రతి జిల్లాలోనూ అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఒక పాఠశాలను ఏర్పాటు చేయాలనేది వాటిలో ఒకటి. 1986లో జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించిన తర్వాత, కొత్త పాఠశాలలకు జవహర్ నవోదయ విద్యాలయాలని పేరు పెట్టి, 11 సంవత్సరాల వయసున్న వారు అందరూ సమానంగా పోటీలో పాల్గొనటానికి అవకాశం కల్పించారు. గ్రామీణప్రాంతంలోని సంపన్నుల కోసం రూపొందించిన కార్యక్రమం ఇదని కొందరు విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ పాఠశాలలను తమ రాష్ట్రాలలో ఏర్పాటు చేయటానికి తమిళనాడు, పశ్చిమబెంగాల్ అంగీకరించలేదు. రాష్ట్రాల హక్కుగా ఉన్న అంశాలలోకి కేంద్రం చొరబాటుగా దీనిని వారు భావించారు. ఈ విధమైన సందేహాలు రావటం కొత్తకాదు. అంతకు ఒక దశాబ్దం ముందు అత్యవసర పరిస్థితి కాలంలో, అప్పటి వరకు రాష్ట్రాల జాబితాలో ఉన్న విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలోకి మారుస్తూ రాజ్యాంగానికి సవరణ చేశారు. 1980 దశాబ్దంలోనే ఉమ్మడిగా జోక్యం చేసుకోవటం ప్రారంభమైంది. కాని ఈ జోక్యం చాలా తక్కువ స్థాయిలో ఉండటంతో ఈ క్రమం ఎక్కడికి దారి తీస్తుందనేది ఎవరూ ఊహించలేక పోయారు.

ఉమ్మడిగా చర్యలు తీసుకోవటానికి అవసరమైన కొన్ని సూచనలను 1986లో తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానంలో పొందుపర్చారు. సెంట్రల్ అడ్వైజరి బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లాంటి దీర్ఘకాలం నుండి పనిచేస్తున్న సంస్థలు కొనసాగుతున్నప్పటికీ, నేషనల్ కర్రిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్–ఎన్‌సిఎఫ్–ను ఏర్పాటు చేశారు. సంస్కరణలు, పాఠ్యాంశాలపై తలెత్తే వివాదాలపై ఏకాభిప్రాయం సాధించటం కోసం దానిని ఉద్దేశించారు. కొంతకాలం ఇది అవసరమైనదేనని అనిపించింది. కాని గతంలో కొన్ని అంశాలపై సాధించిన ఏకాభిప్రాయం ఇప్పుడు, 21వ శతాబ్దంలోని మూడవ దశాబ్దం మధ్యలో విచ్ఛిన్నమైపోతున్నది. ప్రాంతీయ అకాంక్షలపై కేంద్రీకరణ ఒకవైపు, మరోవైపున అన్నింటినీ తన అదుపులోకి తీసుకోవాలని కేంద్రం చేస్తున్న ప్రయత్నాల వలన వ్యవస్థ మధ్యేమార్గంలో సాగటానికి తంటాలు పడుతున్నది.

**పరిమితమైన అవకాశాలు**

1980 దశాబ్దం మధ్యకాలం నుండి ఇప్పటి వరకు సాగిన ప్రయాణం సరళంగా, సూటిగా సాగలేదు. నయా–ఉదారవాద ఆర్థిక సిద్ధాంతం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం వివిధ రూపాలను తీసుకున్నది. తన లక్ష్యాలలో కొన్నింటిని కొంతమేరకు సాధించింది. 2004లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో అనుకోకుండా యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ విజయం సాధించటంతో ప్రతిఘటనకు అవకాశాలు పెరిగాయి.

మొదటి దశలో గతంలో నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ) పాలనలో పొగొట్టుకున్న నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ –ఎన్‌సిఇఆర్‌టి–లాంటి సంస్థలను, పాఠ్యాంశాలు, పాఠ్య పుస్తకాల విషయంలో కోల్పోయిన అధికారాన్ని తిరిగి సాధించటంలో ఈ ప్రభుత్వం సఫలమైంది. కొత్త ఎన్‌సిఎఫ్‌ను రూపొందించింది. దానితో పాటు సిలబస్, పాఠ్య పుస్తకాలను రూపొందించి, బోధనా పద్ధతులలో ప్రధానమైన మార్పులను తీసుకొచ్చింది. కొత్త ఎన్‌సిఎఫ్ వెలుగులో తమిళనాడుతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో సిలబస్‌ను, పాఠ్య పుస్తకాలను ఆధునీకరించాయి.

దేశంలోని కొన్ని ప్రాంతాలలో సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ఒక సామాజిక ఉద్యమంగా రూపు దిద్దుకుంది. ప్రభుత్వ కార్యక్రమానికి నాయకత్వం వహించగల శక్తి కలిగిన సాంస్కృతిక సంస్థలు ఉంటాయని ఎవరూ ఊహించని ఉత్తరప్రదేశ్‌లో, మహిళా సమాఖ్య భాగస్వామ్యంతో అట్టడుగు సామాజిక తరగతుల బాలికలకు ఉద్దేశించిన కస్తూర్బా గాంధి పాఠశాలలు ఘన విజయం సాధించాయి. 2010లో పార్లమెంటులో ఆమోదించిన విద్యాహక్కు (ఆర్‌టిఇ) చట్టం

**“ ప్రణాళికా సంఘం రద్దు, ఎస్ఎస్ఎ లాంటి ప్రధానమైన కార్యక్రమాలకు నిధులు ఇచ్చే క్రమాన్ని మార్చటం రాష్ట్రాలకు ప్రాథమిక విద్య కోసం ఇచ్చే నిధులపై ప్రభావం చూపింది. ఇది ఎస్ఎస్ఎ వంటి ముఖ్యమైన కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపింది. ఆర్‌టిఇ అమలు కోసం నిధులు ఇచ్చే వేగాన్ని తగ్గించారు. దానితో పాటు కస్తూర్బా గాంధి పాఠశాలలకు ఇచ్చే నిధులను కూడా తగ్గించారు. ”**

లింగ సమానత్వం కోసం తీసుకుంటున్న చర్యలకు మకుటంగా నిలిచింది. ఈ పరిణామాలు మాధ్యమిక, ఉన్నత విద్యపై సామాజిక దృక్పథంలో గణనీయమైన మార్పులు వస్తాయని కల్పించిన ఆశలు నెరవేరేవి కాదని తర్వాత స్పష్టమైంది.

ప్రణాళికా సంఘం రద్దు, ఎస్ఎస్ఎ లాంటి ప్రధానమైన కార్యక్రమాలకు నిధులు ఇచ్చే క్రమాన్ని మార్చటం రాష్ట్రాలకు ప్రాథమిక విద్య కోసం ఇచ్చే నిధులపై ప్రభావం చూపింది. ఇది ఎస్ఎస్ఎ వంటి ముఖ్యమైన కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపింది. ఆర్‌టిఇ అమలు కోసం నిధులు ఇచ్చే వేగాన్ని తగ్గించారు. దానితో పాటు కస్తూర్బా గాంధి పాఠశాలలకు ఇచ్చే నిధులను కూడా తగ్గించారు.

అనేక రాష్ట్రాలలో ఎస్ఎస్ఎ ద్వారా జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే సంస్థలను పునరుద్ధరించటానికి తీసుకుంటున్న చర్యలకు విఘాతం కలిగించారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని దాదాపుగా ప్రైవేటీకరించారు. వినాశకరమైన చర్యలపై స్పందించిన సుప్రీంకోర్టు జస్టిస్ జెఎస్ వర్మ ఆధ్వర్యంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ సిఫార్సులు ప్రాథమికంగా కొంత ప్రభావం చూపాయి. తర్వాత నూతన విధానాల ప్రభావంలో కొట్టుకుపోయాయి.

పెద్దనోట్ల రద్దు, సరుకులు సేవల పన్ను (జిఎస్‌టి) విధింపు అసంఘటిత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. నిరుద్యోగం విపరీతంగా పెరగటంతో పాటు సామాన్య ప్రజల జీవితాలు దిగజారటానికి ఈ చర్యలు దోహదం చేశాయి. కోవిడ్-19 మహమ్మారి ప్రారంభమైనపుడు హఠాత్తుగా లాక్‌డౌన్ విధించటంతో పరిస్థితులు మరింతగా దిగజారాయి. పట్టణాలలో పని చేస్తున్న లక్షలాది మంది కార్మికులు తమ పిల్లలతో కలిసి తమ గ్రామాలకు తిరిగి వచ్చారు. వారిని చేర్చుకోవటానికి గ్రామాలలో ఉన్న పాఠశాలలు సిద్ధంగా లేవు. కోవిడ్ సమయంలో, ఆ తర్వాత తమ పిల్లలను పాఠశాలలకు పంపగలిగిన శక్తి, ముఖ్యంగా బాలికలను పంపగలిగిన శక్తి తల్లిదండ్రులకు తగ్గిపోయిందని ఈ పరిణామాలు స్పష్టం చేశాయి.

## ఉన్నత విద్య

ఉన్నత విద్య చిత్రాన్ని పరిశీలించినట్లైతే పాఠశాల విద్య వలెనే కనిపిస్తున్నప్పటికీ, వాస్తవంగా చాలా వ్యత్యాసం ఉన్నదని స్పష్టమౌతున్నది. ప్రస్తుతం అది సాగుతున్న మార్గం గత నాలుగు దశాబ్దాలుగా సాగిన ప్రయాణానికి భిన్నంగా ఉన్నది. వైద్యం, ఇంజనీరింగ్ లాంటి వృత్తి విద్యలలో 1970వ దశకంలోనే ప్రైవేటీకరణను ప్రారంభించారు. మొదట నమూనాగా ప్రారంభమైన కాపిటేషన్ ఫీజు విధానం 20వ శతాబ్దం చివరి నాటికి పూర్తిస్థాయిలో ఉన్నత విద్య ప్రైవేటీకరణకు దారితీసింది. ఎన్ఇపి తర్వాత ఆరు సంవత్సరాలకు వచ్చిన కార్యాచరణ పథకం (ప్రోగ్రాం ఆఫ్ యాక్షన్)లో ఈ మార్గాన్ని సూచించారు. ఉన్నత విద్యకు ప్రభుత్వ నిధులు భారీగా తగ్గిపోతాయని అనేకమంది పరిశీలకులు భావించారు. 2000 సంవత్సరంలో రూపొందించిన బిర్లా- అంబాని నివేదిక ప్రైవేటు పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచింది.

కొత్త శతాబ్దం గడుస్తున్న కొద్దీ పూర్తిగా ప్రైవేటీకరించిన యూనివర్సిటీల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. రాష్ట్ర శాసనసభల ఆమోదంతో ఏర్పడిన ఈ యూనివర్సిటీల యజమానులు ప్రభుత్వ యూనివర్సిటీలకు వర్తించే నిబంధనలు, చట్టాలతో కేంద్ర ప్రభుత్వ రెగ్యులేటర్లు తమను అదుపు చేయలేరని ప్రారంభంలోనే గుర్తించారు. ఈ విధానం మాట వరసకైనా అందరికీ సమానావకాశాలు కల్పించేదిగా లేదు. ఫీజుల విధానం, విద్యార్థులను చేర్చుకోవటం, అధ్యాపకుల నియామకం తదితరాలలో యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ రూపొందించిన రిజర్వేషన్‌లు, కనీస ప్రమాణాలను వారు పాటించాల్సిన అవసరం లేదు.

కొన్ని సిద్ధాంతపరమైన అంశాలపై ప్రయోగాలు చేస్తూ, ఉత్తేజం కలిగించే సంస్థలకు ఆమోదం తెలపటానికి ఉద్దేశించిన క్లాజు ద్వారా వీటికి ఆమోదం తెలుపుతున్నారు. ఈ క్లాజు వలన యుజిసి వాటిని “డీమ్డ్” యూనివర్సిటీలుగా పరిగణిస్తున్నది. ప్రైవేటు యూనివర్సిటీలకు ఆమోదం తెలుపటానికి, వారి డిగ్రీలను ఆమోదించటానికి-ప్రధానంగా ఇంజనీరింగ్ సంబంధిత రంగాలలో- ఈ క్లాజు సాధనంగా ఉపయోగపడుతున్నది.

అర్హతలు ఉన్నాయని చెప్పుకొని డిగ్రీలు పొందే విధానంతో ఇండియన్ డిగ్రి మార్కెట్ పూర్తిగా నిండిపోయింది. కరస్పాండెన్స్ కోర్సులు, ఆన్‌లైన్ లెర్నింగ్ తదితరాలతో డిగ్రీలు, డిప్లొమాలకు అంతకు ముందే విలువ తగ్గిపోయింది. ప్రైవేటు వారు నడుపుతున్న వాణిజ్య సంస్థలు “డిప్లొమా జబ్బు” -ఆర్థికవేత్త రొనాల్డ్ డోరే ఈ పదాన్ని ఉపయోగించాడు -ను పూర్తిస్థాయి మహమ్మారిగా మార్చాయి.

కొన్ని డిగ్రీలు, డిప్లొమాలను అమ్మటంలో విదేశీ భాగస్వాములు కూడా ఉన్నారు. తాము ఎందుకు చెల్లిస్తున్నామో అర్థం చేసుకోలేని తల్లిదండ్రుల నుండి వారు ఎక్కువ ధరను వసూలు చేస్తున్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసానికి అయిన ఖర్చులను పనిచేసి సంపాదించే పశ్చిమ దేశాలను అనుకరిస్తూ ప్రభుత్వం దీనికి “సెల్ఫ్ ఫైనాన్సింగ్” అని పేరు పెట్టింది.

పశ్చిమ దేశాలను, ముఖ్యంగా అమెరికాను అనుకరించటమే ప్రస్తుత విధానాలు, ఆచరణలో ప్రధానాంశంగా ఉంది. జరుగుతున్న దశాబ్దంలో అన్ని సెంట్రల్ యూనివర్సిటీలు అమెరికా తరహాలో నాలుగు సంవత్సరాల డిగ్రి కోర్సును ప్రారంభించాయి. తమ స్వంత విచక్షణతో కాకుండా పై నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈ పని చేశాయి. విద్యాపరమైన, వృత్తికి సంబంధించిన కోర్సులలో విషయ ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారు.

“ఉద్యోగాలకు సన్నద్ధం చేయటం కోసం” అన్న కొత్త నినాదంతో యువతలో నైపుణ్యాలను పెంచటానికి భారతదేశం కృషి

చేస్తున్నదని ఒకవైపున ప్రచారం చేసుకొంటూ, మరోవైపున ఆటోమేషన్‌పై మోజు చూయిస్తూ, ఆర్థికవ్యవస్థలోని అనేక రంగాలలో యువతను నైపుణ్య రహితులుగా మారుస్తున్నారు. డిగ్రీ కోర్సులలో సంకర విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాలు సంవత్సరాల తరబడి నిరసన తెలిపి అలసిపోయిన కారణంగా, ఇపుడు చెదురుమదురుగా వ్యక్తులు మాత్రమే దీనిని వ్యతిరేకిస్తూ మాట్లాడుతున్నారు.

> **“ ఉన్నత విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల కథ ఉపాధ్యాయుల స్థాయిని దిగజార్చిన ముఖ్యమైన వాటిలో ఒకటి. ఖాళీలను భర్తీ చేయటంలో అలసత్వం కారణంగా 1990 దశాబ్దం చివరి నుండి అనేక యూనివర్శిటీలు, కాలేజీలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. తర్వాత కాలంలో ఈ సంస్థలు తాత్కాలిక లేదా కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకోవటం లేదా డాక్టరేట్ చేస్తున్న విద్యార్థులను క్లాసులు చెప్పమని కోరటం ఒక విధానంగా మారింది. ”**

ఉన్నత విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల కథ ఉపాధ్యాయుల స్థాయిని దిగజార్చిన ముఖ్యమైన వాటిలో ఒకటి. ఖాళీలను భర్తీ చేయటంలో అలసత్వం కారణంగా 1990 దశాబ్దం చివరి నుండి అనేక యూనివర్శిటీలు, కాలేజీలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. తర్వాత కాలంలో ఈ సంస్థలు తాత్కాలిక లేదా కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకోవటం లేదా డాక్టరేట్ చేస్తున్న విద్యార్థులను క్లాసులు చెప్పమని కోరటం ఒక విధానంగా మారింది. ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయటానికి లాంఛనంగా అనుమతించినపుడు ఖాళీ పోస్టుల సంఖ్య భారీగా పెరగటంతో పాటు, ఒక్కో పోస్టుకు వందల మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల అర్హతను నిర్ణయించటానికి సాంకేతికాంశాలను ప్రాతిపదికగా తీసుకొంటున్నారు. సైద్ధాంతికంగా సాన్నిహిత్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వటం, కొందరికి అనుకూలంగా వ్యవహరించటం విధానంగా మారిపోయాయి.

మార్కెట్ దృక్పథం, నిర్ణయాలు చేసే అధికారాన్ని నిరంకుశాధికారుల చేతిలో పెట్టటంతో పాటు గ్రేడింగ్ విధానం వచ్చింది. దేశంలో ఉన్న యూనివర్శిటీలు, కాలేజిల పనితీరును అంచనా వేయటానికి 1994లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి)ను ఏర్పాటు చేశారు. విద్య నాణ్యతపై నయా–ఉదారవాద దృక్పధానికి అనుగుణంగానే ఈ చర్య ఉన్నది.

దీని అర్థం ఏమిటంటే అధికారులు హోటళ్ళకు వెళ్ళి పరిశీలించి, వాటికి స్టార్ హోదాను ఇచ్చిన విధంగానే, అధికారుల పరిశీలన ప్రాతిపదికగా యూనివర్శిటీలకు కూడా గ్రేడ్‌లు ఇస్తారు. కొంచెం అలస్యంగానే అయినప్పటికీ దీనిని డబ్బుతో జత చేశారు. విద్యార్థులను ఆకర్షించటానికి ప్రైవేటు యూనివర్శిటీలు పైస్థాయి గ్రేడ్‌లు సాధించటం కోసం ప్రయత్నం చేశాయి. ఇందుకోసం తనిఖీ చేయటానికి వచ్చే అధికారుల బృందాలను డబ్బు, ఇతర విధాలుగా సంతృప్తి పరిచే చర్యలు తీసుకుంటున్నారు.

విద్యాసంస్థల మధ్య పోటీ నాణ్యతను పెంచుతుందనే భావన ఎటువంటి అట్టహాసం లేకుండా విద్యను అభ్యసించటాన్ని, బోధనలో నాణ్యతను దెబ్బతీయటంతో పాటు విద్యారంగంలో మిగిలిన కొద్దిపాటి జీవాన్ని హరించి వేసింది. వీటిని నిలబెట్టుకోవటానికి యశ్‌పాల్ కమిటి చేసిన సూచనలను నిశ్శబ్దంగా సమాధి చేశారు. కొత్త రెగ్యులేటరీ నిబంధనలలో స్వంత మార్కెటింగ్ విధానాలను భాగంగా చేశారు.

అధ్యాపకుల అర్హతలు, తమ యూనివర్శిటీలు, కాలేజీలలో ఉన్న మౌలిక సదుపాయాలను గురించి ప్రచారం చేసుకోవటానికి వెబ్‌సైట్‌లు కేంద్రంగా మారాయి. అనేక యూనివర్శిటీలు, కాలేజీలు తమ ఘనతను ప్రచారం చేసుకోవటానికి టి వి, వార్తాపత్రికలను వినియోగించు కుంటున్నాయి. బోధన, విజ్ఞానాన్ని సరుకుగా మారుస్తున్న కాలంలోనే డిజిటల్ టెక్నాలజి వచ్చింది.

### కోవిడ్ అంతరాయం

కోవిడ్ లాక్‌డౌన్, అనంతర కాలంలో విద్యావ్యవస్థ అన్ని స్థాయిలలోనూ మరింత యాంత్రీకరణకు గురైంది. బోధన, పరీక్షలు ఆన్‌లైన్‌లోనే జరిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా వినియోగించుకోవటానికి మద్దతు ఇస్తూ కోవిడ్ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రకటించినపుడు ఎవరూ ఆశ్చర్యపడలేదు. అంతకు ముందే పాఠ్యాంశాలలో మార్పులు తీసుకురావటాన్ని ప్రారంభించారు.

పాఠశాల స్థాయిలో సీనియర్ సెకండరి స్కూల్ సిలబస్‌ను కుదించటానికి కోవిడ్ నిబంధనలు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరి ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)కు అవకాశం కల్పించాయి. పాఠ్య పుస్తకాలలో సైద్ధాంతిక దృక్పధానికి అనుగుణంగా మార్పులు తీసుకురావటానికి ఈ కోతలు దారితీశాయి. ఉన్నత విద్య పాఠ్యాంశాలలో తీసుకొచ్చిన మార్పులు విద్యను రాజకీయాలకు అనుగుణంగా ఉపయోగించుకోవటానికి దారితీసి, బోధనాపరమైన స్వేచ్ఛను హరించివేశాయి. ఏకాభిప్రాయాన్ని సాధించటానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని ప్రజల దృష్టికి తీసుకొస్తూ, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నూతన విధానానికి వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి.

స్వాతంత్ర్యానంతరం విద్యా విధానం చరిత్రలో ఇటువంటి ఘట్టాన్ని మనం చూడలేదు. పాలనలోనూ, సమాజంలోని ప్రతి విభాగంలోనూ జరుగుతున్న విభజన విదారంగంలోకి కూడా చొచ్చుకువచ్చింది. కోచింగ్ రంగం దినదినాభివృద్ధి చెందుతుండగా, ప్రధాన స్రవంతి విద్య తీవ్రంగా కుంచించుకుపోతున్నది.

విజ్ఞానానికి సంబంధించిన అన్ని విభాగాలలోనూ విదేశీ యూనివర్శిటీలలో చేరటానికి విద్యార్థులు బారులు తీరుతున్నారు. స్వాతంత్ర్యానంతరం మొదటి మూడు దశాబ్దాలలో విద్యారంగంలో అనుసరించిన స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యం అదృశ్యమైనదనటానికి ఇది సాక్ష్యంగా ఉన్నది.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

రాజకీయ పరిణామాలు

# దేశప్రతిష్ఠను దిగజార్చిన మోడి అమెరికా పర్యటన

**ఎ.కోటిరెడ్డి**



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

"సిద్దడు అద్దంకి పోనూ పోయాడు, రానూ వచ్చాడు" అన్న చందంగా మోడి అమెరికా పర్యటన ముగిసింది. ఎన్నికలలో విజయం సాధించిన తర్వాత వరుసగా ట్రంప్ భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో మోడి ఈ పర్యటన చేశాడు. ట్రంప్ అధికార స్వీకరణ కార్యక్రమానికి మోడికి ఆహ్వానం రాలేదు. ట్రంప్ అధికారం స్వీకరించి నెల రోజులు కూడా గడవకుండానే మోడీ అమెరికా పర్యటన కార్యక్రమం పెట్టుకున్నారు. ట్రంప్ మోడికి అత్యంత సన్నిహితంగా ఉన్నాడని, విశ్వగురు స్థానంలో మోడి ఉన్నాడని చూపటానికి ఈ పర్యటనను ఏర్పాటు చేశారు. విశ్వగురుకు ఇదే రుజువు అన్నట్లుగా బిజెపి, సంఘ్ పరివార్‌లు ఈ పర్యటనను ఉపయోగించుకోడానికి ప్రయత్నించాయి. అధికార పీఠాన్ని అధిష్టించినప్పటి నుండి ట్రంప్ మన దేశాన్ని అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారు. మన దేశీయుల కాళ్ళు, చేతులకు సంకెళ్ళు వేసి, సైనిక విమానాలలో అత్యంత అవమానకరంగా మన దేశానికి తిప్పి పంపిస్తున్నారు. ట్రంప్‌తో సమావేశం సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించి, భారతీయుల గౌరవాన్ని కాపాడే విధంగా మోడి వ్యవహరిస్తారని ప్రజలు భావించారు. కాని మోడి ఈ అంశాన్ని ట్రంప్ వద్ద కనీసం ప్రస్తావన కూడా చేయలేదు. మన దేశపు సరుకులపై అమెరికా అధిక టారిఫ్‌లు విధిస్తా మని ప్రకటిస్తుంటే ఆ విషయంపై కూడా నోరు మెదపలేదు.

భారతదేశం అమెరికాకు సామంత రాజ్యంలా వ్యవహరిస్తున్నదని మోడి పర్యటన ప్రపంచానికి స్పష్టం చేసింది. మోడి తమ దేశంలో ఉన్నంత వరకైనా మనదేశ ప్రయోజనాలకు-తాత్కాలికంగానైనా- నష్టం కలిగించే విధాన ప్రకటనలను ట్రంప్ పక్కన పెట్టాడా? ట్రంప్ గడ్డిపరక వాసి కూడా తగ్గలేదు. మోడితో అధికారికంగా సమావేశం కావటానికి కొద్ది గంటల ముందు అన్ని దేశాలతో పాటు భారతదేశంపై కూడా ఎక్కువ స్థాయిలో దిగుమతి సుంకాలు విధిస్థామని ట్రంప్ వెల్లడించారు. మోడితో సమావేశం తర్వాత జరిగిన ఉమ్మడి పత్రికా విలేకరుల సమావేశంలో అమెరికా సరుకులపై భారతదేశం అత్యధిక సుంకాలు విధిస్తున్నదని ప్రకటించారు. అమెరికా సరుకులపై ఇతర దేశాలు ఎంత మొత్తం సుంకాలు విధిస్తాయో ఆ దేశాలపై అమెరికా కూడా అంతే మొత్తం సుంకాలు విధిస్తుందని చెప్పారు. ట్రంప్ చేసిన ఆరోపణలను మౌనంగా వినటం మినహా, తాము విధిస్తున్న సుంకాలు ఏ విధంగా సమంజసమైనవో వివరించటం లేదా ట్రంప్ విధిస్తానని చెబుతున్న సుంకాలను వ్యతిరేకించే పరిస్థితిలో మోడి లేరు.

భారతదేశానికి అవసరమైన వాటిని సాధించటం ద్వారా దేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళటానికి ఉమ్మడి సమావేశంలో మోడి ప్రయత్నం చేసిందీ లేదు. అమెరికా నుండి సాధించినదీ లేదు. అమెరికా ప్రయోజనాల కోసం భారతదేశంపై ట్రంప్ విధించిన భారాలపై మారు మాటాడలేదు. ట్రంప్ మాత్రం ఉమ్మడి సమావేశాన్ని ఉపయోగించుకొని తన లక్ష్యాలను సాధించుకోవటానికి, భారతదేశంపై భారాలు వేయటంలో విజయం సాధించాడు. అమెరికా-భారత దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్యంలో అమెరికా 45.7 బిలియన్ డాలర్ల లోటుతో ఉంది. అమెరికా ఆయిల్, గ్యాస్‌ను ఎక్కువ దిగుమతి చేసుకోవటానికి, మరింత ఎక్కువ రక్షణ పరికరాలను కొనటానికి అమెరికా భారతదేశాన్ని అంగీకరింపజేసింది.

ట్రంప్‌ను సంతృప్తి పరచటానికి ఎక్కువ ఖరీదైన అమెరికా ఆయిల్, గ్యాస్‌ను భారత్ కొనుగోలు చేయాలి. ఇది మనదేశ ఆయిల్ దిగుమతి బిల్లును పెంచటంతో పాటు, వినియోగదారులకు పెనుభారంగా పరిణమిస్తుంది. అమెరికన్ ఆయిల్, గ్యాస్‌తో పోల్చుకుంటే రష్యా నుండి కొనుగోలు చేస్తున్న ఆయిల్, గ్యాస్ బాగా తక్కువ ధరకు వస్తున్నాయి. ఇపుడు అమెరికా నుండి వీటిని ఎక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటే ఆ మేరకు రష్యా నుండి దిగుమతులను తగ్గించుకోవాలి. అమెరికా నుండి దిగుమతులు పెరిగిన మేరకు మనదేశంపై భారం పెరుగుతుంది. రష్యా నుండి చేసుకొంటున్న దిగుమతులకు రూపాయలలో చెల్లించటంతో మనకు విదేశీ చెల్లింపుల భారం ఉండటం లేదు. కాని అమెరికా నుండి దిగుమతులు పెరిగితే ఆ బిల్లును డాలర్లలో చెల్లించాలి. డాలర్‌తో రూపాయి విలువ వేగంగా పడిపోతున్న పరిస్థితులలో ఇది పెనుభారంగా మారుతుంది. తన దేశం పట్ల, ప్రజల పట్ల ప్రేమ కలిగిన, నిజాయితీ పరుడైన ఏ రాజనీతిజ్ఞుడైనా తన దేశానికి తక్కువ ధరకు వచ్చే ఆయిల్, గ్యాస్‌లను వదులు కొని, ఎక్కువ ధరకు సరఫరా చేస్తానన్న వారి వద్దనుండి కొనుగోలు చేస్తాడా? అమెరికా ఆంక్షలకు తలొగ్గిన భారతదేశం ఇంతకు ముందే ఇరాన్ నుండి తక్కువ ధరకు వస్తున్న, నాణ్యమైన ముడి చమురును దిగుమతి చేసుకోవటాన్ని ఇంతకు ముందే ఆపివేసింది. ఏ మాత్రమైన స్వతంత్రంగా వ్యవహరించాలన్న, మన దేశానికి మరిన్ని రాయితీలు రాబట్టాలనే దృక్పధంతో ప్రభుత్వం ఉన్నా ఇరాన్, రష్యాల నుండి తక్కువ ధరకు వస్తున్న ఆయిల్, గ్యాస్ సరఫరాలను పోటి పెట్టి, అంతకన్నా తక్కువ ధరకు సరఫరా చేస్తేనే అమెరికా

నుండి ఆయిల్, గ్యాస్ దిగుమతి చేసుకుంటామని గట్టిగా బేరాలాడి ఉండేది. కాని మోడి మన దేశానికి అవసరమైన విధంగా బేరసారాలు చేయటానికి మారుగా ట్రంప్ అమెరికా ప్రయోజనాల కోసం గట్టిగా ప్రయత్నం చేస్తుంటే, మోడి గుడ్లప్పగించి చూడటం మినహా కనీసం నిరసన కూడా వ్యక్తం చేయలేదు.

వీటికన్నా ప్రమాదకరమైనది పది సంవత్సరాల పాటు ఉండే రక్షణ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై చర్చలు జరపటానికి భారత దేశాన్ని అమెరికా ఒప్పించింది. అది భారత దేశాన్ని వ్యూహాత్మకంగా, రక్షణపరంగా అమెరికాకు మరింత సన్నిహితంగా కట్టిపడేస్తుంది. అత్యంత ఖరీదైన, దాదాపుగా కాలం తీరిన ఎఫ్ 35 విమానాలను భారత్‌కు సరఫరా చేస్తామని ట్రంప్ ప్రతిపాదిస్తే మోడి–విశ్వగురువు–కాదనలేకపోయాడు. వందల కోట్ల డాలర్ల ఖరీదైన విమానాలను భారతదేశానికి సరఫరా చేయబోతున్నామని ట్రంప్ పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించాడు. అమెరికన్ సరుకులకు భారతదేశ మార్కెట్లను బార్లా తెరిపించాలని, అదే సమయంలో భారతదేశం నుండి అమెరికాకు సరుకుల ఎగుమలను నిరోధించటానికి భారీగా సుంకాలను విధిస్తామని ట్రంప్ చేస్తున్న ప్రకటనలపై మోడి స్పందించలేదు. ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించి, దేశ ప్రయోజనాలను కాపాడగలిగిన స్థితిలో మోడి ప్రభుత్వం లేదు.

వీటన్నింటి కన్నా అత్యంత ప్రమాదకరమైనది అమెరికా నుండి అణు రియాక్టర్లను కొనుగోలు చేయటంతో పాటు, అణు ప్రమాదం జరిగినపుడు రియాక్టర్లను సరఫరా చేసిన కంపెనీయే పరిహారం చెల్లించాలని చట్టంలో ఉన్న నిబంధనలను సవరించటానికి మోడి ప్రభుత్వం పూనుకున్నది. వెస్టింగ్ హౌస్ తయారు చేసిన అణు రియాక్టర్లను భారతదేశానికి సరఫరా చేయటాన్ని వేగిరం చేయాలని అమెరికా తొందర పెడుతున్నది. అణు రియాక్టర్ల సరఫరాదారులను ప్రమాదాలకు బాధ్యులను చేయకుండా తప్పించటం అంటే అమెరికాతో పాటు ఇతర దేశాలలో అణు రియాక్టర్లు తయారు చేసే కంపెనీలు మనదేశ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటానికి అవకాశం ఇవ్వటమే.

ఈ విధంగా హడావిడిగా చేసిన అమెరికా పర్యటనలో ట్రంప్ ఆదేశాలన్నింటికీ మోడి వినమ్రంగా అంగీకరించాడు. మన దేశానికి

> **“ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని, స్వభావాన్ని, జాతీయోద్యమంలో ఆ సంస్థ వ్యవహరించిన తీరును పరిశీలిస్తే ట్రంప్‌తో మోడి ప్రవర్తించిన తీరు ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. భూస్వామ్య భావజాలానికి పూర్తిగా కట్టుబడి, ప్రజాస్వామిక వ్యవస్థను, ప్రజల సమానత్వాన్ని, సమైక్యతను వ్యతిరేకించటం, భారతీయులను మతపరంగా విభజించటం ద్వారా కులప రంగా సమాజంలో ఉన్న అసమానతలను కొనసాగించటమే ఆ సంస్థ లక్ష్యం. ”**

నష్టం కలిగించే చర్యలను ప్రతిఘటించటానికి, భారతీయులను అవమానాల నుండి తప్పించటానికి, మన దేశానికి ప్రయోజనం కలిగించే వాటిని సాధించటానికి వీసమెత్తు ప్రయత్నం కూడా చేయలేదు.

**సామ్రాజ్యవాదానికి దాసోహం అనటం ఆర్ఎస్ఎస్ స్వభావం**

ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని, స్వభావాన్ని, జాతీయోద్యమంలో ఆ సంస్థ వ్యవహరించిన తీరును పరిశీలిస్తే ట్రంప్‌తో మోడి ప్రవర్తించిన తీరు ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు. భూస్వామ్య భావజాలానికి పూర్తిగా కట్టుబడి, ప్రజాస్వామిక వ్యవస్థను, ప్రజల సమానత్వాన్ని, సమైక్యతను వ్యతిరేకించటం, భారతీయులను మతపరంగా విభజించటం ద్వారా కులప రంగా సమాజంలో ఉన్న అసమానతలను కొనసాగించటమే ఆ సంస్థ లక్ష్యం. దేశ ప్రయోజనాలను వమ్ము చేయటానికి సామ్రాజ్యవాదంతో కుమ్మక్కు కావటం దాని సహజ లక్షణం. 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పడినప్పటి నుండి ఆ సంస్థ ఏనాడూ దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం పాల్పడుతున్న దారుణాలను వ్యతిరేకించ లేదు. స్వాతంత్ర్యం కోసం దేశప్రజలు చేస్తున్న పోరాటంలో భాగస్వామి కాలేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర శక్తులు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తుంటే, బ్రిటిష్ వారికి సమస్యలు ఎదురైనపుడల్లా ఆర్ఎస్ఎస్ జాతీయోద్యమాన్ని వ్యతిరేకించి, బ్రిటిష్ వారికి సహకరించింది. సహాయ నిరాకరణ ఉద్యమ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వానికి అన్ని విధాలైన సహకారం అందించింది.

ఈ విధంగా సామ్రాజ్యవాదులకు సహకరించిన సంస్థ ఇప్పుడూ సామ్రాజ్యవాదులతో చెట్టపట్టాలు వేసుకొని, దేశ ప్రయోజ నాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. తన భావజాలాన్ని ముందుకు తీసుకుపోవటానికి, సామ్రాజ్య వాదుల దోపిడీకి ప్రతిఘటన ఎదురు కాకుండా చేయటం కోసం దేశ ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది. సనాతన దృక్పథంతో దేశ పురోగతికి విఘాతం కలిగిస్తున్నది. మతమౌఢ్యం, మూఢ విశ్వాసాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజలను క్రియా శూన్యులుగా చేసి, బడా పెట్టుబడిదారులు, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను నెరవేరుస్తున్నది. దేశ సంపదలైన అడవులు, నదులు, కొండలు, గనులు, సముద్రాలు, ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రజల ఆస్తులు, ఆదాయాలు, సమస్తాన్నీ అదాని, అంబాని లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. ఈ విధానాలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించకుండా చేయటం కోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజలను విభజిస్తున్నది.

స్వభావరీత్యానే సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే, ప్రజలను విభజించి, దేశాన్ని బలహీనపరిచే ఆర్ఎస్ఎస్ అందుకు భిన్నంగా వ్యవహరించటం జరిగేది కాదు. దాని విభజన వాదాన్ని, మతోన్మాదాన్ని ఎదిరించి, పోరాడటం ద్వారానే మనదేశం అమెరికన్ సామ్రాజ్య వాదులకు లొంగిపోకుండా, స్వతంత్రంగా వ్యవహరించేలా చేయటం సాధ్యమౌతుంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటమే మతోన్మాదాన్ని వెనక్కు కొట్టి, భారతదేశ సమైక్యతను కాపాడుతుంది.

**దిగజారుతున్న ఆర్థికవ్యవస్థ**

“బుద్ధులు భూములేలుతుంటే రాతలు గాడిదలు కాశాయన్న” చందంగా మోడి ప్రభుత్వం 2047 నాటికి దేశాన్ని ప్రపంచంలో రెండవ ఆర్థికవ్యవస్థగా అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేస్తుండగా, ఆర్థికాభివృద్ధి సూచీలు అట్టడుగుకు దిగజారుతున్నాయి. కీలకరంగాలన్నీ నేల చూపులు చూస్తున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతున్నదని, రోజువారి వినియోగం కోసం కూడా ప్రజలు రుణాలు తీసుకోవాల్సి వస్తున్నదని వివిధ సంస్థలు చేసిన అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో దేశ

> **"ఏడాది క్రితంతో పోలిస్తే మూడో త్రైమాసికలో కొత్త పెట్టుబడుల సమీకరణ 9.3 నుండి 5.7 శాతానికి తగ్గింది. ఇతరంగా వస్తున్న పెట్టుబడులలో ఎక్కువ భాగం ప్రభుత్వం చేతిలో ఉన్న పరిశ్రమలను స్వంతం చేసుకోవటానికి వస్తున్నాయి. ఒక పరిశ్రమ ప్రభుత్వం చేతిలో నుండి ప్రైవేటు వారి చేతిలోకి వెళితే అదనంగా జరిగే అభివృద్ధి ఏమీ ఉండదు. అందు వలన దేశంలోని ప్రజలు అదనంగా ఖర్చు పెట్టటానికి అవసరమైన ధనాన్ని వారి చేతుల్లో పెట్టకుండా అభివృద్ధిని సాధించటం సాధ్యం కాదు."**

జిడిపి పెరుగుదల 6.2 శాతానికి పరిమితమైంది. ఇది రిజర్వు బ్యాంకు అంచనాల కన్నా 0.2 శాతం తక్కువ. అంతకు ముందు త్రైమాసికంలో నమోదైన 5.6 శాతం కన్నా ఇది ఎక్కువ అని సంబరపడుతూ, చివరి త్రైమాసికలో 7.6 శాతం పెరుగుదల ఉంటుందని, దానితో 2024 సంవత్సరంలో జిడిపి పెరుగుదల 6.5 శాతానికి చేరుతుందని ప్రభుత్వం ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నది. కాని ఇది అత్యాశేనని, ఆ స్థాయిలో జిడిపి పెరగటానికి అవకాశాలు తక్కువ ఉన్నాయని ఆర్థిక వేత్తలు స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం వాస్తవ పరిస్థితులతో సంబంధం లేకుండా ఆర్థికాభివృద్ధిని గురించి అతి అంచనాలు వేస్తున్నది. అభివృద్ధి జరగాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగటం, తద్వారా మార్కెట్ విస్తరించటం, కొత్త పెట్టుబడులు రావటం, కొత్త పరిశ్రమలు నిర్మించటం, నిరంతరం మరింత ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించటం ప్రధానంగా జరగాలి. కాని ప్రభుత్వం దీనికి భిన్నమైన చర్యలు తీసుకుంటున్నది. ఉద్యోగుల, కార్మికుల వేతనాలు తగిన మోతాదులో పెంచటానికి, రైతుల పంటలకు మద్దతు ధరలు ఇవ్వటానికి, ఉపాధి హామికి అధికంగా నిధులు కేటాయించటానికి, పని చేస్తున్న కూలీల వేతనాలు పెంచటానికి, ఇతరంగా వివిధ రకాల పనులు చేస్తున్న శ్రామిక ప్రజల వేతనాలు పెరగటానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవటం లేదు. ఈ చర్యలు తీసుకుంటే ప్రజల చేతుల్లోకి అదనంగా డబ్బు చేరుతుంది. ఎక్కువ సరుకులు కొంటారు. దానితో ఆర్థికాభివృద్ధికి ఊతం దొరుకుతుంది. ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరించటం వలన ప్రజల కొనుగోలు శక్తి కుంచించుకుపోతున్నది. వీటితో పాటు రూపాయి మారకం విలువ క్షీణించటం కూడా ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తున్నది. వీటితో పాటు సుంకాలు పెంచటానికి ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కూడా జిడిపి పెరుగుదలపై ప్రభావం చూపుతాయి.

మరొక అంశం, కొత్తగా పెట్టుబడులు పెట్టటం తగ్గిపోతున్నది. సంవత్సరం క్రితంతో పోల్చుకుంటే మూడవ త్రైమాసికలో కొత్తగా పెట్టుబడుల సమీకరణ 9.3 నుండి 5.7 శాతానికి తగ్గింది. ఇతరంగా వస్తున్న పెట్టుబడులలో ఎక్కువ భాగం ప్రభుత్వం చేతిలో ఉన్న పరిశ్రమలను స్వంతం చేసుకోవటానికి వస్తున్నాయి. ఒక పరిశ్రమ ప్రభుత్వం చేతిలో నుండి ప్రైవేటు వారి చేతిలోకి వెళితే అదనంగా జరిగే అభివృద్ధి ఏమీ ఉండదు. అందువలన దేశంలోని ప్రజలు అదనంగా ఖర్చు పెట్టటానికి అవసరమైన ధనాన్ని వారి చేతుల్లో పెట్టకుండా అభివృద్ధిని సాధించటం సాధ్యం కాదు. ప్రజల జీవితాలలో అభివృద్ధి లేకుండా పారిశ్రామికాభివృద్ధి సాధించటం, జిడిపిని పెంచటం కూడా సాధ్యం కాదు.

తాజాగా కార్మికులు, ఉద్యోగుల చేత వారానికి 70, 90 గంటలు పని చేయించాలన్న డిమాండ్ కూడా ఆర్థికాభివృద్ధికి దోహదం చేసేది కాదు. కార్మికులు, ఉద్యోగుల చేత ఇపుడు చేయిస్తున్న పని కన్నా ఎక్కువ గంటలు పని చేయిస్తే కొత్తగా ఉద్యోగాలు రావటం మరింతగా తగ్గిపోతుంది. వేతనాలు పొందే వారి సంఖ్య తగ్గుతుంది. ఆ మేరకు సరుకుల కొనుగోలు కూడా తగ్గుతుంది. ఇప్పటికే విపరీతంగా ఉన్న సంపద కేంద్రీకరణ మరింత పెరుగుతుంది.

అందువలన ప్రభుత్వం ఒకవైపున జిడిపి పెరగాలని చెబుతూ, మరోవైపున జిడిపి, ఆర్థికాభివృద్ధిని కుంగదీసే చర్యలు తీసుకుంటున్నది. ఇదే మార్గంలో ఆర్థిక విధానాలు కొనసాగితే మనదేశం 2047 నాటికి ప్రపంచంలో రెండవ స్థానానికి ఎగబాకటం కాదు. పదవ స్థానానికి పడిపోయినా ఆశ్చర్యం లేదు. అవకాశాలను అందిపుచ్చుకొని, సక్రమంగా సంపద పంపిణీ చేయటం ద్వారా మార్కెట్లను విస్తరించుకొనే దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయి. మనదేశం లాగా ప్రజల ఆదాయాలను పెంచి, మార్కెట్‌ను విస్తరించుకోవటానికి చర్యలు తీసుకోని దేశాలు అట్టడుగు స్థానాలకు చేరతాయి. ❋

# స్వతంత్ర్య మీడియా

(28వ పేజీ తరువాయి)

నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నది. వార్తలకోసం, సమాచారం కోసం ఈ మీడియా మీద ప్రజల ఆధారపాటు క్రమంగా తగ్గిపోతా వస్తుంది. దాని విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలు వారి స్వంత సమాజిక మాధ్యమాల ద్వారా ఈ అభిప్రాయాలు స్పష్టంగానే వెల్లడిస్తున్నారు. ఇంక ప్రభుత్వం, అధికార పార్టీ అయితే స్వతంత్ర మీడియా అనేది ప్రజాస్వామ్యానికి మూలధాతువు అన్న మౌలికసూత్రాన్ని అస్సలు సరకు చెయ్యడం లేదు.

అమెరికాలో 'ప్రొటెక్ట్ డెమోక్రసి' (ప్రజాస్వామ్య పరిరక్షణ) అనే లాభాపేక్షేతర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన అయాన్ బాసిన్ 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక విలేకరి మైఖేల్, ఎస్. స్మిమిడ్‌కు ఒక ఇంటర్వ్యూ ఇస్తూ – "స్వేచ్ఛ అంటే మనం చేపట్టే కార్యకలాపాల మూలంగా వేధింపులు, ముఖ్యంగా ప్రభుత్వం నుండి వేధింపులు ఎదురవుతాయనే భయం లేకుండా ఉండడమే. నువ్వు ఎవరు, ఏం ఆలోచిస్తున్నావ్, నీ హక్కులను ఎలా వినియోగించుకుంటున్నావ్, లేదూ ఒక నాయకుడి పట్ల నీ ఇష్టాన్ని ఎలా వ్యక్తం చేస్తున్నావ్ అన్న అంశాల ఆధారంగా ఏదేని ప్రభుత్వం రాజ్యాధికారాన్ని ఉపయోగించి నిన్ను వేధించడానికి, శిక్షించడానికి చూస్తుందంటే నీకు ఇక ఎంత మాత్రం స్వేచ్ఛలేదని అర్థం" అని సూటిగా వివరించాడు.

ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా బాసిన్ ఈ వ్యాఖ్యానం చేసాడు. ఆ ఎన్నికలలో ట్రంప్ గెలిచాడు. బాసిన్ అభిప్రాయాలు మనదేశానికి సరిగ్గా అతికినట్లు వర్తిస్తాయి.

**(అనువాదం : కె. సత్యరంజన్)**

# ఇతిహాసాల వక్రీకరణ

(2వ పేజీ తరువాయి)

విలువిద్య నేర్చుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు గురువు శాపానికి, భూదేవి శాపానికి, ఒక పురోహిత బ్రాహ్మణ శాపానికి గురైయ్యాడు. యుద్ధభూమిలో అనేక సమస్యలు ఎదుర్కొన్నాడు. యుద్ధభూమిలో కర్ణుడు మరణించినప్పుడు, "దుర్మార్గుడు చచ్చాడు అని హేళనగా అర్జునుడు కృష్ణుడితో అన్నప్పుడు కృష్ణుడు అంటాడు ఇలా:

నరవర! నాచే నీచే
వరమడిగిన కుంతి చేత,
వర విప్రునిచే, ధర చే,
అరయంగా కర్ణు డీల్గే నార్వుర చేతన్.

ఆ విధంగా కర్ణుడు ఎంత గొప్పవాడో ఆరుగురు శాపాల వలన చనిపోయాడే గాని అతను గొప్ప వీరుడు అని కృష్ణుని నోటనే పలికించాడు వ్యాసుడు.

భారతంలోని ప్రతి పాత్రలోనూ ఆ పాత్రకు సంబంధించిన బలాలూ, అలానే బలహీనతలూ ఉంటాయని చెప్పుకున్నాం కదా! అలానే కర్ణుడికి కూడా ఉన్నాయి. ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతూ ఉంటే కర్ణుడు చూస్తూ ఊరుకున్నాడే కానీ అడ్డుకోలేదు. అలానే దుర్యోధనుడు శకుని వన్నే వన్నాగాలలో కూడా తాను పాలుపంచుకున్నాడు. మరి అదే నిండు కొలువులో కురుపితామహుడు భీష్ముడు, కౌరవ పాండవులకు విద్య నేర్పిన గురువు ద్రోణాచార్యుడు లాంటివారు కూడా ఉన్నారు కదా! వీరు చూస్తూ ఊరుకున్నారే కానీ ఎవరూ అడ్డుకోలేదు కదా!

కురు పితామహుడైన భీష్ముడు పెళ్లి పీటల మీద ఉన్న పెళ్లికూతుళ్లను తీసుకువచ్చి తన తమ్ముళ్లకు పెళ్లి చేశాడు. అయినా పితామహుడు గొప్పవాడే కదా! యుద్ధరంగంలో పద్మ వ్యూహ రచన చేసి అభిమన్యుడు చావటానికి కారకుడైన ద్రోణాచార్యుడు గొప్పవాడే కదా! ఎరుకలవాడైన ఏకలవ్యుడు ద్రోణాచార్యుని బొమ్మను పెట్టుకుని విలువిద్యలో నైపుణ్యం సాధిస్తే అది చూసి తన శిష్యుడైన అర్జునుడికన్నా గొప్పవాడు అయిపోతాడు అన్న భయంతో అతని బొటనవేలును దక్షిణగా తీసుకున్న ద్రోణాచార్యుడు లాంటివారు గొప్పవారైనప్పుడు, వీరులైనప్పుడు, కర్ణుడు వీరుడు కాకుండా ఎలా పోతాడు?

నిజానికి హిందూత్వ వాదులు మహాభారతంలో కర్ణుని వంటి వీరులను భీరులుగా చూడం, చూపడానికి ప్రయత్నించడం వెనుక వారి అగ్రకులాహంకార సైద్ధాంతిక భావజాలం కనిపిస్తుంది.

హైందవ శంఖారావసభలో వీహెచ్పీ జాతీయ అధ్యక్షుడితో పాటు చిన్న జీయర్, గణపతి సచ్చిదానంద స్వామి, కమలానంద భారతి, చిన్న స్వామి, గంగరాజు లాంటి వాళ్ళందరూ ఉన్నారు. వీరందరూ హిందూమతానికి ఇతర మతాల వలన హాని జరుగుతుందనీ, హిందూ మతం ప్రమాదంలో పడిందనీ, దానిని ఇప్పుడు పరిరక్షించుకోవాలని మాట్లాడారే తప్ప, అసలు హిందూ మతానికి హాని చేసింది హిందూమతంలోని వర్ణ వ్యవస్థ అనే విషయాన్ని చెప్పలేదు. శతాబ్దాల కాలంగా దళితులను గిరిజనులను శూద్రులను అస్పృశ్యులుగా ఊరికి దూరంగా పెట్టి దేవాలయాల్లో ప్రవేశం లేకుండా చేసి, అంటరానితనాన్ని పాటించిన వర్ణాలకు సంబంధించిన వారే కదా ఈ వేదిక మీద నుండి హిందూ మతాన్ని, ధర్మాన్ని పరిరక్షించాలని గావుకేకలు వేశారు. దేవాలయాల ప్రవేశం లేకుండా చేసి అస్పృశ్యతను పాటించిన కారణంగానే నిమ్న వర్గాల వారు క్రైస్తవానికో, ముస్లిం మతానికో మరో ఇతర మతాలకో మారవలసి వచ్చింది అన్న విషయాన్ని ఈ స్వాములు గ్రహించాలి కదా. హిందూ మతం అంటేనే కుల వివక్ష. అదే హిందూ ధర్మం, లేక ఇప్పుడు వీరంతా చెబుతున్న సనాతన ధర్మం. నిచ్చెన మెట్ల వ్యవస్థ. అంటే ఒక కులం మీద మరో కులాన్ని నిలబెట్టడం. ఒక కులాన్ని మరో కులం చేత తొక్కించటం. ఇంకొక కులం చేత తొక్కించుకోవటం. ఒకే సమయంలో వీరు పీడకులు, పీడితులు. ఇది ఒక స్ట్రక్చర్. ఈ కుల సమాజంలో అణిచివేత ఉంటుంది. ఈ అణిచివేత కింది కులాల మీద ఎక్కువగా పడుతుంది. ఈ నిర్మాణాన్ని ఎవరు ప్రశ్నించినా భరించలేరు. సనాతన ధర్మానికి విఘాతం పేరుతో ఎదురుదాడికి దిగుతారు. సమాజంలో కులవ్యవస్థ వల్ల ఏర్పడిన హెచ్చుతగ్గుల గురించి అందులో జరగవలసిన సంస్కరణల గురించి ఆ సభలో మాట్లాడితే బాగుండేది.

హిందూ మతం ఐక్యంగా ఉండాలి. మనమందరం హిందువులం, సింధూ నది బిందువులం అంటూ ప్రబోధించే వీరిలో చిన్న జీయర్ స్వామి శివుడిని దేవుడుగా కొలుస్తాడా? శివుడు దేవుడు అనే మాట ఆయన నోటినుండి ఎప్పుడైనా వచ్చిందా? హిందూమతంలో ఉన్న వేరే శాఖను గుర్తించటానికి సిద్ధపడని వీరు హైందవ ధర్మ పరిరక్షకులా? ఆలోచించాల్సిన పనిలేదా? తిరుమల తిరుపతిలో ఉన్న పూజారులను శ్రీకాళహస్తికి బదిలీ చేసి, శ్రీకాళహస్తిలోని పూజారులను తిరుమల తిరుపతి దేవస్థానానికి బదిలీ చేయమనండి. ఈ రెండు దేవస్థానాలలో ఉన్నది హిందూ మత పూజారులే కదా. మార్చమనండి. వీరి హిందూ మత ధర్మరక్షణ ఏమిటో దాని సంగతి ఏమిటో తెలుస్తుంది.

హిందూమతంలో కుల వ్యవస్థ ఉన్నది అని అంటే ఒప్పుకోరు, ఒక వేళ ఒప్పుకుంటే దాన్ని బ్రిటిష్ వారికి ఆపాదిస్తారు. కుల వ్యవస్థ అన్నది బ్రిటిష్ వాళ్ళు తెచ్చిపెట్టిందేనని బుకాయిస్తారు. మరి బ్రిటిష్ వాళ్ళు పరాయి వాళ్ళు కదా! వారు తెచ్చి పెట్టిన ఈ కుల వ్యవస్థ పోవాలని హిందుత్వ వాదులు పోరాడాలి కదా! మరి ఎందుకు కుల వ్యవస్థ పోవాలని పోరాడరు? అలా పోరాడకపోగా కులం గడపలో ఉంచుకోండి. మతం గడప బయటకు తీసుకురండి అని కొత్త నినాదాలు ఎందుకు ఇస్తున్నట్లు? మను స్మృతి ప్రకారం శూద్రులు తక్కువ జాతి వారు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మినహాయించి మిగిలి వారందరూ శూద్రులే. కమ్మ, కాపు, రెడ్డి, చాకలి, మంగలి, గౌడ, యాదవ్ లాంటి వారందరూ శూద్రులే. వీరి ఎడల హిందూ మతం ఎంతో అవమానియంగా ప్రవర్తించింది గత రెండున్నర వేల సంవత్సరాలుగా. ఈ శంఖారావసభ కేవలం శూద్రుల భుజాల మీద పెట్టి హిందుత్వ తుపాకీ పేల్చటమే. ఇవాళ సమాజాన్ని మతవిద్వేషాలతో అల్లర్లతో అల్లకల్లోలం చేయడం వాళ్ల ఎజెండా. పెద్ద ఎత్తున జన బహుళ్యం వాళ్ళ వెంట లేకపోతే ఈ ఎజెండా ముందుకు తీసుకుని పోలేరు. అందుకే చేగొండి అనంత శ్రీరామ్ లాంటి శూద్రుడిని తీసుకొచ్చి ఆయనతో ఇలాంటి మాటలు అనిపించడం హిందుత్వవాదుల వ్యూహంలో భాగమే.

సమాజంలో 80% గా ఉన్న బహుజనుల మెదడులను కలుషితం చేసి వాళ్లతోనే వాళ్ళ కళ్ళను పొడుస్తూ ఈ ఎజెండాను తీసుకు వెళుతున్నారు. దేశం మొత్తాన్ని ఒక ఉన్మాద స్థితిలోకి తీసుకు వెళ్ళటానికే ప్రయత్నం చేస్తున్నారు. ప్రగతిశీల ప్రజానీకం దీన్ని గమనించి వాళ్ళ ట్రాప్‌లో పడకుండా, ఆ భావజాలాన్ని తుదముట్టించుటమే కర్తవ్యంగా పెట్టుకోవాలి. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 10 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# సౌర విద్యుత్ ఉత్పత్తిలో ఛాంపియన్‌గా ఎదిగిన చైనా



సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో చైనా ప్రపంచ దేశాలు అందుకోలేనంత ఎత్తుకు ఎదిగిపోయింది. ఆ దేశంలో సౌర విద్యుత్ స్థాపక ఉత్పత్తి సామర్థ్యం 2024లో 900 గిగా వాట్లను చేరుకుంది. 2025 చివరికి అది 1,200 గిగావాట్లకు చేరుకుంటుందని అంచనా. విశేషమేమంటే 2030వ సంవత్సరం నాటికి దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,200 గిగా వాట్లకు పెంచాలని చైనా ప్రభుత్వం నిర్ణయించుకుంది. కానీ అయిదేళ్లు ముందుగానే అది ఆ లక్ష్యాన్ని చేరుకోబోతున్నది.

సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యంలో చైనా తరువాతి స్థానాల్లో అమెరికా, భారత దేశం ఉన్నాయి. 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో స్థాపక సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 220 గిగావాట్లు, భారత దేశంలో 2025 జనవరి 1 నాటికి స్థాపక సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 100.33 గిగావాట్లు. జపాన్ కూడా సౌరవిద్యుదుత్పత్తిలో దాదాపు భారత్‌తో సమానంగా ఉంది. ఐరోపా దేశాల్లో జర్మనీ ఈ రంగంలో ముందంజలో ఉంది. ఆ దేశంలో 2023 చివరి నాటికి సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 82 గిగావాట్లు.

2015లో చైనా సౌరవిద్యుదుత్పత్తిలో జర్మనీని దాటి ముందుకు పోయింది లగాయతు శరవేగంగా పురోగమిస్తోంది. ప్రస్తుతం అది ప్రపంచ సౌరవిద్యుత్‌లో మూడోవంతుకు పైగా వినియోగిస్తోంది. అమెరికాతో పోలిస్తే ఇది రెట్టింపుకన్నా ఎక్కువ. అంటేకాదు ప్రపంచ వ్యాపితంగా ఉత్పత్తి అవుతున్న సౌర విద్యుత్ పానల్స్‌లో 80 శాతం వరకు చైనాలో ఉత్పత్తి అవుతున్నాయి. 2022లో ప్రపంచం మొత్తం ఉత్పత్తి చేసిన సోలార్ పానల్స్‌కన్నా ఎక్కువ పానల్స్‌ను చైనా ఉత్పత్తి చేసిందని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) తెలిపింది.

2028 నాటికి ప్రపంచ పునరుత్పాదక ఇంధనంలో 60 శాతం చైనాలో ఉత్పత్తి అవుతుందని అంతర్జాతీయ సంస్థల అంచనా. చైనా ప్రభుత్వం ప్రారంభంలో సౌరవిద్యుదుత్పత్తికి అనేక రకాల సబ్సిడీలు, మద్దతులు ఇచ్చింది. 2022లో ఈ మద్దతు ఉపసంహరించుకున్నప్పటికీ, సబ్సిడీలను ఎత్తివేసినప్పటికీ ఆ దేశంలో సౌరవిద్యుత్ రంగం శరవేగంతో పురోగమిస్తూనే ఉంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ......................................................

వీధి ......................................................

గ్రామం ......................................................

మండలం లేదా పట్టణం ......................................

జిల్లా ......................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.